: fb.com/vaartha Digital
WWW.VAARTHA.COM
epaper.vaartha.com
Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఖమ్మం
7-6-2025 శనివారం
సంపుటి: 31 సంచిక: 126
పేజీలు: 8+16 వెల: 6.50

# కొరివి దెయ్యాలను తరిమికొట్టాల్సిందే



## యాదగిరిగుట్ట అపచారానికి భారీ మూల్యం చెల్లించినా గత పాలకులకు బుద్ధి మారలేదు

### రైతులపై విషం చిమ్ముతున్న బిఆర్ఎస్, బిజెపి నేతలు

### లక్ష్మీ నరసింహస్వామి పుణ్యక్షేత్రాన్ని వైటిడిగా తీర్చిదిద్దుతున్నాం

### వాసాలమర్రిలో రూ. 1500 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్

**భువనగిరి/తుర్కపల్లి, జూన్ 6 ప్రభాతవార్త:** యాదగిరిగుట్ట వద్ద చేసిన అపచారానికి భారీ మూల్యం చెల్లించుకున్నా బుద్ధి మారడం లేదని, చేసిన పాపాలు ఎక్కడికి పోవన్న, అవి నీ వెంటనే నీడలా వస్తాయని బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఘాటైన విమర్శలు చేశారు. శుక్రవారం ఆయన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిలో రూ.1500 కోట్లతో మంజూరు అయిన అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. అనంతరం ఆక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. తమ పార్టీలో దయ్యాలు చేరాయని, ఆపార్టీ నాయకురాలే చెప్పినా జవాబు ఇవ్వలేక దయ్యాల నేత ఫామ్ హౌస్‌లో నిద్ర పోతున్నాడని ఆయన ఆరోపించారు. నన్ను ఇబ్బందిపెట్టి జైలులో పెట్టిన వారిని పడగొడ తానని చెప్పా. పట్టుబట్టా.. పనిపట్టా.. పడగొట్టి ఆ కుర్చీలో కూర్చు న్నానని, తన జీవిత లక్ష్యం నెరవేరిందని, ఇక మీ లక్ష్యాలను నెరవేర్చుతానని భావోద్వేగాల నడుమ సిఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం చర్చనీయాశంగా మారింది.

పదేళ్లు ఆశీర్వదిస్తే ఖలియన్ డాలర్ ఎకనామీగా తెలంగాణ రాష్ట్రాన్ని మార్చుతానని, భారత్ ఫ్యూచర్ సిటీని ప్రపంచానికి గొప్ప నగరంగా అందిస్తానన్నారు. నోటీసులు ఇస్తేనే ఆగమాగమౌతున్నామని, నెలల కొద్ది జైలులో ఉంటే తామేమి అనుకోవాలని బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి ఘాటైన వాఖ్యలు చేశారు. బిఆర్ఎస్ కాదని, విఆర్ఎస్, దయ్యాల రాష్ట్ర సమితిని పొలిమెర దాటే వరకు తరమి కొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పదేళ్లు దోచుకున్న బిఆర్ఎస్ నేతలు రాష్ట్రాన్ని రావణ కాష్టంగామార్చారని, రాష్ట్రాన్ని దివాలాతీసి ఇన్‌స్టాల్ మెంట్స్‌లో వేతనాలు చెల్లించినవారు తనను ప్రశ్నిస్తారనా అంటూ వ్యంగ్యాస్త్రాలను సంధించారు. దయ్యాలను పొలి >>2



జమ్ము-కాశ్మీర్‌లో ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన చీనాబ్ వంతెనను శుక్రవారం ప్రారంభించిన అనంతరం త్రివర్ణ పతాకం చేతపట్టుకుని వంతెనపైనుంచి నడిచి వెళ్లిన ప్రధాని మోడీ

## జమ్ముకాశ్మీర్ పర్యాటకరంగంపై పాకిస్థాన్ కుట్రలు: ప్రధాని మోడీ 2లో

## కర్ణాటక సిఎం కార్యదర్శి, ఇంటెలిజెన్స్ చీఫ్ ఔట్

### తొక్కిసలాట కేసు: ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్ అరెస్టు

**బెంగళూరు,జూన్6:** నగరంలో జరిగిన తొక్కిస లాట నేపథ్యంలో బెంగళూరు పోలీస్ కమిషనర్ మరియు మరికొందరు కీలక పోలీసు అధికారులను సస్పెండ్ చేసిన మరుసటిరోజే కర్ణాటక ముఖ్య మంత్రి సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి కె. గోవిందరాజ్‌ను తొలగించి, నిఘా విభాగం అధిపతి హేమంత్ నింబాల్కర్‌ను బదలీ చేసింది. బుధ వారం ఉదయం ముఖ్యమంత్రి ఇంట్లో జరిగిన కీలక సమావేశంలో తొక్కిసలాటకు కొన్ని గంటల ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయో త్సవ వేడుకలకు అనుమతి ఇవ్వాలని పోలీస్ కమిషనర్ నిరాకరించినప్పటికీ, విజయోత్సవ కవాతుకు అనుమతి ఇవ్వలేమని చెప్పినందున గోవిందరాజ్ తన ఉద్యోగాన్ని కోల్పోయారని వర్గాలు తెలిపాయి. రాష్ట్ర శాసనసభ సముదాయం, విధాన సౌధ మరియు చిన్నస్వామి స్టేడియం వద్ద రెండు కార్యక్రమాలకు అనుమతి ఇవ్వాలని గోవిందరాజ్ ఒప్పించారు.

బుధవారం మధ్యాహ్నం జరిగిన తొక్కిసలాటలో 14 ఏళ్ల బాలికతో సహా 11 మంది మరణించగా, 47 మంది గాయపడిన సంగతి తెలిసిందే. ముఖ్య మంత్రి సిద్ధరామయ్య బెంగళూరు పోలీస్ కమి షనర్ బి. దయానంద, అసిస్టెంట్ కమిష నర్ ఆఫ్ పోలీస్ సి. బాలకృష్ణ, డిప్యూటీ >>2



## ఆగస్టు 3న 'నీట్' పిజి పరీక్ష

### 'సుప్రీం' అనుమతి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** వైద్య విద్యలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ (పిజి) కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే నీట్ పిజి-2025 పరీక్షను దేశ వ్యాప్తంగా ఆగస్టు 3న నిర్వహించనున్నారు. నీట్ పిజి-2025 పరీక్షను నిర్వహించడానికి నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్(ఎన్ఇడి)కి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. నీట్ పిజి పరీక్షకి సంబంధించి సుప్రీంకోర్టు మే 30న కీలక ఆదేశాలు జారీచేస్తూ.. జూన్15న జరగనున్న నీట్ పిజి-2025 పరీక్షను ఒక షిఫ్ట్‌లోనే నిర్వహించాలని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ ఎన్.వి.అంజారియా ధర్మాసనం స్పష్టం చేసింది. మే 30న సుప్రీంకోర్టు జారీచేసిన ఆదే శాల మేరకు తమ టెక్నాలజీ భాగస్వామి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) లిమిటెడ్ సాధ్యమై నంత త్వరగా పరీక్షను నిర్వహించడానికి అనువైన తేదీగా ఆగస్టు 3ను నిర్ణయించిందని.. ఈ తేదీన పరీక్షను నిర్వహించడానికి అనుమతి ఇవ్వాలని ఎన్‌బిఇ శుక్రవారంసుప్రీంకోర్టును కోరింది. శుక్రవారం వాదనలసందర్భంగా నీట్ పిజి >>2

## 'కాళేశ్వరా'నికి బాస్ కెసిఆరే..

### ప్రాజెక్టు సమాచారమంతా మాజీ సిఎం, హరీష్ వద్దే ఉందన్న బిజెపి ఎంపి ఈటల



ఘోష్ విచారణకు హాజరైన అనంతరం మీడియాతో ఎంపి ఈటల

మహారాష్ట్ర అభ్యంతరంవల్లే మేడిగడ్డకు మార్పు

రూ. 63 వేల కోట్ల నుంచి రూ. 82 వేల కోట్లకు పెరిగిన ప్రాజెక్టు వ్యయం

ఘోష్ విచారణలో 19 ప్రశ్నలకు జవాబిచ్చిన మాజీ మంత్రి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్6:** కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. బిఆర్ఎస్ హయాంలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన, ప్రస్తుత బిజెపి ఎంపీ ఈటల రాజేందర్‌ను శుక్రవారం కాళేశ్వరం జ్యుడీషియల్ (జస్టిస్ పిసి ఘోష్) కమిషన్ విచారిం చింది. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రాజెక్టుకు సంబంధించిన పూర్తి సమాచారం నాటి ముఖ్యమంత్రి కెసిఆర్, నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు వద్దే ఉండేదని, ఆర్థిక శాఖకు ఇందులో పెద్దగా పాత్ర లేదని స్పష్టం చేశారు. "కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవ హారంలో నా పాత్ర ఏమీ లేదు" అని ఈటల రాజేందర్ తేల్చిచెప్పారు. ప్రాజెక్టు రీడిజైనింగ్ కోసం కెసిఆర్ కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారని, దానికి అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు ఛైర్మన్‌గా వ్యవహరించారని గుర్తు చేశారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకునే మేడిగడ్డ వద్ద ఆనకట్టనిర్మాణం చేపట్టారని, అయితే ఆనకట్టల నిర్మాణం అనేది పూర్తిగా సాంకేతిక నిపుణులకు సంబంధించిన అంశమని, దానిపై రాజకీయ నాయకులకు అవగాహన ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రాజెక్టు వ్యయం గురించి ప్రస్తావిస్తూ, "మొదట కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.63 వేల కోట్లతో ప్రతిపాదన చేశారు. తర్వాత అనేక కారణాలతో ప్రాజెక్టు వ్యయం రూ.82 వేల కోట్లకు పెరిగింది" అని ఈటల వివరించారు. కమిషన్ తనను ఆర్థిక పరమైన అంశాలపై ప్రశ్నలు అడిగిందని, కాళేశ్వరం కార్పొరేషన్ రుణాలపై ఆర్థికశాఖ ప్రమేయం ఉందా అని ప్రశ్నించిందని తెలిపారు. దీనికి ఆర్థిక శాఖకు ఏమాత్రం సంబంధంలేదని, ఇది పూర్తిగా ఇరిగేషన్ శాఖకు సంబంధించిన విషయమని తాను కమి షన్‌కు స్పష్టం చేసినట్లు చెప్పారు. "నా కణతపై తుపాకీ పెట్టినాసరే.. నిజమే మాట్లాడతా. తప్పుఒప్పులు ఎవరివో తెలంగాణ ప్రజలు >>2

## ట్రంప్‌తో మస్క్ కటీఫ్!



### ఇద్దరిమధ్య పెరిగిన అగాథం

### జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ట్రంప్‌కు సంబంధాలపై మస్క్ ధ్వజం

**వాషింగ్టన్, జూన్ 6:** డోజ్ వ్యవస్థాపకుడుగా కొన సాగుతూ అనేక ప్రభుత్వ సంస్థల్లో పొదుపు మంత్రం జపించి ప్రభుత్వ సంస్థల్లో దుబారాను అరికట్టగలిగానని చెప్పిన ట్రంప్‌కు ఆదినుంచి మద్దతుగానిలిచిన టెస్లా అధినేత ఎలాన్‌మస్క్‌తో ఇపుడు తీవ్ర విభేదాలు పొడచూపాయి. డోజ్‌నుంచి మస్క్ వైదొలిగిన తర్వాత ఈ అంతరాలు మరింత పెరిగాయి. ఒకరిపై ఒకరు నేరుగా విమర్శలు చేసుకోవడంతో ఇద్దరిమధ్య మరింతగా అగాథం పెరిగిందని స్పష్టం అవుతోంది. తాజాగా ఎలాన్ మస్క్ అయితే ట్రంప్‌కు సెక్స్‌కుంభకోణంలో నిందితుడయిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నా యని సంచలన ఆరోపణలుచేసారు. మస్క్ తన సోషల్ మీడియాలో ఈ పోస్టుపెట్టారు. సెక్స్ కుంభకోణం దర్యాప్తు ఫైళ్లలో ఎప్‌స్టీన్‌కు సంబంధిం చిన ఫైళ్లలో ట్రంప్‌పేరు కూడా ఉందని ఆరోపిం చారు. అందువల్లనే దర్యాప్తు అంశాలు ఇప్పటి వరకూ బయటపెట్టలేదని ఆరోపించారు. నిజా నిజాలు బయటపడతాయన్నారు. ట్రంప్‌ను అభిశం సించాలంటూ ఒక నెటిజన్ పెట్టిన పోస్టును కూడా మస్క్ సమర్థించారు. ఉపాధ్యక్షుడు జెడీవాన్స్‌తో ఆస్థానం భర్తీచేయాలని ఆపోస్టు సారాంశం.

దీన్ని మస్క్ రీపోస్ట్‌చేసి అవును అని సమర్థించారు. రిపబ్లికన్ టాక్స్‌బిల్లుపరంగా ట్రంప్‌కు వ్యతిరేకంగా మస్క్ తొలిసారి నిరసన తెలిపారు. ఈక్రమంలోనే మస్క్ డోజ్‌నుంచి వైదొలిగారు. తన మద్దతు లేకుండా 2024 అమెరికా అధ్యక్షఎన్నికల్లో ట్రంప్, రిపబ్లికన్ పార్టీనాయకులు గెలిచేవారుకాదని ఓటమి పాలయ్యేవారని టెస్లా అధినేత స్పష్టంచేసారు. ట్రంప్ ఈ వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించారు. తాను ఎన్నికల్లో గెలిచేందుకు మస్క్ అవసరం లేదన్నారు. మస్క్ అవసరం లేకుండానే పెన్సిల్వేనియాలో తాను గెలిచేవాడినన్నారు. మస్క్ వ్యాపారాలకు ఉపయోగపడే ప్రభుత్వ కాంట్రాక్టులు, రాయితీలకు కోత వేస్తానని ట్రంప్ హెచ్చరించారు. ఇందుకు మస్క్ స్పందిస్తూ 80 శాతం >>2

# బనకచర్లను ఒప్పుకోం



### అది అంతర్రాష్ట్ర జల విధానానికి విరుద్ధం

### తెలంగాణకు అన్యాయం జరిగితే ఎంతకైనా పోరాడుతా: మీడియాతో మంత్రి ఉత్తమ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్6:** గోదావరి నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టు అంతర్రాష్ట్ర జలవిధానానికి విరుద్ధమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. బనక చర్లతో తెలంగాణకు అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. అంతర్రాష్ట్ర జలవిధానా లకు, జీఆర్ఎంబీ, సీడబ్ల్యూసీ, అపెక్స్ కౌన్సిల్ నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టు ఉందని ఆక్షేపించారు. ఈ ప్రాజెక్టును తెలంగాణ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించదని స్పష్టం చేశారు. ఎపి ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన ఈ బనకచర్ల ప్రాజెక్ట్ విషయాన్ని ఇప్పటికే కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్‌కు వేర్వేరుగా లేఖల ద్వారా వివరించామని గుర్తు చేశారు.

అయితే తమకు ఎపి నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదని.. ఒక వేళవస్తే అన్ని నిబంధనలను పరిశీ లిస్తామంటూ తెలంగాణ ప్రభుత్వానికి కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ గత నెలలో లేఖ ద్వారా స్పష్టం చేశారని వివరించారు. అలాగే ఈ అంశంపై చట్టప్రకారం ముందుకు వెళ్తామని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్ తమకు హామీ ఇచ్చారన్నారు. అయితే ఈ ప్రాజెక్ట్ విషయంలో ఏపీ ఉల్లం ఘనలను పూర్తిగా సదరు లేఖల్లో సమగ్రంగా వివ రించామని చెప్పారు. ఇక కేంద్రం చట్ట విరుద్ధంగా ఆంధ్రప్రదేశ్‌కు సహకరిస్తుందని అయితే తాము అనుకోవడం లేదన్నానిచెప్పారు. తెలంగాణకు అన్యాయం జరిగితే.. తాము ఎంతవరకైనా పోరాడ తామని స్పష్టం చేశారు. హక్కుల కోసం తెలంగాణ ప్రభుత్వం రాజీ లేని పోరాటం చేస్తుందన్నారు. ఈ అంశంలో వెనక్కితగ్గేదేలేదని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంలో కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు జోక్యం చేసుకుని కేంద్రాన్ని ఒప్పించాలని మంత్రి >>2



ఎన్‌కౌంటర్‌లో మరణించిన భాస్కర్ (ఫైల్)

## మరో మావోయిస్టు అగ్రనేత భాస్కర్ ఎన్‌కౌంటర్‌లో హతం

### కొనసాగుతున్న గాలింపు

**చర్ల,జూన్ 6,(ప్రభాతవార్త):** ఛత్తీస్‌గఢ్ దండకార ణ్యంలో మావోయిస్టుల ఏరివేత పరంపర కొనసా గుతుంది. ఆపరేషన్ బ్లాక్ హిల్స్‌ను రెండు నెలల పాటు కొనసాగించిన కేంద్ర ప్రభుత్వం భద్రతా బలగాలు అక్కడ సైతం మావోల డెన్లను నేల మట్టం చేసారు. కర్రిగుట్టల్లో మావోయిస్టులు లేరని నిర్ధారించుకున్న పోలీస్ ఉన్నతాధికారులు అక్కడ సెర్చ్ ఆపరేషన్ నిలిపివేసారు. మావోలకు పట్టున్న మాడ్ ఏరియా నేషనల్ పార్క్ అటవి ప్రాంతాలపై నిఘాను కట్టుదిట్టం చేసారు. >>2

## ఎమ్మెల్యేల పనితీరు మెరుగుపడాలి

### ఈ నెలలోనే పిసిసి కార్యవర్గం, మంత్రివర్గ విస్తరణ

### పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్6:** కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపై టిపిసిసి చీఫ్ మహేష్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు తమ పనితీరును బేరీజు వేసుకోవాలని చెప్పారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. మెజారిటీ ఎమ్మెల్యేల పనితీరు సరిగాలేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎమ్మెల్యేలు తమ పనితీరును బేరీజు వేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం పలువురు ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేకపోవ డంతో కార్యకర్తలు నిరాశలో ఉన్నారని, వారిని సమన్వయం చేసుకో వా ల్సిన అవసరం ఉందన్నారు.

శుక్రవారం గాంధీ భవన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంమహేశ్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిధిగా రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ మాట్లాడుతూ మచ్చలేని >>2

## కెటిఆర్‌కు సుప్రీం నోటీసులు

### కాంగ్రెస్ నేత పిటిషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్6:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కెటిఆర్‌కు నోటీసులు జారీ చేసింది. కాంగ్రెస్ సర్కార్‌పై కెటిఆర్ చేసిన రూ.25వేల కోట్ల అవినీతి ఆరోపణల కేసులో సుప్రీం నోటీసులిచ్చింది. కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం పిటిషన్‌ను విచారించింది. మూసీ ప్రక్షాళన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడిందంటూ కెటిఆర్ గతంలో ఆరోపణలుచేశారు. దీంతో కెటిఆర్‌చేసిన ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తూ కాంగ్రెస్‌నాయకురాలు ఆత్రం సుగుణ ఉట్నూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## 5వేలు దాటిన కరోనా కేసులు

### 55కు పెరిగిన మృతులు

**న్యూఢిల్లీ, జూన్ 6:** భారత్‌లో కరోనా వైరస్‌వ్యాప్తి ఆందోళనకరంగా మారుతోంది. కొంతకాలంగా తగ్గు ముఖం పట్టిన మహమ్మారి, తిరిగి విజృంభిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య ఐదు వేల మార్కును దాటింది. గడిచిన 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 498 కొత్త కరోనా కేసులు నమోదైనట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. నలుగురు వ్యక్తులు ఈ వైరస్ కారణంగా ప్రాణాలు కోల్పోయారు. దీంతో, దేశంలో ఇప్పటివరకు కొవిడ్ కారణంగా మరణించిన వారి మొత్తం సంఖ్య 55 కు చేరింది. ప్రస్తుతం దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 5,364గా ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు.

## నెలకు 2 సార్లు కేబినెట్ భేటీలు

### ప్రభుత్వం కీలక నిర్ణయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్6:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ప్రతినెలా రెండుసార్లు రాష్ట్ర మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి కార్యాలయంనుండి ఆదేశాలు జారీ అయ్యాయి. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో అనవసర జాప్యాన్ని నివారించి, ప్రభుత్వ కార్యకలాపాలను మరింత చురుగ్గా ముందుకు తీసుకెళ్లడమే ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా తెలుస్తోంది. అందుకే రెండు,మూడు నెలలకోసారి కాకుండా కేబినెట్ 15 రోజులకోసారి మంత్రివర్గ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయ తీసుకున్నారు.

### జమ్ముకాశ్మీర్ పర్యాటకరంగంపై

# పాకిస్థాన్ కుట్రలు

## కాట్రా సభలో ప్రధాని మోడీ



శుక్రవారం జమ్ముకాశ్మీర్‌లో చీనాబ్ వంతెనను ప్రారంభించి పరిశీలిస్తున్న ప్రధాని మోడీ

**కాట్రా (జమ్ముకాశ్మీర్),జూన్ 6:** కశ్మీర్‌లో పర్యాట కాన్ని ధ్వంసం చేయాలని పాకిస్థాన్ కుట్ర పన్ను తోందని ప్రధాని మోడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొరుగు దేశం పర్యాటకానికి వ్యతిరేకమని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లోని పేదలపై పాక్ కుట్రలు చేస్తోందని, ఇక్కడి పేదల పొట్టగొట్టాలని పాక్ చూస్తోందని దుయ్యబట్టారు. ఉగ్రవాదంపై పోరాటంలో వెనక్కి తగ్గేదిలేదని ప్రధాని స్పష్టం చేశారు. పాక్ కుయుక్తులను ఎప్పటికప్పుడు భారత్ ఎండగడుతూనే ఉంటుందన్నారు.మన పహల్గాంవ్ హీరో ఆదిల్‌హుస్సేన్ అని చిన్నచిన్న గుర్రాలపై పర్యాటకులను తీసుకువెళ్లే వృత్తిలో ఉన్న ఆదిల్ పహల్గాంవ్ దాడిలో పర్యాటకులను రక్షించేక్రమంలో ప్రాణాలు అర్పించాడని కొనియా డారు. పోనీవాలాగా ఆయన పర్యాటకులను కాపాడేందుకు చేసినయత్నం దేశం గుర్తుంచు కుంటుందని అన్నారు. కశ్మీర్ లోయకు రైలును నడపాలన్న కల నేటికి సాకారమైందని మోడీ హర్షం వ్యక్తంచేసారు. చినాబ్ వంతెన ప్రారంభం సందర్భంగా కాట్రాలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న ప్రధాని మోడీ కీలకోపన్యాసం చేశారు. భారతీయ ఇంజినీర్ల నైపుణ్యానికి అంజీ ఖాడ్ రైల్వే తీగలవంతెన ఒక నిదర్శనమన్నారు. మాతా వైష్ణోదేవి ఆశీర్వాదం వల్ల జమ్మూ కశ్మీర్‌ను మరింత అభివృద్ధి చేసుకుంటున్నాం.

దాదాపు రూ.40వేలకోట్లతో జమ్మూలో అభివృద్ధికి బాటలు వేశాం. బ్రిటీష్ కాలం నాటి ప్రణాళిక నేటికి కార్యరూపం దాల్చింది. అందుకే చినాబ్ రైల్వే బ్రిడ్జ్, అంజిర్ వంతెనలు జాతికి అంకితం చేశాం. మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధి చేసి చూపించాం. ఇకపై జమ్మూకశ్మీర్ అభివృద్ధి మరింతగా కొంత పుంతలు తొక్కుతుందని అన్నారు. జమ్మూకశ్మీర్ సహా దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని ప్రధాని మోడీ తెలిపారు. కానీ కొన్ని రాజకీయ పార్టీలు పేదలను రాజకీయాల కోసం వాడుకుంటున్నాయని ఆయన విమర్శిం చారు. ఉగ్రవాదానికి భారత్ తలవంచదన్న మోడీ ఈసభలోనే పాకిస్థాన్‌పై నిప్పులు చెరిగారు. ఇకపై ఆపరేషన్ సిందూర్ పేరు విన్నప్పుడల్లా పాకిస్థాన్‌కు ఓటమి గుర్తుకువస్తుం దన్నారు. ఉగ్రవాదానికి భారత్ ఎన్నటికీ తలవం చదని స్పష్టం చేశారు. అయితే ఈ పోరాటంలో జమ్మూకశ్మీర్ యువత ఐక్యంగా ఉండాలని మోడీ పిలుపునిచ్చారు. అలాగే పాక్ సరిహద్దు వెంబడి ఉన్న గ్రామాల ఇళ్లల్లో పాక్ జరిపిన అప్రకటిత కాల్పులవల్ల దెబ్బతిన్న కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తామని అన్నారు. భారత్‌పాక్ ఉద్రిక్తతల సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో ఇళ్లు దెబ్బతిన్నవారికి అదనంగా రూ.2 లక్షలు అందించనున్నట్లు ప్రధాని మోడీ ప్రకటించారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ల కోసం రూ.1 లక్ష ఇవ్వడానికి ప్రభుత్వం నిర్ణయిం చిందన్నారు.

## చీనాబ్ వంతెనను ప్రారంభించిన ప్రధాని

**కాట్రా (జమ్ముకాశ్మీర్),జూన్ 6:** జమ్ము కశ్మీర్‌లో కేంద్రం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే బ్రిడ్జి చీనాబ్ రైలు వంతెన ను ప్రధాని నరేంద్రమోడీ ప్రారంభించారు. జెండా ఊపి రైల్వే వంతెనపై రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే బ్రిడ్జిపై పరుగులు తీసిన కోచ్‌లో ప్రధాని ప్రయాణించారు. చీనాబ్ రైలు వంతెనను భారతీయ రైల్వే ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించింది. ఈ వంతెన జమ్ము కశ్మీర్‌లోని జమ్మూ డివిజన్ రియాసి జిల్లా బక్కల్ - కౌరీ మధ్య ఉంది. కశ్మీర్‌ను భారత్‌లోని మిగతా ప్రాంతాలతో అనుసంధానించేందుకు చేపట్టిన ఉధంపుర్ శ్రీనగర్ బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్టులో భాగంగా చీనాబ్ వంతెనను నిర్మించారు.

తన పర్యటనలో భాగంగా సుమారు రూ.46,000 కోట్ల ప్రాజెక్టులకు కాట్రాలో మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఉక్కు, కాంక్రీట్‌తో నిర్మించిన చీనాబ్ వంతెన నదీ గర్భం నుంచి 359 మీటర్ల ఎత్తులో చీనాబ్ నదిపై 1,315 మీడర్ల పొడవైన వంతెనను నిర్మించారు. చైనాలోని బెయిసాన్ నదిపై నిర్మించిన 275 మీటర్ల పొడవైన షుబాయ్ రైల్వే వంతెన పేరుపై ఉన్న ప్రపంచ రికార్డును ఇది అధిగమించింది. ఇక పారిస్‌లోని ప్రఖ్యాత ఈఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 30 మీటర్లు ఎక్కువగా ఉండటం విశేషం. 2003లో వాజ్‌పేయి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి ఆమోదం తెలుపగా పూర్తి కావడానికి 22 ఏండ్లు పట్టింది.

ఈ ప్రాజెక్ట్ ద్వారా కశ్మీర్ లోయకు దేశంలోని మిగిలిన ప్రాంతాలకు రైల్వే అనుసంధానం ఏర్పడింది. భూకంపాలు, గంటకు 260 కిలో మీటర్ల వేగంతో వీచే బలమైన గాలుల్ని తట్టుకో గల ఈ వంతెన జీవితకాలం 120 ఏండ్లు. ఆర్చ్ ఆకృతిలో నిర్మించిన ఈ రైల్వే వంతెన పొడవు 1,315 మీటర్లు.

నదీగర్భం నుంచి ఈ బ్రిడ్జి 1,178 అడుగుల ఎత్తులో ఉంది. వంతెన నిర్మాణం కోసం 28 వేల టన్నుల స్టీల్,6 లక్షల బోల్ట్‌లు వాడారు. నిర్మాణ వ్యయం రూ.1483 కోట్లు. వంతెనకు ఇరువైపులా 93 డెక్ సెగ్మెంట్స్‌ను ఉపయోగించగా, ఒక్కోటి 85 టన్నుల బరువు ఉంటుంది. ఉధంపూర్ శ్రీనగర్ బారాముల్లా రైల్వే లింక్ ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించిన ఈ వంతెన జాతి సమగ్రత, ఇంజినీరింగ్ అద్భుతానికి ఓ చిహ్నం.

## 'నీట్' పిజి పరీక్ష

>> పరీక్షను నిర్వహించడానికి రెండు నెలల కంటే ఎక్కువ సమయం కోరడాన్ని మొదట ప్రశ్నించిన జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం.. ఆతర్వాత కారణాలు నిజాయ తీగా ఉన్నాయని పేర్కొంది. అయితే పరీక్షను నిర్వహించడానికి ఎన్‌ఇబికి ఇక సమయం ఇవ్వబోమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. మే 30న సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదే శాల ప్రకారం, పరీక్షను ఒకేషిఫ్ట్‌లో నిర్వహిం చాల్సి ఉందని ఎన్‌ఇబి కోర్టుకు తెలిపింది. అందువల్ల దాదాపు 1,000 పరీక్షా కేంద్రాలు అవసరమని ఎన్‌ఇబితరపు న్యాయవాది కోర్టుకి చెప్పారు. దీంతో జూన్ 15న జరగాల్సిన పరీక్షను వాయిదా వేసిన నేపథ్యంలో ఆగస్టు 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్య నిర్వహిస్తామని ఎన్‌ఇబి కోర్టుకి తెలిపింది. విచారణ సందర్భంగా ఆగస్టు 3వతేదీన నీట్ పిజి-2025 పరీక్ష జరపడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. నీట్ పిజి-2025 పరీక్షద్వారా ఎంఎస్ కోర్సుల్లో 12, 690, ఎండీ కోర్సుల్లో 24,360.. పిజి డిప్లొమా కోర్సుల్లో 922 సీట్లను భర్తీ చేయనున్నారు.

## మెరుగుపడాలి

>> మీనాక్షి నటరాజన్ మన రాష్ట్రానికి ఇన్‌చార్జ్‌గా రావడం శుభ సూచకం అన్నారు. నేతలంతా పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించాలని, మెజారిటీ ఎమ్మెల్యేల పనితీరు బాగోలేదని, అధికారంలో ఉన్నప్పుడు రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తే పార్టీ మరోసారి అధికారం లోకి వస్తుందని పేర్కొన్నారు. సరిదిద్దుకోవాల్సిన బాధ్యత వాళ్లపై ఉందని,ఎమ్మెల్యేలు తమ పనితీరును బేరీజు వేసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మెరుగైన ఫలితాల కోసం ఎమ్మెల్యేలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ స్థాయి బూత్ నుంచి పార్టీ నిర్మాణం జరగాలని, సంక్షేమ పథకాలను ప్రజ ల్లోకి తీసుకెళ్లే బాధ్యత మనపై ఉందని అన్నారు. ఉచిత బస్సు మొదలుకొని సన్న బియ్యం వరకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, విద్య,వైద్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అయితే ప్రభుత్వానికి రావాల్సిన ప్రచారం రావడం లేదన్నారు. ఈ నెలలోనే పిసిసి కార్య వర్గం, మంత్రివర్గ విస్తరణ పూర్తయ్యే అవకాశం ఉంది. ఎమ్మెల్యేలు తమ పనితీరు సరిదిద్దుకో వాల్సిన బాధ్యత మీపైనే ఉంది" అని చెప్పారు. కార్యకర్తలు నిరాశగా ఉన్నారని.. వారిని సమ న్వయం చేసుకునేబాధ్యత మనపైనేఉందన్నారు.

## ట్రంప్‌తో మస్క్ కటీఫ్!

>> మందికి ప్రాతినిధ్యం వహించేలా అమెరికాలో కొత్తపార్టీ పెట్టేందుకు ఇది అనువైన సమయమేనా అంటూ ఆన్‌లైన్‌పోల్ పెట్టడం ఇద్దరిమధ్య అగాధాన్ని స్పష్టంచేస్తోంది. మస్క్‌కు వివేకం నశించిందని, ఆతనిగురించి మాట్లాడేం దుకు కూడా తనకు ఇష్టంలేదంటూ అమెరికా మీడియా ఔట్‌లెట్లు ఇంటర్వ్యూల్లో స్పష్టం చేసారు. అసలు మస్క్‌గురించి తాను ప్రత్యేకించి ఆలోచన చేయాల్సిన అవసరం లేదంటూ ఆయన చెప్పుకొస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 07-06-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
ద్వాదశి పూర్తి
చిత్త ఉ.9.39
వర్జ్యం మ.3.57-5.45
దు.తె.5.35-7.15
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** పనులు నత్తనడకన సాగుతాయి. మిత్రుల నుండి విమర్శలు ఎదుర్కొంటారు. సోదరుల కలయిక.

**వృషభం :** ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగవు. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా వుండవు.

**మిథునం:** భూముల క్రయ విక్రయాలలో లాభాలు పొందుతారు. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా వుంటుంది.

**కర్కాటకం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు ఆశ్చర్య పరుస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**సింహం:** అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**కన్య :** ఉద్యోగులకు ఊహించని బాధ్యతలు పెరుగుతాయి, వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తారు.

**తుల :** ఇంటర్వ్యూలకు హాజరవుతారు. ఉద్యోగాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**వృశ్చికం:** కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. మీ నైపుణ్యానికి గుర్తింపు పొందుతారు.

**ధనుస్సు:** రాజకీయ, కళారంగాల లోని వారు సన్మాన, సత్కారాలు పొందుతారు. వాహన సౌఖ్యం.

**మకరం:** ఆర్థికపరమైన లావాదేవీలు సంతృప్తికరంగా వుంటాయి. రుణాలు తీరి ఊరటచెందుతారు.

**కుంభం:** ప్రతి విషయంలోనూ ఆలోచించి ముందుకు సాగడం శ్రేయస్కరం. ధనలాభం.

**మీనం :** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. పనులు అనుకున్న రీతిలో పూర్తిచేస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం వాసాలమర్రిలో జరిగిన బహిరంగసభలో సిఎం రేవంత్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న దృశ్యం

## దెయ్యాలను తరిమికొట్టాల్సిందే

>> మెరలు తరమికొట్టాల్సిందేనని, కొరిమి దయ్యాలను తరమికొట్టే బాధ్యత నేనే తీసుకుంటానని కార్యకర్తలకు నూతన ఉత్సాహం నింపేలా ఉద్వేగభరింతంగా చేసిన ప్రసంగం కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని పెంపొందించింది. రాహుల్‌గాంధీ లక్ష్యాన్ని నెరవేర్చడమే తన లక్ష్యమని, నిధులు ఇచ్చే వారికి, నీళ్లు తెచ్చేది తెలవదా అంటూ బిఆర్‌ఎస్ నేతలపై తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రజలు చైతన్యవంతులని, రజాకార్లగుండెల్లో నిద్రపోయేంత వరకు తుపాకీ తూటాలను లెక్కచేయలేదన్నారు. ఇంతటి చైతన్యం కలిగిన ఈ ప్రాంత ప్రజలు ప్రాజెక్టులను అడ్డుకోవడానికి కాళ్లల్లో కట్టె పెట్టి గెలికితే చూస్తూ ఊరుకోబోరని ఆయన హెచ్చరించారు. ఎవ్వరు ఎన్ని కుట్రలు చేసినా ప్రజాబలంతో తొక్కుకుంటూ ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి తీరుతామన్నారు. ఆలేరు నియోజవకర్గంను అన్ని రకాలుగా తీర్చిదిద్దడం కోసం స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. టిటిడి తరహాలో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనర్సింహాస్వామి పుణ్యక్షేత్రాన్ని వైటిడిగా తీర్చిదిద్దడం జరుగుతుందున్నారు. ఏళ్ల తరబడి నుంచి ఎదురు చూస్తున్న సాగునీటి కళను నెరవేచ్చడం కోసం బీర్ల అయిలయ్య కోరిక మేరకు గందమల్ల రిజర్వాయర్‌కు సుమారుగా రూ.600 కోట్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. దేశంలోని బిజెపి గంగా, యమున, సరస్వతి నదులను ప్రక్షాళన చేస్తుంటే తెలంగాణ ప్రాంత సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని మూసీ నదిని అభివృద్ధి చేస్తుంటే జీర్ణించుకోలేని బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు విషం చిమ్ముతున్నారన్నారు. సమావేశంలో భారీ నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, డిప్యూటీ సిఎం దామోదర రాజ నర్సింహా, వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రెవిన్యూ శాఖా మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖా మంత్రి సీతక్క, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తీన్మార్ మల్లన్న, నెలికంటి సత్యం, శంకర్ నాయక్, భువనగిరి, తుంగతుర్తి, నకిరేకల్, మునుగోడు ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ముందుల సామ్యేల్, వేముల వీరేశం, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రాచకొండ సిపి సుదీర్‌బాబు, జిల్లా కలెక్టర్ ఎం.హన్మంతరావు, డిసిపి ఆకాంక్ష యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌కౌంటర్‌లో హతం

>> ఈ క్రమంలో మళ్లీ ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. గురువారం జరిగిన ఎన్ కౌంటర్‌లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు టెండ్ లక్ష్మీ ్మ నరసింహాచలం ఆలియాస్ సుధాకర్ మృతిచెందగా శుక్రవారం జరిగిన ఎన్ కౌంటర్‌లో రాష్ట్ర కమిటి సభ్యుడు మైలారపు ఆడెల్లు ఆలియాస్ బాస్కర్ మృతిచెందాడు.అతని వద్ద నుండి ఏకే 47 తుపాకీని స్వాధీనం చేసుకున్నారు.ఇతని స్వస్థలం అదిలాబాద్ జిల్లా బోథ్ మండలం పొచెర గ్రామం.సుమారు మూడు దశాబ్దాల క్రితం మావోయిస్టు ఉద్యమాల పట్ల ఆకర్షితుడై అనేక పోరాటాల్లో పాల్గొని రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎదిగారు..కాగా నేషనల్ పార్క్ ఏరియాలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారనే సమాచారం సెర్చ్ ఆపరేషన్ చేపట్టినట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజ్.పి గురువారం మీడియాకు తెలిపారు.ఈ సెర్చ్ ఆపరేషన్ ని ఏడిజి వివేకానంద సిన్హా, బస్తర్ సిఆర్‌పిఎఫ్ ఐజి రాకేష్ అగర్వాల్ పర్యవేక్షి స్తున్నారు.

## బనకచర్లను ఒప్పుకోం

>> ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కృష్ణా జలాల విషయంలో అన్యా యం జరుగుతుంటే గత పదేళ్లుగా బిఆర్‌ఎస్ పార్టీ సహకరించిందని విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ వాటా 724 టీఎంసీ.. ఏపీకి వెళితే.. విభజన అనంతరం బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 1,254 టిఎంసిల కృష్ణ జలాలు ఏపీకి తరలించారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో వృథా ఖర్చు చేయకుంటే.. కృష్ణా ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవని ఈ సందర్భంగా ఆయన అభిప్రాయపడ్డారు. తుమ్మిడిహట్టి దగ్గర కాకుండా.. మేడిగడ్డ వద్ద ప్రాజెక్ట్ నిర్మించడం ద్వారా రూ. 68 వేల కోట్లు కాళేశ్వరం నిర్మాణానికి అదనపు ఖర్చు అయ్యిందన్నారు. కృష్ణా జలాల అంశంలో తెలంగాణకు అన్యాయం చేసింది బిఆర్‌ఎస్ పార్టీ కాదా? అని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. 512 టిఎంసి ఎపికి.. తెలంగాణకు 299 టీఎంసీ కేటాయించాలంటూ సంతకం పెట్టింది బిఆర్‌ఎస్ ప్రభుత్వం కదా? అని ఆయన సూటిగా ఆ పార్టీ నేతలను నిలదీశారు. బీఆర్‌ఎస్ నేతలు అప్పుడు మోసం చేసి.. ఇప్పుడు నాటకాలు ఆడుతున్నారంటూ ఆ పార్టీ నేతలపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి నిప్పులు చెరిగారు. కేంద్రానికి తాము రాసిన లేఖలో ఎపి ఉల్లంఘనలను పూర్తిగా వివరించామని, చట్టవిరుద్ధంగా ఎపికి కేంద్రం సహకరిస్తుందని అనుకోవట్లేదని, తెలంగాణకు అన్యాయం జరిగితే ఎంత వరకైనా పోరాడుతామని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ నీటి హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని, వెనక్కి తగ్గేదేలేదన్నారు. బనకచర్లకు అనుమతులు ఇవ్వకుండా కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్రాన్ని ఒప్పించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

### ప్రభాకర్ రావు భారత్‌కు వచ్చేందుకు

## అనుమతి పత్రాలు మంజూరు

### ఫోన్ ట్యాపింగ్‌లో మరో కీలక పరిణామం

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈకేసులో మొదటి ముద్దాయగా వుండి 15 నెలలుగా అమెరికాలో తలదాచుకున్న ఎస్ఐబి మాజీబాస్ ప్రభాకర్‌రావు భారత్‌కువచ్చేందుకు అమెరికాలోని భారత రాయబార కార్యాల యం నుంచి అత్యవసర అనుమతి పత్రాలు మంజూరయ్యాయి. ప్రభాకర్ రావు పాస్‌పోర్టును సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు విదేశాంగశాఖ రద్దు చేయడంతో ఆయన భారత్‌కు వచ్చేందుకు ఎమర్జన్సీ ట్రాన్సిట్ వారంట్ జారీ పేరిట ఈపత్రాలను భారత రాయబార కార్యాలయం శుక్రవారం మంజూరు చేసింది. ఈ పత్రాలతో ప్రభాకర్ రావు శనివారం నాడు అమెరికా నుంచి బయలుదేరి నేరుగా హైదరాబాద్‌రానున్నారు. ఈ మేరకు రాష్ట్ర పోలీసు శాఖకు శుక్రవారం సమాచారం అందింది. ప్రభాకర్ రావు ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత హైదరాబాద్‌కు చేరుకునే వీలుంది. ప్రభాకర్ రావు శంషాబాద్ విమానాశ్రయంలో దిగగా నే ఇమ్మిగ్రేషన్ అధికారులు ఆయన పత్రాలను తనిఖీ చేసి అనుమతి మంజూరు చేయనున్నారు. ఫోన్‌ట్యాపింగ్‌కేసులో సోమవారం ఆయన పోలీసులఎదుట విచా రణకు హాజరు కానున్నట్లు మూడు రోజుల క్రితం ప్రభాకర్ రావు సమాచారం ఇవ్వడం తెలిసిందే.

## ఇంటెలిజెన్స్ చీఫ్ ఔట్

>> కమిషనర్ ఆఫ్ పోలీస్ శేఖర్ హెచ్. టెక్కన్నవర్, అదనపు కమిషనర్ ఆఫ్ పోలీస్ వికాష్ కుమార్ వికాష్ మరియు కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ సర్కిల్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఎ.కె. గిరీష్ లను వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ అధికారులు విధి నిర్వహణలో గణనీయమైన నిర్లక్ష్యం వహించారని తేలింది" అని సస్పెన్షన్ ఉత్తర్వులో పేర్కొన్నారు. సస్పెన్షన్ల తర్వాత, ప్రతిపక్ష బిజెపి మరియు జనతాదళ్ (సెక్యులర్) రాష్ట్ర ప్రభుత్వం నుండి బాధ్యతను తిప్పికొట్టడానికి ముఖ్యమంత్రి పోలీసు అధికారులను బలిపశువులుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అయితే సిఎం సిద్ధరామయ్య ఈ ఆరోపణను తోసిపుచ్చుతూ ప్రతిపక్షాలు ఈ అంశంపై రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. తమ బాధ్యతను సరిగ్గా నిర్వర్తించని బాధ్యతాయుతమైన ప్రాథమికంగా వారిని సస్పెండ్ చేశారని ఆయన శుక్రవారం తెలిపారు.ఆ తర్వాత వెంటనే సిద్ధరామయ్య కార్యదర్శి కె గోవిందరాజ్ మరియు రాష్ట్ర నిఘా విభాగం చీఫ్ హేమంత్ నింబాల్కర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. తొక్కిసలాటకు సంబంధించి నలుగురిని అరెస్టు చేసినట్లు కర్ణాటక పోలీసులు తెలిపారు, వీరిలో ఆర్‌సిబి మార్కెటింగ్ హెడ్ నిఖిల్ సోసాలె కూడా ఉన్నారు. ఆర్‌సిబికి అన్ని ప్రచార కార్యకలాపాలను నిర్వహించే సోసాలేను ఉదయం 6.30 గంటల ప్రాంతంలో బెంగళూరు ఎయిర్‌పోర్టులో ముంబైకి వెళుతుండగా అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురు వ్యక్తులు ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ డిఎన్ఎ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అధికారులు, ఆ కంపెనీ కోసం ఐపిఎల్ ఈవెంట్‌లను నిర్వహించే దాని వైస్ ప్రెసిడెంట్ సునీల్ మాథ్యూలు ఉన్నారు. కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు అధికారులను అరెస్టు చేయాలని పోలీసులు చూస్తున్నారు, కానీ వారి జాడ తెలియలేదు. తొక్కిసలాటతో తమకు ఎలాంటి సంబంధం లేదని, చిన్నస్వామి స్టేడియంను అద్దెకు ఇస్తున్నామని పేర్కొంటూ క్రికెట్ సంస్థ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించింది. జూన్ 16 వరకు అసోసియేషన్ ఆఫీస్ బేరర్లపై బలవంతపు చర్యలు తీసుకోకుండా అధికారులను హైకోర్టు నిషేధించింది.

# జి7 దేశాల సదస్సుకు వెళుతున్న ప్రధానిమోడీ!

**న్యూఢిల్లీ, జూన్ 6:** కెనడాలో జరిగే జి7 దేశాల కూటమి సమావేశానికి తాను హాజరవుతున్నట్లు ప్రధానిమోడీ ప్రకటించారు. జి7 సమావేశాలకురావాలని కెనడా ప్రస్తుతప్రధాని మార్క్‌కార్నీ ఆహ్వానించడంతో ఆయనకు సోషల్‌మీడియా వేదికగా ధన్యవాదాలు తెలిపిన మోడీ ఎన్నికల్లో ఆయన ఇటీవల గెలుపుపట్ల అభినందనలు చెపుతూ సమావేశాలకు హాజరవుతానని చెప్పారు. ఈనెల 15నుంచి 17వ తేదీవరకూ కెనడాలోని అల్బెర్టాలో ఉన్న కననాస్కిస్‌లో జి7 సదస్సు జరుగనున్న సంగతి తెలిసిందే. కెనడా భారత్‌లు రెండూ పరస్పర సహకారంతో ముందుకువెళతాయని, పరస్పరం గౌరవించుకుంటూ రెండుదేశాల శ్రేయస్సుకు అనుగుణంగా ముందుకువెళ్లా లని ఆకాంక్షిస్తున్నట్లు మోడీ తెలిపారు. సదస్సులో మనిద్దరిభేటీకోసం వేచి చూస్తున్నట్లుమోడీ తెలిపారు. రెండుదేశాలమధ్య ఇటీవలికాలంలో సంబం ధాలు దెబ్బతిన్నాయి. జస్టిన్‌ట్రూడో హయాంలో ఈ సంబంధాలు మరింత క్షీణించాయి. కెనడా పార్లమెంటులో ఖలీస్తానీ వేర్పాటువాది హర్‌దీప్‌సింగ్ ణిజ్జర్ హత్యలో భారత ఏజెంట్లప్రమేయం ఉందని చేసిన వ్యాఖ్యలతో భారత్ తీవ్ర నిరసన తెలిపింది. ఇందుకు సంబంధించి కెనడా ఎలాంటి ఆధారాలుచూపించలేకపోయిందనికూడా భారత్‌ప్రస్తావించింది.

నిరాధార ఆరోపణలుచేసిందని ఆనాడే ట్రూడో సర్కారును ధనుమాడింది. అప్పటి నుంచికూడా దౌత్యపరమైన సంబంధాలుకూడా స్తంభించిపోయాయి. రెండు దేశాలు తమతమ దౌత్యవేత్తలను దేశం వీడి వెళ్లిపోవాలని సూచించాయి. అంతేకాకుండా కెనడాలో భారతీయులకు ఇచ్చే వీసాలను కూడా నిలిపి వేసింది. సుమారు 18 లక్షలమంది ఇండో కెనడియన్లు మరో పదిలక్షల మంది ఎన్‌ఆర్‌ఐలు కెనడాలో ఉనానరు. కెనడా జనాభాలో 3శాతం వరకూ ఉన్నారు. 4.27 లక్షలమంది విద్యార్థులు కెనడా సంస్థల్లో ఎన్‌రోల్ అయి ఉన్నారు.

# ఇక పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు!

**హైదరాబాద్ జూన్ 6, ప్రభాతవార్త:** పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలనే లక్ష్యంతో సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాలలోఒక కొలిక్కి తీసుకువచ్చిన నేపథ్యంలో పట్టణ ప్రాంతాలలో కూడా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై దృష్టి సారించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్,సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.శుక్రవారం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణాల్లోని మురికి వాడల్లో జీవనం కొనసాగిస్తున్న పేదలు అక్కడే ఉండడానికి ఇష్టపడుతున్నారని,ముఖ్యంగా హైదరాబాద్‌కు దూరంగా ఇండ్లు నిర్మించి ఇస్తే తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశంతో ఇండ్లు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదన్నారు.హైదరాబాద్‌కు దూరంగా గతంలో 42 వేల ఇండ్లను నిర్మించగా సుమారు 19 వేల మంది మాత్రమే అక్కడికి వెళ్లారు. ఇటీవల క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలన జరుపగా కేవలం 13 వేలమందిమాత్రమే ఆ నివాసాలలో ఉంటున్నట్లు తేలిందన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని పట్టణ ప్రాంతాలలో ప్రధానంగా హైదరాబాద్ నగరంలోని మురికి వాడల్లో పేదలు ఉన్నచోటే జి+3 పద్ధతిలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని నిర్ణయించినట్లు వెల్లడిం చారు. ఇందులో భాగంగా తొలివిడతలో హైదరాబాద్‌లో 16 మురికివాడ లను గుర్తించామని. అలాగే వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ కరీంనగర్ తదితర పట్టణాలలో కూడా ఇదే విధానాన్ని అమలు చేసేలా కార్యాచరణరూపొందిస్తున్నాన్నారు.

### గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేల ఇండ్లు: మంత్రి పొంగులేటి

ఏండ్ల తరబడ నిలువ నీడలేక, తలదాచుకోవడానికి గూడులేని చెంచులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనమేరకు భద్రాచలం,ఉట్నూరు, ఏటూరునాగారం,మున్ననూరు నాలుగు ఐటిడిఎ పరిధిలోగల చెంచు, కొలం,తోటి, కొండరెడ్లకు13,266 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు.

# 'కాళేశ్వరా'నికి బాస్ కెసిఆరే..

>> తెలుస్తారు" అని ఈటల అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరంపై అన్ని రిపోర్టులు బయటపెట్టాలని, ఈ అంశాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవద్దని హితవు పలికారు. ప్రాజెక్టు నష్టాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. "ఈ ప్రాజెక్టు తన మానస పుత్రిక అని కెసిఆర్ వందల సార్లు చెప్పారు. ఏ పార్టీలో ఉన్నా, ఏ పదవిలో ఉన్నా నైతిక విలువలు పాటించా" అని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కేబినెట్ నిర్ణయంమేరకే ఆనకట్టల నిర్మాణం జరిగిందని, సాంకేతిక కమిటీ, కేబినెట్ కమిటీ సిఫార్సు మేరకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుందని వివరించారు. సిడబ్ల్యుసి, మహారాష్ట్ర అభ్యంతరాల దృష్టా ప్రాజెక్టు లొకేషన్ తుమ్మిడిహట్టి నుంచి మేడిగడ్డకు మార్పు చేశామన్నారు. నిధుల కొరత దృష్టా కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేశామని, ప్రారిశ్రామిక, తాగునీటి వినియోగంపై డబ్బు వసూలు చేయాలని డిపిఆర్‌లో ఉందని,అయితే నగదు వసూలు చేయలేదని స్పష్టంచేశారు. బ్యారేజీలనిర్మాణంలో ఆర్థిక క్రమశిక్షణ లోపించిందా? అని ఈటెలను కమిషన్ ప్రశ్నించింది. బ్యారేజీల నిర్మాణ అంశాలన్నీ నీటిపారుదల శాఖకిందకే వస్తాయని చెప్పారు.కాళేశ్వరం రిపోర్ట్ త్వరగా బయట పెట్టాలని.. రిపోర్ట్ విషయంలో తాత్సారం చేస్తే వదిలే ప్రసక్తి లేదని బిజెపి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు.

ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు డిజైన్లు, నిర్మాణంతో సంబంధం ఉందా అని కమిషన్ అడిగిందని.. తనకేం సంబంధం లేదని చెప్పానన్నారు. కాళేశ్వరం కార్పొరేషన్‌పై అధికారం ఉండేదాఅని అడగ్గా.. తనకు ఎలాంటి అధికారం లేదని చెప్పినట్లు తెలిపారు. కాళేశ్వరం నిర్మాణం క్వాలిటీ గురించి ఇంజనీర్లు చూసుకో వాలని.. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హరీష్ నాయకత్వంలో కేబినెట్ సబ్ కమిటీ వేశారన్నారు. మంత్రివర్గ ఉపసంఘం, సీడబ్ల్యూసీ రిపోర్ట్ ఆర్థిక శాఖ ముందు పెట్టారని తెలిపారు. నిజాయితీగా ఉండాలని కోరే పార్టీ బిజెపి అని ఎంపీ తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టు సృష్టికర్త కెసిఆర్ అని ఆయనే చెప్పు కున్నారని.. ప్రాజెక్టు కట్టాలనే ఆలోచన ఆనాటి ప్రభుత్వానిదే అని స్పష్టం చేశారు. కాళేశ్వరంపై నిర్ణయం తీసుకుంది కెసిఆర్ అని.. అప్పుడు ఆయనే బాస్ అన్నారు. 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ పార్టీలో ఉన్నా వాల్యూతో ఉన్నట్లు తెలిపారు. తెలంగాణలో మొట్టమొదటి ఆర్థిక మంత్రిగా పనిచేశానన్నారు. తెలంగాణ సాధించుకుంది నీళ్లు, నిధులు, ఉద్యోగాల కోసమని చెప్పారు. 2006లో తుమ్మిడి హేట్టి రూ.16 వేల కోట్లు ఉంటే 2015లో రూ.38 వేల కోట్లకు పెరిగిందన్నారు. తుమ్మిడి హేట్టి దగ్గర కట్టాలని అనుకున్నా మహారాష్ట్ర ఒప్పుకోలేదన్నారు. మూడు బ్యారేజీలు సీడబ్ల్యూసీ రిపోర్ట్, టెక్నికల్ కమిటీ ఆధ్వర్యంలో కట్టారన్నారు. మూడు బ్యారేజీలు సబ్ కమిటీ, టెక్నికల్ కమిటీ రిపోర్టు ఆధారంగా కట్టారనివెల్లడించారు. మొదట రూ.63వేల కోట్ల అంచనాతో ప్రారంభం అయితే.. రైతుల డిమాండ్ మేరకు రూ.82 వేల కోట్లకు పోయింద న్నారు. కాళేశ్వరం కార్పొరేషన్ ఏ పర్పస్ కోసం పెట్టారని కమిషన్ ప్రశ్నిస్తే.. కాళేశ్వరం కార్పొరేషన్‌కు ఫైనాన్స్ శాఖకు సంబంధంలేదని చెప్పినట్లు తెలిపారు. కొందరు బట్టకాల్చి మీదేస్తే నాకేమీ కాదు, కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను త్వరగా బయటపెట్టాలని.. నిజమైన దోషులు ఎవరో ప్రభుత్వం తేల్చాలని ఎంపీ ఈటెల రాజేందర్ డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఆర్థిక మంత్రిగా వ్యవహరించిన ఈటల రాజేందర్ కమిషన్ ముందు 40 నిమిషాల పాటు విచారణలో పాల్గొన్నారు. ఆయనను 19 ప్రశ్నలను కమిషన్ చైర్మన్ పీసీ ఘోష్ సంధించినట్లు సమాచారం. కమిషన్ ముందు 113వ సాక్షిగా ఈటల హాజరయ్యారు. ఓపెన్ కోర్టులో ఈటలతో అంతా నిజమే చెప్తానని కమిషన్ ప్రమాణంచేయించింది. బ్యారేజి నీర్మాణం, కాళేశ్వరం కార్పొరేషన్, డిపిఆర్‌ల పైనే కమిషన్ ప్రశ్నించినట్లు తెలుస్తోంది. ఈనెల 9వ తేదీ సోమవారం రోజున నీటిపారుదల శాఖ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు కమిషన్ ముందుకు రానున్నారు. ఈనెల 11వ తేదీ బుధవారం రోజున మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును కూడా కమిషన్ విచారించనున్నది.

## కన్నతల్లుల కడుపుకోత అర్థం చేసుకుని తెలంగాణ ఇచ్చిన సోనియా

### మంత్రి జూపల్లి కృష్ణారావు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త :** ఏపిలో రాజకీయంగా నష్టంజరుగుతుందని తెలిసి కూడా తెలంగాణ కన్నతల్లుల కడుపుకోతను సోనియా గాంధీ అర్థంచేసుకొని తెలంగాణ ఇచ్చారని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ..సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చారని కాబట్టే కేసీఆర్ సిఎం అయ్యారన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్రలేదనడం లేదు.కానీ తన వల్లే రాష్ట్రం వచ్చిందంటే మాత్రం ఒప్పుకోను అని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో మూడేళ్ల మంత్రిగా పనిచేశానని తెలిపారు.కేసీఆర్ పాలనలో నిజాయితీ కనిపించలేదని,అందుకే బిఆర్ఎస్ హయాంలోఅప్పులు విపరీతంగా పెరిగాయన్నారు.వరంగల్ పాలకుర్తిలో జరిగిన సభలో కేసీఆర్ నాకు దుఃఖం వస్తుంది అన్నారు.మీకు అధికారం పోయినందుకు దుఃఖం వచ్చిందా?లేక అప్పుల కుప్పగా మార్చిన ఈ రాష్ట్రాన్ని మేము అభివృద్ధి చేస్తుంటే చూసి ఓర్వలేక దుఃఖంవచ్చిందా?అనిప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనే ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రాజెక్టులు నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు.కేసీఆర్ పాలనలో ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదని, ఆగమేఘాల మీద పూర్తి చేసిన కాళేశ్వరం కుప్పకూలిందన్నారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయులకు రెండో డిఎను ఆగస్టులోనే చెల్లించాలి

### ఎమ్మెల్సీ మల్క కొమరయ్య

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రెండో డిఏను ఆగస్టు నెలలోనే చెల్లించాలని కరీంనగర్-నిజామాబాద్-మెదక్-మహబూబ్ నగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర కేబినెట్ సమావేశంలో గురువారం తీసుకున్న నిర్ణయాలు ఉపాధ్యాయ లోకాన్ని పూర్తిస్థాయిలో సంతృప్తి పర్చలేకపో యాయని అన్నారు. రెండు డిఏలు ఇస్తామని చెప్పినప్పటికీ.. రెండో డిఏ 6 నెలల తర్వాత ఇస్తామనడం సరికాదన్నారు. పెండింగ్ బిల్స్ చెల్లింపులను ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం, హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. ప్రస్తుతం 5 డిఏలు పెండింగ్‌లో ఉన్నాయని.. వచ్చే నెలలో కేంద్ర ప్రభుత్వం మరో డిఏ మంజూరు చేసే అవకాశం ఉందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో రెండో డిఏను 6 నెలల తర్వాత కాకుండా ఆగస్టు నెలలోనే చెల్లించాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య డిమాండ్ చేశారు. మిగిలిన డిఏలను డిసెంబర్‌లోపే ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే టీచర్లకు బదిలీలు, ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

## 12 నుంచి ఓపెన్ స్కూల్ టెన్త్ అడ్మిషన్లు

### మీ-సేవా ద్వారా ఆగస్టు 12 వరకు అవకాశం

### షెడ్యూల్ జారీ చేసిన టాస్ డైరెక్టర్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్)లో 2025-26 విద్యా సంవత్సరానికి టెన్త్, ఇంటర్ అడ్మిషన్లను ఈ నెల 12 నుంచి స్వీకరించనున్నారు. ఈ నెల 12 నుంచి మీ-సేవా ద్వారా అడ్మిషన్లను స్వీకరించనున్నట్లు టాస్ డైరెక్టర్ షెడ్యూల్ జారీ చేశారు. ఈ నెల 12న 2025-26 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేయనున్నారు. దరఖాస్తులను ఈ నెల 12 నుంచి ఆగస్టు 12 వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను అపరాధ రుసుం లేకుండా జులై 11 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. అపరాధ రుసుంతో జులై 12 నుంచి ఆగస్టు 12 వరకు అవకాశం కల్పించారు. అర్హత ఉండి, దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు ఈ నెల 12 నుంచి ఆగస్టు 12 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు.



## జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో విజేతలైన నారాయణ విద్యార్థులకు

## ఎపి సిఎం చంద్రబాబునాయుడు అభినందన

**హైదరాబాద్ జూన్ 6, ప్రభాతవార్త :** జెఇఇ అడ్వాన్స్‌డ్ 2025 ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 10 వ ర్యాంకు సాధించి ఆంధ్రప్రదేశ్ నుండి విజయకేతనం ఎగురవేసిన విజయవాడ నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థి వడ్లమూడి లోకేష్‌ని, 51వ ర్యాంకు సాధించిన భానుచరణ్ రెడ్డిని, 82 వ ర్యాంకు సాధించిన తోరాటి భరధ్వాజ్‌ని, 98వ ర్యాంకు సాధించిన జస్వంత్ వెంకట రఘువీర్‌ని, వారి తల్లిదండ్రులను ఉండవల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఐఐటిలో ర్యాంకు సాధించిన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఐఐటి లాంటి ప్రతిష్టాత్మక సంస్థలో ప్రవేశం సాధించటం సామాన్యమైన విషయం కాదు, మీలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులు మరిన్ని నూతన శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. జన్మభూమితో పాటు తెలుగు రాష్ట్రాల ఉన్నతికి పాటుపడాలని కోరారు. టాప్ ర్యాంకుల సాధనకు విజయసారథ్యం వహించిన నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లను ప్రత్యేకంగా ప్రశంసించారు. మరెందరో విజేతలను ఆవిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన విద్యార్థులకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డా పి.సింధూర నారాయణ, శరణి నారాయణ, ప్రేమ్ పొంగూరు పాల్గొన్నారు.

## నిజామాబాద్ జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్..

### కానిస్టేబుల్ సస్పెన్షన్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** కామారెడ్డి జిల్లాలో మద్యం సేవించి వాహనం నడుపుతూ మరో వాహనాన్ని ఢీకొన్న కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని నిజాంసాగర్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాకేష్ గౌడ్ గురువారం నాడు చెప్పాపెట్టకుండా విధులకు డుమ్మా కొట్టడంతో పాటు మద్యం సేవించి వాహనం నడుపుతూ మరో వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ఘటన జిల్లాలోని తాడ్వాయి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది.

కాగా ప్రమాదం జరిగిన ప్రాంతంలో స్థానికంగా కొంత రగడ జరిగింది. కాగా కానిస్టేబుల్‌కు పరీక్ష చేయగా మద్యం సేవించి వున్నట్లు తేలింది. ఈ ఘటనపై కానిస్టేబుల్‌పై కేసు నమోదయ్యింది.

దీనిపై తాడ్వాయి పోలీసు స్టేషన్ నుంచి నివేదిక తెప్పించుకున్న జిల్లా ఎస్పి రాజేష్ చంద్ర మద్యం తాగి వాహనం నడి ప్రమాదానికి కారకుడైన కానిస్టేబుల్‌పై వేటు వేశారు.

## టి.నాబ్ డైరెక్టర్ సందీప్‌శాండిల్యకు

## మరో యేడాది పొడిగింపు



సందీప్ శాండిల్య

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్యాకు మరో ఏడాది పొడిగింపు లభించింది. గ త ఏడాది మే నెలలో పదవీ విరమణ చేసిన డిజి ర్యాంకు అధికారి అయిన సందీప్ శాండిల్యాకు సర్కారు ఈ ఏడాది మే నెల వరకు పొడిగింపు ఇచ్చింది. కా గా ఆయనకు తాజాగా మరో ఏడాది పొడిగింపు ఇస్తూ సర్కారు తాజాగా ఆదేశాలు జారీ చేసింది.

## మీర్‌ఆలం ఈద్‌గాహ్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** ముస్లింలకు పవిత్రమైన బక్రీద్ పురస్కరించుకుని ఈ నెల ఏడవ తేదీన పాతబస్తీలోని మీర్ ఆలం ఈద్గాహ్ వద్ద ఉదయం ఎనిమిది గంటల నుంచి 11.30 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. ఆంక్షల వివరాలు ఇలా వున్నాయి.

1. పురానాపూల్, కామాటిపురా, కిషన్‌బాగ్‌ల నుంచి ఈద్‌గాహ్ వైపు ప్రార్థనల కోసం వచ్చే వారు తమ వాహనాలను సమీపంలో కేటాయించిన పార్కింగ్ కేం ద్రాలలో నిలిపాల్సి వుంటుంది. ఈ సమయంలో ఈ మార్గాల్లో సాధారణ ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు. 2. శివరాంపల్లి, హసన్‌నగర్ నుంచి ఈద్‌గాహ్ వైపు ప్రార్థనల కోసం వచ్చే వారు తమ వాహనా లను సమీపంలో కేటాయించిన పార్కింగ్ కేంద్రాలలో నిలిపా ల్సి వుం టుంది. ఈ సమయంలో ఈ మార్గాలలో సాధారణ ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు. 3. కాలాపత్తర్, మీర్ ఆలం ట్యాంక్ ప్రాంతం నుంచి ఈద్‌గాహ్ వైపు ప్రార్థనల కోసం వచ్చే వారు తమ వాహనాలను సమీపంలో కేటాయించిన పార్కింగ్ కేంద్రాలలో నిలిపాల్సి వుంటుంది. ఈ సమయంలో ఈ మార్గాలలో సాధారణ ట్రాఫిక్‌ను నిలిపివేస్తారు.

కాగా ఈద్‌గాహ్‌లో ప్రార్థనలు జరిగే సమయంలో ఈ సమయంలో ఆరాంఘర్ నుంచి పురానాపూల్ మార్గంలో రెండు వైపుల సాధారణ ట్రాఫి క్‌ను నిలిపివేస్తారు. ఇదే సమయంలో ఆర్టీసీ బస్సులు, భారీ వాహనాలను ఇతర మార్గాల్లోగుండా మళ్లిస్తారు. ఈద్‌గాహ్ వద్ద ప్రార్థనలకు వచ్చేవారు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని ఏ అత్యవ సర సమయంలో 9010203626 నంబరుకు ఫోన్ చేయాలని పోలీసులు కోరారు. ఇదే సమయంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో వున్న సమయం లో వాహనదారులు కూడా పోలీసులకు సహకరిం చాలని వారు కోరారు.

## కాళేశ్వరం కూలితే గంధమల్లకు నీళ్లెలా వస్తాయి?

### నిరాశాజనకంగా కేబినెట్ నిర్ణయాలు

### రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే

### పెదవివిప్పని బిజెపి : మాజీమంత్రి హరీశ్‌రావు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు

**దుబ్బాక(అక్బర్‌పేటభూంపల్లి), జూన్ 6, ప్రభాతవార్త :** గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వరంలో అంతర్భాగమని, కాళేశ్వరం ప్రాజెక్టు కూలితే గంధమల్లకు నీళ్ల ఎలా వస్తాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మాజీమంత్రి హరీశ్‌రావు ప్రశ్నిం చారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాకలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎం, మంత్రి ఉత్తమ్, బిజెపి ఎంపిలపై ధ్వజమెత్తారు. అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ రేవంత్‌రెడ్డి అనుకున్నామని , కానీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సిఎంను మించిపోయారన్నారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను స్టే తెచ్చి ఆపిందే బిఆర్ఎస్, కెసిఆర్ అని గుర్తు చేశారు. కృష్ణా నది జలాల్లో రాష్ట్ర చరిత్రలో ఎప్పుడు వాడనంత తక్కువగా నీళ్ల వాడింది కాంగ్రెస్ ప్రభుత్వమని, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్ నగర్‌లో పంటలను ప్రభుత్వం ఎండబెట్టిందని హరీశ్‌రావు దుయ్యబట్టారు.

రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే బిజేపీ పెదవి విప్పడం లేదని, గోదావరి బనకచర్ల మీద ఆ పార్టీ నాయకులు, కేంద్ర మంత్రులు ఎందుకు మాట్లాడటం లేదు. రాష్ట్ర ప్రయోజనాలు బిజేపికి పట్టవా అని హరీశ్‌రావు అన్నారు. బనకచర్ల ద్వారా తెలంగాణ గోదావరిలో వాటా కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. శ్రీశైలం రైట్ బ్యాంక్ కెనాల్ లైనింగ్ పూర్తి అయితే రోజుకు 90వేల క్యూసెక్కుల చొప్పున తరలిస్తారు. బిజేపీ ఎంపీలు కేంద్ర మంత్రులు కళ్లు తెరవండి, ఏపీ నీటి దోపిడిని అడ్డుకోవాల్సిన కేఆర్ఎంబీ చంద్రబాబు అడుగులకు మడుగులు ఒత్తుతున్నట్లుగా కనిపిస్తుందని అన్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిల్లర మాటలు మానాలని, బనకచర్ల ప్రాజెక్టు ఆపే ప్రయత్నం చేయా లన్నారు. గంధమల్ల ప్రాజెక్టు అంటే కాళేశ్వ రంలో అంతర్భాగం. కాళేశ్వరం కూలితే గంధమల్లకు నీళ్ల ఎలా వస్తాయని సిఎంను ప్రశ్నించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇన్ని రోజులు చేసిన ప్రచారం శుద్ధ తప్పు అని తేటతెల్లమైంద న్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొత్త ప్రబాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఎల్లా రెడ్డి, దుబ్బాక పట్టణాధ్యక్షుడు పల్లె వంశీకృష్ణ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రవి, బానాల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ గన్నె వనితభూంరెడ్డి, వెంకట నర్సింహరెడ్డి, రోట్టె రాజమౌళి పంతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాలుగైదు రోజుల్లో రాష్ట్రంలో మళ్లీ వర్షాలు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త :** ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో కంగారుపడుతున్న రైతులకు వాతావరణ విభాగం గుడ్ న్యూస్ తెలిపింది. మరో నాలుగైదు రోజుల్లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌ల్లో తిరిగి వర్షాలు ప్రారంభం అవుతాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం తెలంగాణ, అంధ్రప్రదేశ్‌ల్లో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఎండాకాలమంతా వర్షాలు కురియగా ఇప్పుడు వర్షకాలంలో ఎండలు మండిపోతున్నాయి. నడి వేసవిలో మాదిరిగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. నైరుతి రుతుపవనాలు ముందుగానే తాకాయి. దీంతో గత నెల చివర్లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌ల్లో భారీ వర్షాలు కురిసాయి. ఇవి ఇలాగే కొనసాగుతాయని భావించిన రైతులు భూములను సిద్దం చేసుకుని వర్షాధార పంటల సాగుకు సిద్ధమయ్యారు. కొందరు రైతులు ఇప్పటికే విత్తనాలు కూడా విత్తుకున్నారు. ఈ సమయంలో వర్షాలు ముఖం చాటేయడంతో అన్నదాతలు కంగారు పడుతున్నారు. అయితే రైతులు ఆందోళనకు గురికావద్దని, ఈ నెల 10 తర్వాత మళ్లీ వర్షాలు మొదలవుతాయని వాతావరణ శాఖ సూచించింది. వాతావరణ పరిస్థితుల కారణంగా రుతుపవనాలు కదలికలు మందగించాయని, అందువల్లే వర్షాలు కురవడం లేదట తెలిపింది. మరో నాలుగైదురోజులు ఇదే పరిస్థితి ఉంటుందని వెల్లడించింది.

## విదేశాల్లో సింగరేణి బ్లాకులు కొనాలి

### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి




**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** విదేశాల్లో క్రిటికల్ మినరల్ బ్లాకులను కూడా తెలంగాణలోని సింగరేణి కాలరీస్ సొంతం చేసుకోవాలని కేంద్ర గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి సూచించారు. తద్వారా దేశ ఖనిజ రంగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఢిల్లీలో శుక్రవారం నేషనల్ క్రిటికల్ మినరల్స్ మిషన్ ఔట్రీచ్ ఫోరమ్‌ను ఆయన అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సెమినార్లో మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. క్లీన్ ఎనర్జీ, సెమీకండక్టర్స్, రక్షణ, డిజిటల్ టెక్నాలజీ రంగాలకు లిథియం, కోబాల్ట్, నికెల్ వంటివి క్రిటికల్ మినరల్స్ ఎంతో ముఖ్యమన్నారు. వీటి సరఫరా గొలుసును బలోపేతం చేయడానికి ఈ క్రిటికల్ మినర్స్ మిషన్ ఔట్రీచ్ ఫోరమ్ ఒక వేదికగా పనిచేస్తుందని తెలిపారు. అలాగే ఈ ఫోరమ్ ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యా సంస్థలు, పరిశోధన సంస్థల మధ్య సమన్వయ సహకారాన్ని ప్రోత్సహిస్తుందని వెల్లడించారు.

గనుల రంగంలో తమ ప్రభుత్వం గత పదేళ్లలో అనేక సంస్కరణలు తెచ్చిందని చెప్పారు. పారదర్శకంగా మినరల్ బ్లాకుల వేలం ప్రక్రియను అమలు చేస్తోందని వివరించారు. ఆస్ట్రేలియా, అర్జెంటీనా, చిలీలతో క్రిటికల్ మినరల్స్ సరఫరా, అన్వేషణ, ప్రాసెసింగ్‌కు సంబంధించి భారత్ ఒప్పందాలు కుదుర్చు కుందని వెల్లడించారు. ఈ ఒప్పందాలు భారతదేశ ఇంధన భద్రత, సాంకేతిక అభివృద్ధికి దోహద పడతాయని ఆశా భావం వ్యక్తం చేశారు. సింగరేణి సంస్థ ఇప్పటికే బొగ్గు ఉత్పత్తిలో దేశంలో అగ్రగామిగా ఉందని, ఇప్పుడు విదేశీ ఖనిజ బ్లాకులలో పెట్టుబడులు పెట్టడం ద్వారా మరింత వృద్ధి సాధించాలని పేర్కొన్నారు.

కాగా దేశ వ్యాప్తంగా ఇప్పటివరకు 34 క్రిటికల్ మినరల్ బ్లాకుల వేలం పూర్తయిందని, ఇందులో లిథియం, గ్రాఫైట్ వంటి ముఖ్యమైన ఖనిజాల బ్లాకులు ఉన్నాయని పేర్కొన్నారు.

జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా గత మూడేళ్లలో 445 ప్రాజెక్టులను చేపట్టిందని, 185 ప్రాజెక్టులకు నిధులు కేటాయించామన్నారు. ఈ ప్రాజెక్టులు ఖనిజ సంపదను గుర్తించడం, అన్వేషణను వేగవంతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు.

## ఎమ్మెల్యే గోపినాథ్ పరిస్థితి అత్యంత విషమం

### వెంటిలేటర్‌పై

### కొనసాగుతున్న చికిత్స

**హైదరాబాద్ (శేరిలింగంపల్లి), జూన్ 6, ప్రభాతవార్త:** జుబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపినాథ్ (62)ఆరోగ్యం అత్యంత విషమంగా ఉంది. ఆయనకు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స అందిసు _న్నారు. గురువారం సాయంత్రం ఇంట్లో ఆయనకు గుండెపోటు వచ్చినట్లు సమాచారం. కుటుంబసభ్యులు నిన్న 4:35 నిముషాలకు ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. కార్డియాక్ అరెస్ట్‌కు గురైనట్లు వైద్యులు తెలిపారు. సీపీఆర్ చేయటంతో తిరిగి గుండె కొట్టుకోవడం, నాడి, బీపీ సాధారణ స్థితికి రావడంతో .. ఐసీయులో వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఆయన ఆరోగ్యంపై ఆసుపత్రి వైద్యులు బులెటెన్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. కొన్నాళ్లుగా గోపీనాథ్ కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నారు. మూడు నెలల క్రితం కూడా ఆయన ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరారు. అప్పట్లో ఆయన డయాలసిస్ చేయించుకున్నట్లు సమాచారం. మాగంటిని పరామర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు గుండెపోటులో గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న జుబ్లిహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ను రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు. మధ్యాహ్నం ఆసుపత్రికి చేరుకున్న మంత్రి శ్రీధర్ బాబు మాగంటి గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిని గురించి వైద్యులను అడిగి తెలుసు కున్నారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. వైద్యులు తెలిపిన వివరాల ప్రకారంగా గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితి నిన్నటి కంటే మెరుగ్గా ఉందని, గోపీనాథ్ తనకు సన్నిహితుడని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

**కెటిఆర్ ఆరా.. విదేశ పర్యటన కుదింపు**

విదేశీ పర్యటనలో ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాగంటి ఆరోగ్యంపై ఆరా తీశారు. గోపీనాథ్ కుటుంబసభ్యులతోనూ, ఏఐజీ ఆసుపత్రి వైద్య బృందంతోనూ ఫోన్‌లో మాట్లాడారు. అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడే అవకాశం ఉందని వైద్యులు కేటీఆర్‌కు వివరించారు. ఈ ఘటన నేపథ్యంలో ఆమెరికా పర్యటనలో ఉన్న కేటీఆర్ తన విదేశీ పర్యటనను కుదించుకుని హైదరాబాద్ బయలుదేరుతున్నట్లు తెలిసింది. గుండెపోటుతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న మాగంటి గోపీనాథ్‌ను నగరమేయర్ విజయలక్ష్మీతో పాటు కొందరు బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పరామర్శించారు.

## రైతులకు పాడి గేదెల స్కీమ్

### కుటుంబానికి రెండు జీవాలు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని రైతులకు మరో శుభవార్త వినిపించేందుకు తెలంగాణ సర్కార్ సిద్ధమవుతోంది. భూమి లేని రైతులకు కూడా ఫ్రీగా గేదెలు ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే రైతులకు రుణమాఫీ, రైతు భరోసాను ఇచ్చింది. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు బోనస్ అందిస్తోంది. తాజాగా రైతులను ఆకర్షించేందుకు ప్రభుత్వం మరో కొత్త పథకం తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. రైతు కుటుంబాలను ఆకర్షించేందుకు పాడి గేదెల పంపిణీ స్కీమును తీసుకురాబోతున్నట్లు సమాచారం. వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు ఈ పాడి గేదెలను ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన లబ్దిదారుల జాబితాలను గ్రామాల్లో ప్రకటించి కుటుంబానికి 2 గేదెలను ఇవ్వాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పుడు చర్చలు జోరుగా సాగుతున్నాయి. కౌలు రైతులకు కూడా ఈ స్కీము వర్తింపచేయ్యాలా వద్దా అనే దానిపై చర్చలు జరుగుతున్నాయి.

దీని వల్ల లక్షలాది మంది రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఒక్కో గేదె ధర రూ.1 లక్ష వరకు ఉంటోంది. అలాగే వాటికి వ్యాక్సిన్లను కూడా వేలకు వేలు ఖర్చు చేస్తుంది. మరి అలాంటి గేదెలను ఫ్రీగా ఇవ్వడం ప్రభుత్వానికి భారమే. అందులోనూ రాష్ట్ర ఖజానా కష్టాల్లో ఉన్న సమయంలో ఇలాంటి పథకాన్ని అమలు చేయడం కూడా సవాలు వంటిదే. అయినా సర్కార్ దశల వారీగా ఈ పథకాన్ని అమలు చేసి రైతు కుటుంబాలకు దగ్గరవ్వాలని ప్లాన్ చేస్తోంది. ప్రస్తుతం ఈ స్కీముకు సంబంధించిన గైడ్‌లైన్స్ అధికారులు రూపొందిస్తున్నారని తెలిసింది.


**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**PROCUREMENT SHORT TENDER NOTICE**

| Sl. No. | NIT No. | Name of Work |
|---|---|---|
| 1 | 26/PROC/MAU61-FA0REV(null)/4/2025-ACC/2nd Call Dt.06.06.2025. | RFP for Engaging Programme Auditor for World Bank & ADB funding programme in APCRDA for F.Y.2025-26 |
| 2 | 36/PROC/MAU61-USI0HB(OTH)/135/2025-HB Dt.06.06.2025 | Providing Architectural finishes, Electro-mechanical, Plumbing works to three (3) nos. of PEB structures to accommodate all the balance departments under Municipal Administration & Urban Development wing of GoAP near APCRDA Project Office at Amaravati, Andhra Pradesh. **Est. Cost - Rs.48.60 Crores** |

The bid can be downloaded on AP e-procurement portal from **09.06.2025 to 17.06.2025 up to 14.00 Hrs**. Due date for submission of Bid is **17.06.2025 up to 15.00 Hrs**. Technical bid opening **17.06.2025 @ 16.00 Hrs.** For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in**.

**E-PROCUREMENT TENDER NOTICE**

| S.No. | NIT No. | Name of Work |
|---|---|---|
| 1 | NIT No. 44/ MAU 61-PLG0AUD/1/ 2025-PLG, Dt. 06.06.2025 | APCRDA - "RFP for engagement of Landscape Architect for providing Comprehensive Designs for Landscape, Waterways, Bridges etc., in Amaravati Government Complex". |

The bid can be downloaded on AP e-procurement portal from **09.06.2025 to 24.06.2025 up to 14.00 Hrs**. Due date for submission of Bid is **24.06.2025 up to 15.00 Hrs**. Technical bid opening **24.06.2025 @ 16.00 Hrs**. For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Commissioner, APCRDA, Vijayawada



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ

**ఫారము-7**
**రూఢీ ప్రకటన**

(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి కలెక్టర్/అదనపు కలెక్టర్/రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్ (భూసేకరణ)

జిల్లా కలెక్టర్, సూర్యాపేటఫైల్ నెం. జి/647/2024 తేది: 03.06.2025
రెవెన్యూ డివిజనల్ అధికారి, హుజూర్‌నగర్ ఫైల్ నెం. ఎఫ్/1111/2024 తేది: 02.06.2025
గెజిట్ నెంబరు. 25/2025 తేది: 03.06.2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, సూర్యాపేటగారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్ట పరిచిన సూర్యాపేట జిల్లాలో చింతలపాలెం మండలం వెల్లటూరు గ్రామ రెవిన్యూలో సర్వే నెంబర్ 467, 462, 459, 457, 460, 456, 472, 451 & 505లలో గల విస్తీర్ణం ఎ.22.14½ కుంటలు పట్టా భూమి ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా చింతలపాలెం మండలము వెల్లటూర్ గ్రామము నందు కృష్ణా నదినుండి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 19(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017) ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 ఛాప్టర్ (2)లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు ఛాప్టర్-3 ప్రకారం సెక్షన్-10ఎ ఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, పాలకీడు మండలం, బొత్తలపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 467, 462, 459, 457, 460, 456, 472, 451 & 505లలో గల విస్తీర్ణం ఎ.22.14½ కుంటలు గల భూమి నుండి ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్‌లో భాగముగా పంప్ హౌస్ నిర్మింపుట అవసరమైనదని ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం రూఢీ ప్రకటన జారీ చేయనైనది.

గ్రామము : వెల్లటూర్ మండలము : చింతలపాలెం జిల్లా : సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నెంబరు | భూమి స్వభావము | భూమి రకము | భూసేకరణ కింద వచ్చు భూమి | పట్టాదారు పేరు/ ఆసక్తి గల వ్యక్తుల పేరు/ చిరునామా | అనుభవదారు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు/ నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 467/ఆ2 | పట్టా | ఖుష్కి | 0.16 | [illegible] | [illegible] | 467 | 467 | 467 | 459 | |
| 2 | 462 | పట్టా | ఖుష్కి | 1.27 | [illegible] | [illegible] | 467 | 474 | 467 | 459 | |
| 3 | 462 | పట్టా | ఖుష్కి | 2.29 | [illegible] | [illegible] | 462 | 474 | 467 | 459 | |
| 4 | 459/ఆ | పట్టా | ఖుష్కి | 1.10½ | [illegible] | [illegible] | 460 | 462 | 467 | [illegible] | |
| 5 | 459/ఆ1 | పట్టా | ఖుష్కి | 1.10½ | [illegible] | [illegible] | 460 | 459 | 462 | 472 | |
| 6 | 457 | పట్టా | ఖుష్కి | 1.14 | [illegible] | [illegible] | 456 | 457 | 459 | 472 | |
| 7 | 460/ఆ | పట్టా | ఖుష్కి | 0.31 | [illegible] | [illegible] | 460 | 459 | 462 | 472 | |
| 8 | 460/ఆ1/1 | పట్టా | ఖుష్కి | 0.10½ | [illegible] | [illegible] | 460 | 459 | 462 | 472 | |
| 9 | 460/ఈ | పట్టా | ఖుష్కి | 0.10½ | [illegible] | [illegible] | 460 | 459 | 462 | 472 | |
| 10 | 460/అ1/1 | పట్టా | ఖుష్కి | 0.10½ | గడ్డ నాగిరెడ్డి తండ్రి : వెంకటప్పారెడ్డి | గడ్డ నాగిరెడ్డి తండ్రి : వెంకటప్పారెడ్డి | 460/1 | 459/2 | 462/2 | 472/2 | |
| 11 | 456/1 456/1/1 | పట్టా | ఖుష్కి | 2.10 | గుండా లక్ష్మారెడ్డి తండ్రి : రాంరెడ్డి గుండా మాధవ [illegible] | గుండా లక్ష్మారెడ్డి తండ్రి : రాంరెడ్డి గుండా మాధవ [illegible] | 457/1 | 457/2 | 472/2 | 472/3 | |
| 12 | 472/79/[illegible] | పట్టా | ఖుష్కి | 4.08 | [illegible] | [illegible] | 472/2 | 472/2 | 460/2 | [illegible] | |
| 13 | 472/13 | పట్టా | ఖుష్కి | 0.24 | [illegible] | [illegible] | 472 | 472 | 456 | 472 | |
| 14 | 472/13 | పట్టా | ఖుష్కి | 0.29 | [illegible] | [illegible] | 472 | 472 | 457 | 472 | |
| 15 | 472/11 | పట్టా | ఖుష్కి | 0.12 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | |
| 16 | 472/10 | పట్టా | ఖుష్కి | 0.10 | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | [illegible] | |
| 17 | 451/2 | పట్టా | ఖుష్కి | 0.35 | [illegible] | [illegible] | 472 | 450 | 472 | 472 | |
| 18 | 451/1 | పట్టా | ఖుష్కి | 0.35 | [illegible] | [illegible] | 472 | 472 | 472 | 472 | |
| 19 | 451/3 | పట్టా | ఖుష్కి | 0.35 | [illegible] | [illegible] | 472 | 450 | 472 | 472 | |
| 20 | 505 | పట్టా | ఖుష్కి | 0.38 | - | కీసర ఆదర్ మోహన్‌రెడ్డి తండ్రి : పెద్ద పుల్లారెడ్డి | 468 | 505 | 505 | 505 | |
| | మొత్తం | | | 22.14½ | | | | | | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలు పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించుట లేదు.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్ నందు కార్యాలయపు పనివేళల నందు చూసుకొనవచ్చును.

సం/-. భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, హుజూర్‌నగర్
సం/- అదనపు కలెక్టర్, సూర్యాపేట
సం/-. జిల్లా కలెక్టర్, సూర్యాపేట

DIPR RO.NO: 208/LA/PP/Advt/Pub/2025-26

వార్త

జీవితంలో విజయం సాధించడానికి మనిషికి తెలివి తేటలు ఉండీ అవకాశాలు వచ్చినంత మాత్రాన చాలదు. ఏకాగ్రత, లక్ష్యం అవసరం.

-సి.డబ్ల్యు వెండైట్

# సంక్షోభంలో యువజనం!

యువతే జాతి పురోగతికి మూలాధారం. నేటి బాలలు, యువతీయువకులే రేపటి దేశభవిత నిర్ణేతలు. యువజనశక్తి యుక్తులే దేశాభివృద్ధికి బాటలు అంటూ ఉపన్యాసాలిస్తూ కోట్లాది రూపాయలు వారిసంక్షేమం, అభ్యుదయం కోసం వెచ్చిస్తున్నట్లు ప్రకటిస్తున్నా ఆశించిన ఫలితాలు కన్పించడం లేదు. యువజనుల్లో రోజురోజుకు నిరుత్సాహం పెరిగిపోతున్నది. నిరక్షరాస్యులైన యువతీ యువకులే కాదు ఉన్నత చదువులు అభ్యసించిన వారు కూడా నిరాశానిస్పృహలకు లోనవుతున్నారు. పట్టణాల్లో, నగరాల్లో ఉన్న యువతీ యువకుల పరిస్థితి ఇందుకు మినహాయింపు కాకపోయినా దేశ ప్రగతికి పట్టుగొమ్మలైన గ్రామీణప్రాంతాల్లో ఉంటున్న యువత పరిస్థితి రాను రాను అత్యంత దయనీయంగా తయారవుతున్నది. చదివిన చదువులకు తగ్గట్టుగా ఉపాధి దొరక్కపోయినా జీవించేందుకు అవసరమైన కనీస సంపాదనకు సైతం నోచుకొని దుర్భరపరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేషన్ పూర్తిచేసి గ్రామాల్లో రోజు వారీ వ్యవసాయ కూలీకి వెళ్లలేక ఒకవేళ పరిస్థితుల ప్రభావంతో వెళ్లినా అలవాటులేని కష్టం చేయలేక దేశంలో కోట్లాది మంది యువతీయువకులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. నగరాలకు చేరుకొని అర్ధాకలితో జీవనం గడుపుతూ పోటీ పరీక్షలకు తయారవుతున్న యువజనం పరిస్థితి వర్ణనాతీతం. పనిచేసే శక్తి ఉంది. ఉన్నంతలో కొద్దోగొప్పో మేధాశక్తి ఉంది. కష్టపడి పని చేయాలనే ఉత్సాహం ఉంది. తమకు సంఘంలో ఒక స్థానం కల్పించుకోవాలనే తపన ఉంది. అయినా ఏ ఆధారం లేక నిరుత్సాహంతో, అర్ధాకలితో అసంతృప్తితో అల్లాడిపోతున్నారు. ఏ చిన్న ఆధారం దొరికినా కష్టపడి పనిచేయడానికి వెనుకాడడం లేదు. ఇకపోతే మెడికల్, ఇంజినీరింగ్ లాంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసేందుకు మెరికల్లాంటి యువతీయువకులు విదేశీబాట పడుతున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనంతో చదువుకున్నామని వారికి కూడా తెలుసు. ఇక్కడ ప్రజల డబ్బుతో చదివి ఈ ప్రాంత ప్రజలకు సేవలు అందించాల్సిన యువతరం ఏదోరకంగా విదేశాలకు వెళ్లి అక్కడ నానా ఇబ్బందులు పడుతూ తమ విజ్ఞానాన్ని మరింత పెంపొందించుకొని అక్కడి ప్రజలకు సేవలు అందించడానికి ఆరాటపడుతున్నారు. ఇలా విదేశాలకు వెళ్లుతున్న వారిలో ప్రపంచంలో భారత్ అగ్రస్థానంలో ఉంటే అందులో తెలుగు రాష్ట్రాలు మొదటివరుసలో ఉన్నాయని చెప్పొచ్చు. ఇలా వీరంతా ఎందుకు వెళ్లుతున్నారనేది ప్రత్యేకంగా చర్చించాల్సిన అవసరం లేదు. ఒకవేళ వీరంతా ఇక్కడే సేవలు అందించాలనుకున్నా వారికి తగిన వసతులు, వేతనాలు చెల్లించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడు తాజాగా అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ రెండోసారి బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆ దేశం నుంచి విదేశీయులను పంపేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే వేలాది మంది విద్యార్థులకు వీసాలు రద్దు చేసి వారివారి ప్రదేశాలకు పంపే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. అలా పంపడంలో చేతులకు బేడీలు వేసి తరలించే కార్యక్రమం చేపట్టేందుకు కూడా వెనుకాడడం లేదు. రానురాను అమెరికాకు వెళ్లేందుకు దారులు మూసుకుపోతున్నాయి. ఇతర దేశాల పరిస్థితి కూడా అంతంత మాత్రంగానేఉంది. ఇక స్వదేశంలో నిరుద్యోగుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక స్వయం ఉపాధి పథకాలు చేపట్టి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. అధునాతన ప్రపంచంలో కాలాన్ని మించిన వేగంతో శస్త్రసాంకేతిక రంగాలు పురోగమిస్తున్నాయి. ఆధునిక మానవుడు అపూర్వమైన మేధాశక్తిని సంతరించుకొని శక్తియుక్తులు, ప్రతిభా సామర్థ్యాలతో విశ్వాంతరాలపై సాధిస్తున్న విజయాల వెనుక యువశక్తి పాత్ర అత్యంత కీలమైందనే విషయం అందరికితెలిసిందే. నవభారత నిర్మాణానికి ఉద్యమించి దేశకీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేయాల్సిన పవిత్ర బాధ్యత యువజనుల భుజస్కంధాలపై ఉందనేది కూడా నిర్వివాదాంశం. పల్లె పల్లెల్లో, ప్రతి బస్తీల్లోనూ పరిస్థితులను చక్కదిద్ది ఆర్థికంగా, సామాజికంగా సంస్కృతికంగా యువజనులంతా కలిసి కృషిచేస్తేనే జాతి ఉజ్వల భవిష్యత్ సుసాధ్యమవుతుందని ఏనాటి నుంచో పాలకులు వక్కాణిస్తూనే ఉన్నారు. ఇలాంటి ఉపన్యాసాలు వింటూనే ఉన్నాం. వేలాది కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా యువజనుల అభ్యున్నతికే పనిచేస్తున్నామని పాలకులు ఎంతగా చెప్పుకుంటున్నా నిరాశానిస్పృహలు యువజనుల్లో ఎందుకు కలుగుతున్నాయనే అనుమానం రాకతప్పదు. అటు గ్రామాల్లోని యువత, ఇటు నగరాల్లోని యువజనం కుల, మత వర్గ బేధాలు అనిలేకుండా అందరిలోనూ ఇవి వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకానికి లక్షలాది దరఖాస్తులు వచ్చాయి. ఆ పథకంపై ఎందరో ఆశలుపెట్టుకున్నారు. ఇలా ప్రతి రాష్ట్రంలోనూ యువత సంక్షేమం కోసం పథకాలు చేపడుతూనే ఉన్నారు. అయితే కాగితాల్లోనేకాక వాస్తవాల్లోకి వెళ్లిచూస్తే గతంలో యువజన సంక్షేమం కోసం పెట్టిన పథకాలు ఏమాత్రం నిజమైన అర్హులకు అందాయో తెలుస్తుంది. అందులో రాజకీయ జోక్యం, అవినీతి, ఆశ్రితపక్షపాతాన్ని ఎందుకు నిరోధించలేకపోతున్నారు. ఫలితంగా ఎన్నో పథకాలు నిజమైన లబ్ధిదారులకు అందడం లేదు. అటు ఉద్యోగాలు రాక, ఇటు స్వయంఉపాధి పథకాలు అనర్హుల పాలవుతుంటే నిరాశానిస్పృహలకు లోనవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారు కూడా లేకపోలేదు. యువజనుల్లో ఆత్మవిశ్వాసం పెంచాలి. అందుకు ముఖ్యంగా ప్రభుత్వ వైఖరిలో మార్పురావాలి. యువజన సంక్షేమ కార్యక్రమాలు త్రికరణశుద్ధిగా అమల చేయాలి.

కష్టతరమైన పనిని చేసే వ్యక్తి, అప్పగించబడిన పనిని చాలా బాగా చేసే వ్యక్తి ఎన్నటికీ తన ఆత్మగౌరవాన్ని కోల్పోడు.



జార్జి బెర్నార్డ్ షా

సమర్థులైనవారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులవుతారు. తక్కినవారు వారిని అనుసరిస్తూ ఉంటారు.



సర్వేపల్లి రాధాకృష్ణన్

## ప్రజావాక్కు



### జీవితం విలువ తెలుపాలి

ఈ మధ్యకాలంలో పిల్లలు చిన్నచిన్న విషయాలను కూడా తీవ్రమైనవిగా భావించి, ఉలికిపాటుకు గురవుతున్నారు. పరీక్షల్లో తక్కువమార్కులు రావడం, తల్లిదండ్రులు, తోటి పిల్లల మాటలు కూడా వారిలో తీవ్రఒత్తిడిని కలిగిస్తున్నాయి. ఈ ఒత్తిడివల్ల వారు జీవితంపై ఆసక్తి కోల్పోయి, ఆత్మహత్య వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. చిన్న సమస్యలను పెద్దవిగా భావించడం, ఆలోచనల్లో స్థిరత లేకపోవడం, భావోద్వేగాలను వ్యక్తపరచలేకపోవడం, ఇందుకు ప్రధానకారణాలు. చిన్నసమస్యలు కూడా పరిష్కారమయ్యే మార్గాలున్నాయని, జీవితం విలువైనదని వారికి తెలియజేయాల్సిన బాధ్యత మన అందరిది.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### అభిమానం ఎక్కువైతే ఇలాగే..

బెంగుళూరులోని చిన్నస్వామి స్టేడియమ్‌లో జూన్ 5 వ తేదీన అట్టహాసంగా ప్రారంభించిన రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు ఐపిఎల్ విజయోత్సవ వేడుకలో తొక్కిసలాట సంభవించి పదకొండు మంది చనిపోగా నలభైకి పైగా అభిమానులు క్షతగాత్రులయ్యారనివార్త. తొక్కిసలాట మరణాలు కొత్తవి కావు. ఈ మధ్య ముగిసిన కుంభమేళా స్నానాల ఘట్టంలోనూ, హైద్రాబాద్‌లో సంధ్య సినిమాహాలు వద్ద పుష్పా2 రిలీజ్ సందర్భంలోను జరిగిన అనుభవాలు ప్రజలకు కనువిప్పు కలిగించకపోవడం విచారకరం. స్టేడియం వద్ద చనిపోయిన వారందరు యువకులే. హాజరైన అభిమానులే ముఖ్యమైన కారణం. కాని ప్రభుత్వాన్ని, పోలీసులను ఆడిపోసు కోవడం మామూలు అయిపోయింది.

-డా. ఎన్. ఎస్. ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### అశ్లీల వెబ్ సైట్లను నిషేధించాలి

మన దేశంలో ఇంటర్నెట్ వినియోగం పెరిగే కొద్దీ, యూత్ పయనిస్తున్న దిశలు కూడా మారిపోతున్నాయి. ముఖ్యంగా, అశ్లీల వెబ్‌సైట్లను తిలకించేసంఖ్య రోజు రోజుకు భయంకరంగా పెరుగుతోంది అన్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ అశ్లీలవెబ్‌సైట్ల వల్ల యువత మానసికంగా దిగజారిపోతున్నారు. విద్యాప్రతిభ తగ్గిపోతోంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే కొన్ని దేశాలలో లాగా, అశ్లీల వెబ్‌సైట్లను పూర్తిగా నిషేధించాలనే చర్య తీసుకోవాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ఆర్సీబీ విజయోత్సవంలో విషాదం

పద్దెనిమిది సంవత్సరాల తర్వాత ఐపీ.ఎల్. లో తొలిసారిగా కప్పు గెలుచుకున్న రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు (ఆర్సీబీ) విజయోత్సవాల్లో విషాదం నెలకొంది. చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 47 మంది గాయపడటం చాలా విచారకరం. స్టేడియం సామర్థం కేవలం 40 వేలు మందికి మాత్రమే కాగా సుమారు రెండు లక్షల పైచిలుకు అభిమానులు తరలి వచ్చినట్లు చెబుతున్నారు. ఈ కారణంగానే భారీ తొక్కిసలాటకు దారితీసిందని భావిస్తున్నారు. అభిమానం సినిమా దీయేటర్ల వరకూ, టీవీల ముందు ఉండాలే తప్ప వీధుల్లోకి వచ్చిప్రాణాలు తీసుకొని తల్లితండ్రు లకు మానసిక క్షోభ ఇవ్వడం కాదు. ఈ సంబరాల వల్ల మృతి చెందిన ఆ కుటుంబాలకు దిక్కెవరు?. ఇలాంటి సంబరాలను ముందు ముందు ఏ రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థించడం కరెక్ట్ కాదేమో అనిపిస్తుంది.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### ప్లాస్టిక్‌ను నిషేధించాలి

జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని వార్షిక కార్యక్రమంలా జరుపుకున్నాం. వ్యర్థ పదార్థాల ద్వారా సంభవించే అనారోగ్య సమస్యల నుండి రక్షణ కలిగేలా అందరూ కలిసి కట్టుగా చర్యలుతీసుకోవాలని వ్యాసాలు, ఉపన్యాసాలు చాలానే వచ్చాయి. అయితే ఇందుకు నడుంకట్టుకునేదవరనేదెవరు? దీనికి సమాధానం ప్రథమంగా ప్రభుత్వానిదే. ప్లాస్టిక్ సంచులను వాడద్దని చెబుతారేగాని ఈ ప్రొడక్ట్ ఉత్పత్తిని నిషేధించరెందుకు? పొద్దున కొనే పాల ప్యాకెట్ల నుండి సంతలో కొనే కూర గాయలను మూటగట్టే వన్నీ ప్లాస్టిక్ సంచులే. కొంత కాలక్రితం ఈసంచులను వాడద్దని షాపులవారిని హెచ్చరించారు. ఈ ప్రమాదకరమైన ఉత్పత్తిని నిషేధించాలి.

-ఎన్. రామలక్ష్మి,సికింద్రాబాద్

### పారదర్శకతతో సీటు ఇవ్వాలి

దేశంలో కొన్ని వందల విశ్వవిద్యాలయాలు ఉంటాయి. వాటి పరిధిలో వేల విద్యార్థుల వృత్తి విద్యా కోర్సులు లక్షలు ఖర్చు చేసి, శ్రమతో భవిష్యత్తు కోసం రిస్క్ తీసుకుంటారు. అది ఏ కోర్సు అయినా అభ్యర్థి ర్యాంకు, కేటగిరి ఒకటే. సదరు ప్రవేశ పరీక్షకు అన్నికోణాల్లో స్పష్టమైన నిబంధాలుంటాయి. కళాశాల ప్రవేశం సమానప్రతిభ ఉన్నప్పుడు, ఏఅంశం మీద ప్రాధాన్యత ఉందో తెలియపరుస్తూ అభ్యర్థికి అనుమానం నివృత్తి చేయాలి.

-బొల్లోజు మేఘానద్, విశాఖపట్నం

మనవి: ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# పేదలకు దూరమవుతున్న 'ప్రజారోగ్యం'!

**బ్యాంకుల నుంచి అప్పోసొప్పో చేసి నక్షత్ర హోటళ్ల స్థాయికి మించి ఆస్పత్రులను నిర్మించడం, ఆ తర్వాత పెట్టుబడిని వడ్డీతోసహా రాబట్టడం కోసం చేయకూడని, చేయరాని పనులు కూడా చేయడానికి వెనుకాడడం లేదు. ఈసంపాదన ఆరాటపు పోటీలో కొందరు నైతిక విలువలు పాటించడం లేదు. అందరూ అలాగే చేస్తున్నారని చెప్పడం లేదు కానీ అధిక శాతం ఆ మార్గంలోనే పయనిస్తున్నారు. వినడానికి కఠినంగా అనిపించినా ఇది వాస్తవం. పాలకులు కూడా ఈ విషయంలో ప్రేక్షకపాత్ర వహించడం దురదృష్టకరం. ప్రజారోగ్య రంగంలో ఇటువంటి వారిపై నిబంధనలు రూపొందించకపోవడం విచారకరం. సమీక్షలు, అధ్యయనాలు, కమిటీలతో కాలం గడుపుతున్నారే తప్ప సమగ్ర చట్టానికి రూపకల్పన జరగడం లేదు. ప్రజారోగ్య పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం వైపు మనం పయనిస్తున్నామని చెప్పుకోవడం ఎంత ఆత్మవంచనో ఒకసారి మనసుపెట్టి ఆలోచించాలి.**

దామెర్ల సాయిబాబ

'అప్పిచ్చువాడు వైద్యుడు. ఎప్పుడు ఎడతెగకపారు యేరు..'లాంటి వసతులున్న ఊరినే నివాసానికిఎంపిక చేసుకోవాలని ఏనాడో సుమతీశతకకారుడు చెప్పారు. మన పెద్దలు వైద్యానికి ఎంత ప్రాముఖ్యత ఇచ్చారో ఇంతకు మించి ఉదాహరణ చెప్పక్కర్లేదు. జనారోగ్యమే జాతి మహాభాగ్యమని దేశ ప్రజలందరిని పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయాల్సిన బాధ్యతపాలకులపై ఉంటుందని మనరాజ్యాంగ నిర్మాతలు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగానే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. కేంద్రప్రభుత్వం, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. అయినా ఆ కోణంలో ఆశించిన మేరకు ఫలితాలు చేకూరడం లేదు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త కొత్త మందులు, చికిత్సా విధానాలను కనిపెడుతూనే ఉన్నారు. అయితే అంతకు రెట్టింపు స్థాయిలో వైద్యనిపుణులకు అంచనాలకు అందని రీతిలో రకరకాల రోగాలు కూడా విజృంభిస్తున్నాయి. మొన్నటివరకు మానవజాతినే గడగడలాడించిన కరోనా వ్యాధి మళ్లీ చాపకింద నీరులా విస్తరిస్తుందనేవార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. శుక్రవారం నాటికి ఐదువేలమూడు వందల మందికిపైగా ఈ వ్యాధిసోకింది. మొత్తంయాభైఐదు మందికిపైగా మరణించినట్లు అధికారవర్గాలు వెల్లడించాయి. దీనికితోడు మరికొన్ని విషజ్వరాలు విజృంభిస్తూనే ఉన్నాయి. కరోనా వ్యాధి మొదటిసారి సోకినప్పుడు దాన్ని అంతగా పట్టించుకో లేదు. కానీ రానురాను దాని ఉధృతికి ప్రపంచంలోని ఈ దేశం ఆ దేశం అనికాదు అన్ని దేశాలు భయాందోళనకుగుర య్యాయి. అగ్రరాజ్యమని విర్రవీగే అమెరికా లాంటి దేశం కూడా చిగురుటాకుల్లా వణికింది. భారతదేశం పరిస్థితి కూడా ఆందోళనకరంగా తయారైంది. ఈ రంగం, ఆరంగం అనికాదు విద్యారంగాన్ని మొదలు పెట్టుకొని ఆర్థికరంగం ఒకటేమిటి అన్ని విభాగాలపై దీని ప్రభావం తీవ్రంగా పడింది. లక్షలాది మంది వలస కార్మికులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ వ్యాధికి ఖచ్చితమైన చికిత్సలేదనేది వాస్తవమే కావొచ్చు. కానీ శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచుకుంటే కొంతమేరకైనా వ్యాధిని నిరోధించవచ్చునని వైద్యనిపుణులు సూచించారు. ప్రస్తుతం కరోనా మళ్లీ విస్త రిస్తుందనే వార్తలు రావడంతో అప్రమత్తంగా ఉండాలని, రోగనిరోధక శక్తిని పెంచుకునే దిశలో చర్యలు తీసుకోవాలని డాక్టర్లు చెబుతున్నారు. వాస్తవంగా మనదేశంలో వైద్యఆరోగ్య రంగం డొల్లతనం కరోనా సమయంలో బయటపడింది. బెడ్లు, ప్రాణవాయువు (ఆక్సిజన్) అందక వేలాది మంది మరణించారంటే ఏమనుకోవాలి. మొదటిసారి కాదు, రెండోసారి విజృంభించినప్పుడు కూడా పరిస్థితిని అదుపు చేయ లేకపోయారు. ప్రాణాలను కాపాడలేక చేతులెత్తేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే కోవిడ్‌పై యుద్ధానికి అవసరమైన సాధన సంపత్తిని సమకూర్చుకోవడంలో విఫలమయ్యారని చెప్పొచ్చు. ప్రస్తుత పరిస్థితులు కూడా అందుకు విరుద్ధంగా లేవు. దేశ ఆరోగ్యవ్యవస్థ ఎంత బలహీనంగా ఉందో విజృంభిస్తున్న రోగాలు బయటపెడుతున్నాయి. వైద్య బృందాలు మాత్రం శక్తిమేరకు ఈ రోగాలవ్యాప్తిని అరికట్టి చికిత్స అందించేందుకు కృషిచేస్తూనే ఉన్నాయి. ఆనాటి కరోనా సమయంలో ఎందరో వైద్యులు నెలల తరబడి కుటుంబాలకు దూరంగా ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా కరోనా పోరులో దాదాపు ఎనిమిది వేలమందికిపైగా సిబ్బంది బలైపోయినట్లు

ఒక్క మాట

అప్పట్లోనే అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి. అన్నింటి కంటే ఘోరంగా వైద్య సిబ్బంది ఈ కరోనాను నియంత్రించేందుకు సిద్ధంగా ఉన్నా అవసరమైన వెంటిలేటర్లు, బెడ్లు లేకపోవడం నిస్సహాయంగా ఉండిపోవాల్సి వచ్చింది. ఏదిఏమైనా కరోనాయే కాదు విషజ్వరాల నుండి ప్రధానంగా నిరుపేదలను కాపాడడంలో విఫలమవుతున్నారనిచెప్పొచ్చు. ఇంతటి భారీ నష్టాలు చూసిన తర్వాత కూడా గుణపాఠం నేర్చుకోకపోవడం దురదృష్టం. పాలకులకు ఎన్నో ప్రాధాన్యతలు ఉంటాయి. ఓట్ల కోసం, సీట్ల కోసం, అధికారం కోసం వరాలు గుప్పించడం, అవి తీర్చేందుకు వందల కోట్లే కాదు లక్షల కోట్ల రూపాయలు వెచ్చించడం సహజమే, అవసరం కూడా. కానీ అదే సమయంలో ప్రజారోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలు నిధుల కేటాయింపులు అంశాలకు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదనేది కేంద్ర, రాష్ట్రాలు వైద్యరంగానికి కేటాయిస్తున్న నిధులను బట్టి తెలుస్తుంది. రోడ్లు అవసరమే. సంక్షేమ పథకాలను కాదనలేం. దారిద్ర్యరేఖకు దిగువనున్న నిరుపేద, నిర్భాగ్యులకు చేయూతనందించాల్సిందే. అందులో మరో వాదనకు తావులేదు. అదే సమయంలో వైద్యరంగాన్ని విస్మరించడం ఎంతటి ప్రమాదానికి దారితీస్తున్నదో తరచుగా బయటపడుతున్నది. కళ్లముందు ప్రాణాలు పోతున్నా కనీస ప్రయత్నం కూడా చేయలేని నిస్సహాయస్థితిలో ఉన్నామంటే ఏమనుకోవాలి. ఎన్నో విదేశాలతో పోల్చినా భారతదేశంలో వైద్యరంగానికి కేటాయిస్తున్న నిధులు అంతంత మాత్రంగానే చెప్పొచ్చు. ఉన్న నిధులను సక్రమంగా వెచ్చించడంలోకూడా పర్యవేక్షణాలోపం స్పష్టంగా కనపడుతున్నది. అవినీతికూడా వైద్యరంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. మొన్న హైదరాబాద్ నడిబొడ్డులో ఉన్న ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలో రోగులకు సరఫరా చేసిన ఆహారంలో కల్తీ ఉండడంతో ఒకరు మరణించడంతోపాటు తొంభైమూడు మంది అస్వస్థతకు గురయ్యారు. వారంతా విధివంచితులు. మానసిక వ్యాధిగ్రస్తులు. కళ్లముందు ఏం జరుగుతున్నా ప్రశ్నించలేరు. అలాంటి వారికి కల్తీ ఆహారం సరఫరా కావడం ఎంతటి దుస్థితిలో ఉన్నామో అర్థంచేసుకోవచ్చు. నకిలీ, నాసిరకం మందులు ఎందరి ప్రాణాలో తీస్తున్నాయి. నగరాల్లో ప్రైవేట్ వైద్యం అందుబాటులో ఉండడంతో కొంతవరకు ఖరీదైనా వైద్యం లభిస్తున్నది. కానీ గ్రామాల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వరంగ ఆస్పత్రులు, ఆరోగ్య కేంద్రాలు మౌలిక వసతుల సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామీణ ఆరోగ్య అవసరాల కోసం పనిచేస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రపంచ ఆరోగ్యవ్యవస్థ ప్రమాణాలకు ఏ మాత్రం పోల్చడానికి వీలులేకుండా తయారవుతున్నాయనేది అనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. మొన్న ఆమధ్య వెల్లడించిన లెక్కల ప్రకారం భారత్‌లో దాదాపు ఏడు లక్షలకు పైగా గ్రామాల్లో తొంభై కోట్ల మందికిపైగా ప్రజలు నివసిస్తున్నారు. ముప్పైవేల ప్రాథమిక కేంద్రాలు సేవలు అందిస్తున్నాయి. అందులో అధికశాతం ఆరోగ్య కేంద్రాలు ఒకే వైద్యుడి ద్వారా సేవలు అందిస్తుండగా ఐదు శాతం అసలు వైద్యుడే లేకుండా నడుస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. దేశ ప్రజలు యేటా చేస్తున్న ఆరోగ్య వ్యయంలో రోగనిరోధక శక్తి కోసం 9.6 శాతం వెచ్చిస్తుండగా మూడు లక్షల అరవైవేల కోట్ల రూపాయలు రోగచికిత్సకోసం ఖర్చు చేస్తున్నారు. ఇక ప్రైవేట్ వైద్యం బీదాబిక్కిలకే కాదు సామాన్యులకు కూడా అందుబాటులో లేకుండాపోయింది. వైద్యం ఒక వ్యాపారం అయింది. రోగిని, రోగాన్ని పరిశీలించి, పరీక్షించి వైద్యం అందించే రోజులుపోయి రోగి జేబును చూసి వైద్యం చేసే రోజులు దాపురించాయి. బ్యాంకులనుంచి అప్పోసొప్పో చేసి నక్షత్ర హోటళ్లస్థాయికి మించి ఆస్పత్రులను నిర్మించడం, ఆ తర్వాత పెట్టుబడిని వడ్డీతో సహా రాబట్టడం కోసం చేయకూడని, చేయరాని పనులు కూడా చేయడానికి వెనుకాడడంలేదు. ఈసంపాదన ఆరాటపు పోటీలో కొందరు నైతిక విలువలు పాటించడంలేదు. అందరూ అలాగే చేస్తు న్నారని చెప్పడంలేదు కానీ అధికశాతం ఆ మార్గంలోనే పయనిస్తున్నారు. వినడానికి కఠినంగా అనిపించినా ఇది వాస్తవం. పాలకులు కూడా ఈ విషయంలో ప్రేక్షకపాత్ర వహించడం దురదృష్టకరం. ప్రజారోగ్యరంగంలో ఇటువంటి వారిపై నిబంధనలు రూపొందిం చకపోవడం విచారకరం. సమీక్షలు, అధ్యయనాలు, కమిటీలతో కాలం గడుపుతున్నారే తప్ప సమగ్ర చట్టానికి రూపకల్పన జరగడంలేదు. ప్రజారోగ్య పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే ఆరోగ్యవంతమైన సమాజం వైపు మనం పయనిస్తు న్నామని చెప్పుకోవడం ఎంత ఆత్మవంచనో ఒకసారి మనసుపెట్టి ఆలోచించాలి. ఆరోగ్యం విషయంలో బాధ్యతంతా ప్రభుత్వాలపై వేయకుండాప్రజలు కూడా స్వీయనియంత్రణ పాటించాల్సిన అవసరం ఉంది. ●

# మానసిక రోగులకు వైకల్యమే శాపమా?

ఆళవందార్ వేణు మాధవ్

భారత పార్లమెంట్ ద్వారా ప్రజల హక్కులను కాపాడటానికి చట్టాలు రూపొందించబడినవి. వీటిలో కార్మికులు స్త్రీలు, బాలలు, వృద్ధులకు ప్రత్యేక హక్కులు కల్పించబడినవి. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవం, వివక్షత నిరోధించడానికి 'వికలాంగుల హక్కుల చట్టం2016ను పార్లమెంట్ ఆమోదించబడి 19 ఏప్రిల్ 2017 అమలు కాబడుతుంది. ఈ చట్టం ప్రకారం అంధత్వం, దృష్టిలోపం, కుష్టు, వినికిడి లోపం, చలనం లేని వైకల్యం, మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యం లాంటి లోపాలు గుర్తించబడినవి. ఇలాంటి లోపాలున్న వ్యక్తులకు ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు కల్పించే బాధ్యత కలదు. 2014 సంవత్సరం ఒక నివేదిక ప్రకారం తెలంగాణ మొత్తం రాష్ట్ర జనాభాలో 12.2శాతం వికలాంగుల సంఖ్య ఉందని ఒక అంచనా. వికలాంగులు మానసికంగా కృంగిపోకుండా వారి మనోవికాసం కొరకు, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పునరావాసం కొరకు పింఛన్, ఇతరులపై ఆధార పడకుండా ఉన్నత విద్యలో రిజర్వేషన్లు, రైలు, బస్సులలో ప్రత్యేక రాయితీలు, బ్యాంక్, పోస్ట్ ఆఫీసులలో ప్రత్యేక క్యూలైన్ వసతి కల్పించింది. వికలాంగులు అనగానే ప్రజల మనస్సులో తళుక్కున మెరిసేవారు అంధులు, బధిరులు మాత్రమే, పుట్టుకతో కొంతమంది మానసికంగా శారీరక ఎదుగుదల లేని చాలా మంది సమాజం, కుటుంబంలో ఆదరణ లేక ఇతరులకు చెప్పుకోలేని స్థితి జీవిస్తున్నారు.



ఇలాంటి వారిని ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. మానసిక వికలాంగులలో మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యం అనే రెండు రకాలు. వీటిలో మానసిక వైఫల్యం పుట్టుకతో వచ్చేది. రెండవది వారు జీవించే స్థితిలో ఉంది. నేడు ఎక్కువగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. చదువుల కొరకు తల్లితండ్రులు, విద్యాసంస్థల ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, నిరు ద్యోగం, పేదరికం, ఐ.టి రంగాల్లో పని భారం, మాదక ద్రవ్యాల సేవనం, రోడ్డు, రైలు ప్రమాదాల వలన కూడా మానసిక అనారోగ్యం పాలై ఎటువంటి గుర్తింపు, ఆదరణ లేక జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి సౌకర్యాలు లభించుట లేదు. రైల్వేలలో అన్ని రకాల వికలాంగులతో పాటు వారి అనుచరులకుకూడా రాయితీలు కల్పిస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యార్థులకు వికలాంగులకు, విలేఖరులకు, బస్ పాసులు ఇస్తూ రాయితీలు ఇస్తుంది. నగరాల్లో ఉన్న మానసికవ్యాధి నిపుణుల వద్దకు మానసిక రోగులు చికిత్స కొరకు రావడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. వీరి ప్రయాణ నిమిత్తం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో పాసులు, రాయితీలు లేవు. పార్లమెంట్ ఆమోదించిన వికలాంగుల చట్టం2016 ప్రకారం మానసిక అనారోగ్యంతో బాధపడే వారికి రాయితీ లు ఇవ్వాలి. దేశంలో అత్యున్నత పార్లమెంట్‌లో ఆమోదిం చిన చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖచ్చితంగాఅమలు పరచాలి. కావున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే బస్సులలో మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యంతో బాధపడే వారికికూడా ప్రత్యేక పాసులు, రాయుతీలు ఇవ్వాలి. ●

# పోషకాహార లోపమే వ్యాధులకు మూలం!



రామ కిష్టయ్య సంగన భట్ల

ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని మొట్టమొదటి సారిగా 2019లో ఘనంగా జరుపుకున్నారు. 'ది ఫుచర్ ఆఫ్ ఫుడ్ సేఫ్టీ' అనే నినాదంతో జెనీవాలోని అడిస్‌అబాబా కాన్ఫరెన్స్‌లో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలంటూ పిలుపునిచ్చారు. ప్రజల్లో ఆహారభద్రతపై మరింత అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ ఏడాది కూడా ఈ దినోత్సవాన్ని సరికొత్త థీమ్‌తో ఘనంగా నిర్వహించనున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఐక్యరాజ్యసమితికి చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ ఆర్గనైజేషన్ సహకారంతో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. ఆహార భద్రత అనేది ప్రభుత్వాలు, ఉత్పత్తిదారులు, వినియోగదారుల మధ్య భాగస్వామ్య బాధ్యత. అంతేకాదు మనం తీసుకునే ఆహారం సురక్షితమైనదేనా అని నిర్ధారించడంలో రైతు నుంచి కూలివరకు ప్రతి ఒక్కరి పాత్రఉంది. ఆహార భద్రత కోసం తగు చర్యలు తీసుకునేలా ప్రపంచ దేశాలను ప్రోత్సహించడం, ఆహార కొరత సమస్య ఉత్పన్నం కాకుండా చూడడం, ప్రజలు రకరకాల వ్యాధులను ఎదుర్కొనేలా వారికి పౌష్టికరమైన ఆహారం అందుబాటులో ఉండేలా చేయడం వంటివి తమ ప్రధాన ఎజెండాగా వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ పేర్కొంది. ఈరోజుల్లో అన్నం విలువ కొంత మందికే తెలుస్తుంది. ఎందుకంటే అన్నం తినేవాడి కన్నా దానిని పండించే వారికే దాని విలువ తెలుస్తుంది. ఆహారం పారేయడానికి ఒక్క నిమిషం చాలు, కాని ఆ ఆహారాన్ని పండించడానికి కనీసం మూడు నెలలు పడుతుంది. ఆ విషయం తెలియక చాలా మంది దానిని వృధా చేస్తారు. దీనికి సంబంధించే అంటే ఆహార భద్రతను దృష్టిలో పెట్టుకొని ఈరోజున ప్రపంచ వ్యాప్తంగా ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం జరుపుకుంటారు. ఒకరు రోజంతా కష్టపడికూలి పనులు చేసి డబ్బు సంపాదిస్తారు. ఇంకొకరు రోజంతా ఏసీ గదుల్లో కంప్యూటర్ల ముందు కూర్చొని కుస్తీ పడతారు. ఎవరు ఎలా కష్టపడినా అది కడుపు నింపుకోవడానికే. కోటి విద్యలు కూటి కోరకే. ముందు కడుపు నిండాకే మనిషి మరో దాని గురించి ఆలోచిస్తున్నాడు. ప్రస్తుతం కనీస అవసరాల కిందకి చాలా వచ్చాయి. ఎన్ని ఆ జాబితాలో చేరినా మొదటి స్థానంలో ఆహారమే ఉంటుంది. ఎందుకంటే ఆహారం లేకుండా సృష్టిలో ఏ ప్రాణి జీవించలేదు కాబట్టి. కానీ ప్రస్తుత రోజుల్లో మనుషులు లక్షల రూపాయలు సంపాదిస్తున్నా కూడా కడుపు నిండా భోజనం చేయడం లేదు. బరువు పెరుగుతామనో, లావైపోతామనో ఇలా కారణాలు చెబుతున్నారు. కొందరేమో తినడానికి తిండి లేక అవస్థలు పడుతున్నారు. ఈ రెండు కారణాల వల్ల పోషకాహార లోపాన్ని ఎదురుకుంటున్న వారు చాలా మంది ఉన్నారు. అలాగే వ్యాధుల బారినపడకుండా ఎలాంటి ఆహారం తినాలనే విషయాలపై అవగాహన అవసరం. ఆహారం కలుషితమయ్యేందుకు, తద్వారా అనారోగ్యం కలి






గేందుకు బ్యాక్టీరియా, వైరస్, పరాన్న జీవులు కారణం. అధిక మోతాదులో వాడే రసాయనిక ఎరువులు, నిల్వ చేసేందుకు, రుచి కల్పించేందుకు ఉపయోగించే రసాయనాలు కూడా చేటు చేసేవే. ఎలాంటి జబ్బులబారిన పడకుండా ఉండేందుకు అవసరమైన ఆహారం తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలతో పాటు గింజలు, విత్తనాలు, పల్లీలు, శనగలు, ఉలవలు, బొబ్బర్లు, జీడిపప్పు, బాదం పప్పు, వాల్‌నట్స్ వంటివి ప్రతి రోజూ తీసుకోవాలి. భారతీయులు రోజూ కనీసం 400గ్రాముల కూరగాయలు, పండ్లు తీసుకోవాలని భారత పోషకాహార సంస్థ చెబుతోంది. రాగులు, జొన్నలు, వరి, గోధుమ వంటి ధాన్యాన్ని కూడా ఎక్కువగా తీసుకోవాలి. మరీ ప్రత్యేకంగా కొవ్వులు, చెక్కర, ఉప్పు వాడకాన్ని చాలా తక్కువగా వాడటం ఉత్తమం. 50శాతం కేలరీలు అందిస్తున్న పంటలు 8 రకాలు ఉన్నాయి. బార్లీ, బీన్స్, వేరుశెనగ, మొక్కజొన్న, వరి, జొన్న, గోధుమలు వీలైనంత ఎక్కువగా ఆహారంలో భాగం చేసుకోవాలి. బయట లభించే ఆహారాలకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని నిపుణులు చెబుతున్నారు. ఫాస్ట్‌ఫుడ్ అసలు తినకపోవడం చాలా మంచిది. చిన్నారులకు కనీసం 9నెలల వరకు తల్లిపాలివ్వాలి. పుట్టగానే డబ్బాపాలను అలవాటు చేస్తే అప్పటి నుంచే వారిలో పోషకాహార లోపం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. పోషకాహారం తీసుకోవడంతోపాటు తగినంత వ్యాయామం చేయడం కూడా చాలా అవసరం. మన భూమి మీద మనిషి తినగలిగే మొక్కల జాతుల సంఖ్య దాదాపు 30వేలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 852 మిలియన్ల మంది దీర్ఘకాలంగా అతి పేదరికం కారణంగా ఆకలితో అలమటిస్తున్నారు. ఈ సంఖ్య నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణాలు అనేకం. విపరీతమైన జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు, ఆహార ధాన్యాలను జీవ ఇంధనాల కోసం ఉపయోగించడం, మౌలిక ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గించి లాభదాయకమైన వాణిజ్య పంటలవైపు మొగ్గు చూపడం ఇలా ఎన్నో కారణాలు. వీటి పర్యవసానంగా ఆహార ధాన్యాల ధరలు అందుబాటులోకి లేనంతగా పెరగడం మరో సమస్య. ప్రపంచ జనాభాలో దాదాపు సగం పట్టణాలు, నగరాలలో జీవిస్తున్నారు. అభివృద్ధి చెందుతున్నదేశాలలో 70శాతం కంటే ఎక్కువ మంది పల్లెల్లో నివసిస్తున్నారు. అయినా అనేక కారణాలవల్ల వ్యవసాయం కుంటుపడింది. ఆఫ్రికాలో కొన్ని దేశాలలో కరవు నిత్యం తాండవిస్తూనే ఉంది. ఆసియాలో దాదాపు 60శాతం జనాభా పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. అదే ఆఫ్రికాలో ఆ శాతం 75 దాటింది. దాదాపు 22దేశాలలో (వాటిలో 16 ఆఫ్రికాలోవే) పోషకాహార లోపం 35శాతం దాటిందని తేలింది. భారతావనిలో విస్తారమైన కోట్లాది ఎకరాల భూములుండి, లక్షలాది ఎకరాల పంట భూములలో పప్పు ధాన్యాలు, తదితర ఆహార ధాన్యాలతో విలసిల్లింది. వ్యవసాయ రంగానికి ఒక సమగ విధానమంటూ లేకపోవటంతో వ్యవసాయాన్ని సమాధి చేసి, ఉన్న వ్యవసాయంలో వాణిజ్య పంటలను ప్రోత్సహించింది. ప్రపంచ వేదికల్లో గొప్పలకు పోయే మన పాలకుల ఏలికలు వాస్తవ పునాదులపై నిలబడి, మాటల్లో కాకుండా ఆచరణతో కూడిన ఆహార భద్రత పరిష్కారానికి పూనుకోవాలి. అదే జాతీయ ప్రయోజనాలకు, జాతి ప్రయోజనాలకు శ్రేయస్కారం. ●

# 50వేల మంది బోగస్ ప్రభుత్వ ఉద్యోగులు

## రూ.230 కోట్ల నిధులు స్వాహా





**భోపాల్, జూన్ 6:** మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని కుదిపేసేలాంటి భారీ కుంభకోణం ఒకటి వెలుగు చూసింది. ఏకంగా 50వేలమందికి పైగా బోగస్ ప్రభుత్వ ఉద్యోగుల పేరిట సుమారు రూ.230 కోట్ల ప్రజాధనాన్ని కొందరు అక్రమార్కులు కొల్లగొట్టిన వైనం వెలుగులోకి వచ్చింది. వేలాదిమంది నిజమైన ప్రభుత్వ ఉద్యోగులకు ఆరు నెలలకు పైగా జీతాలు అందకపోవడంతో ఈ భారీ మోసం బయటపడింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టారు. దీంతో ప్రభుత్వ జీతాల చెల్లింపు వ్యవస్థపై అనుమానాలు తలెత్తాయి. అధికారులు లోతుగా పరిశీలించగా, అనేక అనుమానాస్పద ఉద్యోగుల కోడ్‌లు, జీతాల పంపిణీలో తీవ్రమైన అవకతవకలు ఉన్నట్లు గుర్తించారు. ప్రభుత్వ పేరోల్‌లో నకిలీ ఉద్యోగుల పేర్లను చేర్చి, ప్రజా సేవకుల కోసం కేటాయించిన భారీ మొత్తంలో నిధులను కొన్ని వ్యవస్థీకృత ముఠాలు కాజేసినట్లు ప్రాథమికంగా తేలింది. ఇటువంటి దొంగ ఉద్యోగుల కుంభకోణాలు కేవలం పరిపాలనాపరమైన పొరపాట్ల వల్ల జరిగేవి కావని, ఇవి ఉద్దేశపూర్వకంగా చేసే అవినీతి చర్యలని నిపుణులు చెబుతున్నారు. పలువురు అధికారుల కుమ్మక్కు లేకుండా ఇలాంటి మోసాలు జరగడం అసాధ్యమని తెలుస్తోంది. పేరోల్ వ్యవస్థలలో కల్పిత ఉద్యోగుల వివరాలను చొప్పించడం ద్వారా, మోసగాళ్లు ఆ జీతాలను తాము నియంత్రించే బ్యాంకు ఖాతాలకు మళ్లిస్తారు. చాలా సందర్భాల్లో ఈ కల్పిత జీతాల ద్వారా నిజమైన వ్యక్తులే లబ్ధి పొందుతారు. పన్ను చెల్లింపుదారుల సొమ్మును ఒక ప్రణాళికాబద్ధమైన విధానం ద్వారా ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్తుంది. సంప్రదాయ ధృవీకరణ, పేరోల్ వ్యవస్థల్లోని బలహీనతలు ఇటువంటి కుంభకోణాలను గుర్తించడం కష్టతరం చేస్తాయి. నష్టం జరిగిన తర్వాతే విషయం బయటపడుతుంది. ప్రభావం, నివారణ చర్యలు ఇలాంటి ఘటనలు కేవలం మధ్యప్రదేశ్‌కు మాత్రమే పరిమితం కాలేదు. గతంలో ఇతర ప్రాంతాలు, రంగాల్లో కూడా ఇటువంటి కుంభకోణాలు నమోదయ్యాయి. ఉద్యోగుల ధృవీకరణ ప్రక్రియల్లోని వ్యవస్థాగత లోపాలను అంతర్గత ఆడిట్‌లు బహిర్గతం చేశాయి. ఇలాంటి మోసాలను అరికట్టడానికి ప్రభుత్వ ఉద్యోగులందరినీ క్షుణ్ణంగా మానవ వనరుల ఆడిట్ చేయడం, బయో మెట్రిక్ ధృవీకరణ చేపట్టడం వంటివి చాలా కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వరంగ పేరోళ్ల నుంచి దొంగఉద్యోగులను ఏరివేయడానికి పబ్లిక్ సర్వీస్, అడ్మినిస్ట్రేషన్‌విభాగం, జాతీయ కోశాగారం వంటి ఆర్థిక,పరిపాలనా పర్యవేక్షణ సంస్థల మధ్య సహకారం అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఈ కుంభకోణం తీవ్రతను పూర్తిగా వెలికితీయడానికి, బాధ్యులైన వారిని గుర్తించడానికి సమగ్ర దర్యాప్తును ప్రారంభించింది. ఈ స్కామ్ వల్ల నష్టపోయిన నిజమైన ఉద్యోగులకు జీతాల చెల్లింపులను పునరుద్ధరించడానికి కూడా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఘటనతో ప్రభుత్వ యంత్రాంగంలోని లొసుగులు మరోసారి బహిర్గతమయ్యాయి.




## తొక్కిసలాటకు, మాకు ఎలాంటి సంబంధంలేదు

### కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్

**బెంగళూరు, జూన్ 6:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ విజయోత్సవ వేడుకల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది అభిమానులు మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి తమ అధికారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ హైకోర్టును ఆశ్రయించింది. కర్ణాటక ప్రభుత్వం నమోదు చేసిన కేసుల నేపథ్యంలో తమపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను సవాలు చేస్తూ కేఎస్సీఏ ఈరోజు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఊహించని విధంగా జరిగిన ఈ విషాదకర సంఘటనకు తమ అసోసియేషన్‌ను గానీ, తమ సభ్యులను గానీ క్రిమినల్‌గా బాధ్యులను చేయరాదని కేఎస్సీఏ తన పిటిషన్‌లో వాదించింది. తాము నిర్దోషులమని, చట్టపరమైన రక్షణ కల్పించాలని కోరింది. కెఎస్సీఏ దాఖలు చేసిన పిటిషన్‌ను స్వీకరించిన కర్ణాటక హైకోర్టు, అడ్వకేట్ జనరల్ సమర్పించిన స్థితిగతుల నివేదికను పరిశీలించినఅనంతరం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. కేసు తదుపరి విచారణను ఈనెల 10వ తేదీకి వాయిదా వేసింది.



## హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల ప్రవేశం నిలిపివేత

### కోర్టులో ట్రంప్‌కు చుక్కెదురు

**వాషింగ్టన్, జూన్ 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య విభేదాలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో హార్వర్డ్‌లో చదవాలనుకొనే విదేశీ విద్యార్థుల వీసాలపై ఆంక్షలు విధిస్తూ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులకు బ్రేక్ పడింది. ఆయన ఉత్తర్వులను ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపివేసింది. ట్రంప్ ఆంక్షల ఉత్తర్వులను వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ న్యాయస్థానంలో సవాల్ చేసింది. దీనిపై విచారణ జరగ్గా ట్రంప్ ప్రకటనను తాత్కాలికంగా నిషేధిస్తున్నట్లు కోర్టు తీర్పునిచ్చింది. ఈ సందర్భంగా అధ్యక్షుడి ఉత్తర్వులు అమల్లోకి వస్తే హార్వర్డ్‌కు కోలుకోలేని దెబ్బ తగుతుందని జడ్జి అల్లిసన్ బరోస్ వ్యాఖ్యానించారు. దీనిపై తదుపరి విచారణ ఈ నెల 16కు వాయిదా వేశారు. కాగా హార్వర్డ్ విదేశీ విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్న అనుమతిని రద్దు చేస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పటికే ఫెడరల్ కోర్టు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే యూనివర్సిటీలో చదవాలనుకొనే విదేశీ విద్యార్థుల వీసాలపై ఆంక్షలు విధిస్తూ ఓ కార్యనిర్వాహక ఉత్తర్వులపై ట్రంప్ సంతకం చేశారు. మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జిలో ఉన్న క్యాంపస్‌లో విదేశీ విద్యార్థులను హార్వర్డ్‌లో చేర్చుకోవడం వల్లజాతీయ భద్రతను ప్రమాదంలోకి నెట్టే ముప్పుందని ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## 'సిందూర్'తో ప్రపంచానికి తెలిసిన భారత్ శక్తి

### ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్




**నాగ్‌పూర్, జూన్ 6:** దేశ భద్రత విషయంలో పూర్తిస్థాయిలో స్వావలంబన సాధించాల్సిన అవసరం ఉందని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడి, అనంతరం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇందుకుగాను నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని, పరిశోధనలు ముమ్మరం చేయాలని ఆయన సూచించారు. నాగ్‌పూర్‌లో జరిగిన కార్యకర్త వికాస్ వర్గ్ ముగింపు కార్యక్రమంలో మోహన్ భగవత్ ప్రసంగించారు. పహల్గామ్ దాడిలో ఉగ్రవాదులు మన దేశంలోకి ప్రవేశించి అమాయక పౌరులను అత్యంత కిరాతకంగా చంపారు. ఈ ఘటన పట్ల తీవ్రమైన ఆవేదన, ఆగ్రహం వ్యక్తం కావడం సహజం. దోషులను కఠినంగా శిక్షించాలన్న బలమైన ఆకాంక్ష వ్యక్తమైంది. ప్రతిగా కొన్ని చర్యలు తీసుకున్నారు. మన సైన్యం ధైర్యసాహసాలు, సామర్థ్యాలు మరోసారి ప్రపంచానికి తెలిసాయి. ప్రభుత్వ యంత్రాంగం పట్టుదల కూడా కనిపించింది. రాజకీయ వర్గాల్లోనూ పరస్పర అవగాహన వ్యక్తమైంది. సమాజం కూడా తన ఐక్యత సందేశాన్ని ఇచ్చింది. ఇది శాశ్వతంగా కొనసాగాలని భగవత్ అన్నారు. ఉగ్రవాదాన్ని వ్యాప్తి చేసే దేశాలు ఉన్నంతకాలం మనం అప్రమత్తంగా ఉండాలని భగవత్ వాదించారు. మనకు శత్రువులు లేరు, మనం సత్యం, అహింసలను అనుసరించేవారమని ఆయన అన్నారు. గతంలో పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం మోహన్ భగవత్ మాట్లాడుతూ భారత్ శక్తిమంతమైనదని నిరూపించాల్సిన సమయం వచ్చిందన్నారు. సరిహద్దుల్లో మతపరమైన ప్రదేశాలు, పౌర ప్రాంతాలపై పాకిస్థాన్ సైన్యం చేస్తున్న దాడులను ఆయన ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మన అన్ని సరిహద్దుల్లో దుష్ట శక్తుల దుర్మార్గాన్ని చూస్తున్నందున, మనం శక్తిమంతంగా ఉండటం తప్ప మరో మార్గంలేదని అంతర్గత బలం ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

## సింధు జలాల ఒప్పందం కాలం చెల్లిన డాక్యుమెంట్: పాక్

**కరాచి, జూన్ 6:** భారత్‌తో 1972లో కుదిరిన చారిత్రక సిమ్లా ఒప్పందంపై పాకిస్థాన్‌లో భిన్న వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఈ ఒప్పందం కాలం చెల్లిన డెడ్ డాక్యుమెంట్ అని సంచలన వ్యాఖ్యలు చేయగా, పాకిస్థాన్ విదేశాంగ శాఖ మాత్రం దీనిని తోసిపుచ్చింది. భారత్‌తో సిమ్లా ఒప్పందంతో సహా ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని అధికారికంగా రద్దు చేసుకునే నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేసింది. ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ, సిమ్లా ఒప్పందానికి ఇక విలువ లేదు. అది ఒక డెడ్ డాక్యుమెంట్. సింధూ జలాల ఒప్పందాన్ని సస్పెండ్ చేశారో లేదో తెలియదుగానీ సిమ్లా అగ్రిమెంట్ పని అయిపోయిందని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతో తాము 1948 నాటి స్థితికి చేరుకున్నామని, ప్రస్తుతం ఉన్న నియంత్రణ రేఖ ఎల్ఓసీ కేవలం కాల్పుల విరమణ రేఖగా పరిగణించాల్సి వస్తుందని ఆయన పరోక్షంగా సూచించారు. 1948 భారత్ పాక్ యుద్ధం అనంతరం ఈ కాల్పుల విరమణ రేఖను ఏర్పాటు చేశారు. అయితే, రక్షణ మంత్రి వ్యాఖ్యలపై పాకిస్థాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి భిన్నంగా స్పందించారు. భారత్‌తో ఏ ద్వైపాక్షిక ఒప్పందాన్ని రద్దు చేసుకోవడానికి అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ప్రస్తుతం ఆ దేశంతో ఉన్న సిమ్లా ఒప్పందంతో సహా అన్ని ద్వైపాక్షిక ఒప్పందాలు అమల్లో ఉంటాయని ఆ ప్రతినిధి వెల్లడించారు. 1971 భారత్‌పాక్ యుద్ధం అనంతరం 1972లో సిమ్లా ఒప్పందం కుదిరింది. దీనిపై అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ, పాకిస్థాన్ అధ్యక్షుడు జుల్ఫికర్ అలీ భుట్టో సంతకాలు చేశారు. ఈ ఒప్పందంప్రకారం, ఇరుదేశాల మధ్య శాంతియుతద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, కశ్మీర్‌తో సహా పెండింగ్‌లో ఉన్న అన్ని సమస్యలను మూడో దేశం జోక్యం లేకుండా ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని నిర్ణయించారు. జమ్ముకశ్మీర్‌లో అప్పటి కాల్పుల విరమణ రేఖను నియంత్రణ రేఖగా పునర్నిర్వచించడం, దానిని ఏకపక్షంగా మార్చకూడదన్న నిబంధనకు ఇరు దేశాలు కట్టుబడి ఉండటం, బంగ్లాదేశ్ సార్వభౌమత్వాన్ని పాకిస్థాన్ గుర్తించి ఆ దేశంతో సంబంధాలను సాధారణ స్థితికి తేవడం వంటివి ఈ ఒప్పందంలోని ముఖ్యమైన అంశాలు.

## గాజాలో చుక్కలంటుతున్న నిత్యావసరాలు

# పార్లే బిస్కెట్ ప్యాకెట్‌ధర రూ.2400!




**గాజాసిటీ, జూన్ 6:** ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య యుద్ధం సుమారు ఏడాదిన్నర నుంచి కొనసాగుతూనే ఉంది. యుద్ధం ఆపేందుకు పలుమార్లు చర్చలు, సంప్రదింపులు జరుగుతున్నా కూడా రెండు దేశాల మధ్య రాజీ మాత్రం కుదరడం లేదు. గత 24 గంటల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో దాదాపు 100 మంది పాలస్తీనియన్ల ప్రాణాలు కోల్పోయారు. ఇదిలావుండగా, మరో వైపు గాజాలో నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పది రూపాయలు విలువ చేసే వస్తువులకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. భారత్‌లో రూ.5లు విలువ చేసే పార్లే జీ బిస్కెట్ ప్యాకెట్.. గాజాలో ఏకంగా రూ.2,400కి విక్రయిస్తున్నారు. ఇదే కాకుండా అనేక రకాల వస్తువుల ధరలు వందలు, వేలల్లోనే ఉన్నాయి. గాజాకు చెందిన ఓ వ్యక్తి చేసిన పోస్టు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. చాలాసేపు వేచి ఉన్న తర్వాత నేను చివరకు ఈరోజు మా రవీఫ్‌కి ఇష్టమైన బిస్కెట్లు కొన్నాను. వాటి ధర 1.5 యూరోల అంటే రూ.147 నుంచి 24 యూరోలకు రూ. 2,342 పెరిగినా పిల్లలకు ఇష్టం కాబట్టి తీసుకున్నా అని చెబుతూ అతడు ఓ పోస్టు పెట్టాడు. దీంతో అక్కడి నిత్యావసర వస్తువుల ధరల అంశం సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. గాజాలోకి నిత్యావసరాల సరఫరాలు ఇజ్రాయెల్ అడ్డుకోవడంతో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. నెలల తరబడి కొనసాగుతున్న ఇజ్రాయెల్ దాడులతో గాజాలోని చాలా మంది నిర్వాసితులయ్యారు.

మరోవైపు గాజా ప్రజలందరూ ట్రక్కుల ద్వారా వచ్చే ఆహారం, ఇతర సాయంపైనే ఆధారపడ్డారు. అయితే ఇజ్రాయెల్ వాటిని ఆపేస్తుండడంతో పరిస్థితి దారుణంగా మారింది. మూడు నెలలకు పైగా సరిహద్దులు మూసేయడంతో గాజాలోని 20 లక్షల మంది ప్రజలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కొన్ని నిత్యావసర సరుకులు మానవతా సహాయంగా ఉచితంగా గాజాకు సరఫరా చేస్తున్నారు. అయితే అవి కొద్ది మందికి మాత్రమే అందుతున్నాయి. మిగతా సరుకులను బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పార్లే జీ బిస్కెట్‌తో పాటు అనేక రకాల సరుకుల ధరలు ఆకాశాన్నంటుతు న్నాయి. పార్లే జీ బిస్కట్ ప్యాకెట్ రూ.2,342, 1 కిలో చక్కెర: రూ.4,914, 1 లీటర్ వంట నూనె రూ.4,177, 1 కిలో బంగాళాదుంపలు రూ.1,965, 1 కిలో ఉల్లిపాయలు రూ.4,423, 1 కాఫీ కప్పు రూ. 1,800లుగా అమ్ముడవుతున్నాయి. అంతర్జాతీయ రెస్క్యూ కమిషన్ పంపిన 6.7 టన్నుల మందులు, వైద్య సరఫరాలకు సంబంధించిన వాహనాలను గాజా వెలుపలే నిలిపేశారు. వీటిని గాజాలోకి ఎప్పుడు అనుతిస్తారో తెలీని పరిస్థితి. మరోవైపు నిత్యావసర ధరలు ఒక్కసారిగా పెరిగిపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఓ వైపు కాల్పుల విరమణ ఒప్పందం కుదరకపోవడం, మరోవైపు అందాల్సిన సహాయం నిలిచిపోవడంతో మళ్ళీ దాడులు మొదలవుతాయేమోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

# అమెరికా అధ్యక్షుడికి మోడీ 11 సార్లు లొంగిపోయారు

## బీహార్ సభలో రాహుల్ ఎద్దేవా




**పాట్నా, జూన్ 6:** ప్రధాన మంత్రి నరేంద్రమోడీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి లొంగిపోతున్నారని ఎఐసిసి నాయకుడు, లోక్‌సభా ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. బీహార్‌లోని రాజ్‌గిర్‌లో జరిగిన సంవిధాన్ సురక్షా సమ్మేళన్‌లోమాట్లాడిన ఆయన మోడీపై తన విమర్శలను మరింతగాపెంచారు. ట్రంప్ తాను స్వయంగా మాట్లాడుతూ నరేంద్రమోడీని లొంగిపోవాలని 11 సార్లు చెప్పానని చెప్పారని, అయినా ఇప్పటివరకూ మోడీ ఆ వ్యాఖ్యలపై స్పందించలేదని ఇప్పటికీ మౌనమే వహించారని విమర్శించారు. ట్రంప్ అబద్ధాలు చెపుతున్నారని ప్రధానిమోడీ ఎందుకు చెప్పలేకపోతున్నారని ఎందుకంటే ట్రంప్‌చేసిన వ్యాఖ్యలు నిజమేనని రాహుల్ అన్నారు. అంతకుముందు భోపాల్ సభలోకూడా రాహుల్ ఇవే వ్యాఖ్యలు చేసారు. ఆపరేషన్ సిందూర్‌పరంగా ట్రంప్ మోడీకి ఫోన్‌చేసి నరేంద్ర సరెండర్ అన్నారని వెనువెంటనే మోడీ లొంగిపోయారని ఎద్దేవా చేసారు. ట్రంప్ అక్కడినుంచే సంకేతాలిచ్చారని, ఆయన ఫోన్ తీసుకుని మోడీజీ మీరేం చేస్తున్నారు. వెంటనే ఆగిపోండి నేను చెప్పిన మాటలకు లొంగిపోండి అని చెప్పారని, ట్రంప్ ఆదేశాలను మోడీ పాటించారని ఎద్దేవాచేసారు. అలాగే రాహుల్ ఆరెస్సెస్‌పైనా తీవ్ర వ్యాఖ్యలు చేసారు. ఆర్ఎస్ఎస్‌పై తాను నిరంతరం పోరాటం చేస్తున్నానని, వారు మోడీకంటే సులువుగా లొంగిపోతారని అన్నారు. క్షమాబిక్ష పిటిషన్‌లు రాయడానికి వారికి సుదీర్ఘసమయం పట్టదని, ఆధునిక టెక్నాలజీ వచ్చినతర్వాత పెన్నుపేపర్ స్థానంలో వాట్సాప్ వచ్చేసిందని రాహుల్ చమత్కరించారు. వియానయక్ దామోదర్ సావర్కర్ అప్పటి ఆర్ఎస్ఎస్ సిద్ధాంతకర్త బ్రిటిష్ పాలనలో అనేకసార్లు క్షమాబిక్ష పిటిషన్లు పెట్టుకున్నారని, అండమాన్ జైలులో ఆయనకు మరణశిక్ష అమలు చేసేంత వరకూ ఆయన క్షమాబిక్ష పిటిషన్లు పెట్టుకుంటూనే వచ్చారన్నారు.

అయితే రాహుల్ వ్యాఖ్యలను బిజెపి అధ్యక్షుడు జెపినడ్డా, అధికార ప్రతినిధి సుధాంశు త్రివేదిలు తీవ్రంగా వ్యతిరేకించారు. రాహుల్ వ్యాఖ్యలు రాజద్రోహ వ్యాఖ్యలన్నారు. ఉగ్రవాదులు హాఫీజ్ సయీద్ వంటివారు చేసిన వ్యాఖ్యల కంటే రాహుల్ వ్యాఖ్యలు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు.




# భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు అనుమతి

## డాట్ నుంచి లైసెన్స్ పొందిన మూడో కంపెనీ

**న్యూఢిల్లీ, జూన్ 6:** దేశంలో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందించేందుకు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్(డాట్) లైసెన్స్ జారీ చేసింది.కంపెనీ దరఖాస్తు చేసుకున్న 15 నుంచి 20 రోజుల్లోగా ట్రయల్ స్పెక్ట్రమ్‌ను మంజూరు చేస్తామని డాట్ వర్గాలు తెలిపాయి. డాట్ నుంచి లైసెన్స్ పొందిన మూడో కంపెనీగా స్టార్‌లింక్ నిలిచింది. గతంలో వన్‌వెబ్, రిలయన్స్ జియోలకు డాట్ లైసెన్స్‌లు జారీ చేసింది. అయితే ఇప్పటివరకు ఆ సంస్థలు కార్యకలాపాలను ప్రారంభించలేదు.ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ అనుబంధ సంస్థ అయిన స్టార్‌లింక్ 100కుపైగా దేశాల్లో ఇంటర్నెట్ సర్వీసులనందిస్తోంది. సుదూర భూస్థిర ఉపగ్రహాలపై ఆధారపడే సంప్రదాయ ఉపగ్రహ సేవల మాదిరిగా కాకుండా లియో (లో ఎర్త్ ఆర్బిట్) ఉపగ్రహాల ద్వారా స్టార్ లింక్ ఈ ఇంటర్నెట్ సేవలను అందిస్తోంది. భూమికి 550 కిలోమీటర్లు ఎత్తులో ఉండే కక్ష్యలో స్టార్‌లింక్‌కు చెందిన 6,000 శాటిలైట్లు తిరుగుతుంటాయి. స్పేస్‌ఎక్స్ తన శాటిలైట్ ఇంటర్నెట్ ప్రాజెక్టును జనవరి 2015లో ప్రకటించగా, ఇప్పటికే 100కు పైగా దేశాల్లో ఈ సేవలు లభిస్తున్నాయి. తాజాగా కేంద్ర ప్రభుత్వం లైసెన్స్ జారీ చేయడంతో త్వరలో భారత్ కూడా ఈ జాబితాలో చేరనుంది. భూమినుంచి ఈ ఉపగ్రహాలు తక్కువ దూరంలో ఉండడం వల్ల తక్కువ లేటెన్సీతో ఇంటర్నెట్ సేవలను పొందవచ్చు. స్టార్‌లింక్‌తో భాగస్వామ్యంద్వారా జియో, ఎయిర్‌టెల్ భారతదేశంలోని సాధారణ నెట్‌వర్క్‌లు చేరుకోలేని ప్రాంతాలకు టెలికాం సేవలు అందుతాయి.ముఖ్యంగా మారుమూల ప్రాంతాలు, కొండ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలందించేందుకు స్టార్‌లింక్ ఉపయోగపడుతుంది. ఇది సామాన్య ప్రజలకు ప్రయోజనం చేకూర్చడమే కాకుండా వ్యాపారాలపై కూడా భారీ ప్రభావాన్ని చూపుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో దేశ ఆర్థికాభివృద్ధికి, డిజిటలైజేషన్‌కు ఈ ప్రయత్నం ముఖ్యమైన అడుగుగా మారనున్నట్లు చెబుతున్నారు.

## ఢిల్లీ సిఎంకు అధికారిక నివాసం ఎంపిక



**న్యూఢిల్లీ, జూన్ 6:** ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు ఎట్టకేలకు అధికారిక నివాసం ఖరారైంది. ఆమె పదవీ బాధ్యతలు చేపట్టిన సుమారు 100 రోజుల తర్వాత సివిల్ లైన్స్‌లోని రాజ్ నివాస్ మార్గ్‌లో ఒక బంగ్లాను కేటాయించారు. ఈ ఏడాది జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన తర్వాత, కొత్త ముఖ్యమంత్రి ఎక్కడ నివాసం ఉంటారనే దానిపై కొంతకాలంగా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రజా పనుల విభాగం పీడబ్ల్యూడీ సీఎం నివాసం కోసం మూడు బంగ్లాలను పరిశీలించింది. వీటిలో రెండు మధ్య ఢిల్లీలోని డీడీయూ మార్గ్‌లో బీజేపీ కార్యాలయం, జాతీయ ప్రధాన కార్యాలయానికి సమీపంలో ఉన్నాయి. మూడవది సివిల్ లైన్స్‌లోని రాజ్‌పూర్ రోడ్డులో ఉంది. చివరికి రాజ్ నివాస్ మార్గ్‌లోని బంగ్లాను ఖరారు చేశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రేఖా గుప్తా తన సొంత నియోజకవర్గమైన షాలిమార్ బాగ్‌లోని తన ప్రైవేట్ నివాసంలోనే ఉంటున్నారు. గత ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసం చుట్టూ బీజేపీ ప్రచారం చేసిన నేపథ్యంలో, కొత్త సీఎంకు అధికారిక నివాసం కేటాయింపులో జాప్యం జరిగింది. ఎన్నికల ప్రచారం సమయంలో బీజేపీ నేతలు మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అధికారిక నివాసమైన 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్ బంగ్లాను సీష్ మహల్‌గా అభివర్ణిస్తూ, అక్కడ అవినీతి జరిగిందని ఆరోపించారు. కొత్త సీఎం ఈ వివాదాస్పద భవనంలో నివసించరని ఢిల్లీ బీజేపీ చీఫ్ వీరేంద్ర సచ్‌దేవా వంటి నేతలు గతంలోనే ప్రకటించారు.

# స్వర్ణదేవాలయం వద్ద ఉద్రిక్తత

### ఆపరేషన్ బ్లూస్టార్ వార్షికోత్సవంలో ఖలిస్థాన్ నినాదాలు



**అమృత్‌సర్, జూన్ 6:** పంజాబ్‌లోని అమృత్‌సర్ స్వర్ణ దేవాలయం వద్ద శుక్రవారం మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 41వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ఖలిస్థాన్ అనుకూల నినాదాలు మిన్నంటాయి. శిరోమణి అకాలీదళ్ మాన్ వర్గం నేత సిమ్రన్‌జిత్ సింగ్ మాన్ స్వర్ణ దేవాలయానికి చేరుకున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 41వ వార్షికోత్సవ కార్యక్రమాలు శుక్రవారం స్వర్ణ దేవాలయంలో జరిగాయి. ఇదే రోజున 1984లో నాటి సైనిక చర్యలో మరణించిన జర్నైల్ సింగ్ భింద్రన్‌వాలే వర్ధంతి కూడా కావడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో శిరోమణి అకాలీదళ్ మాన్ వర్గం నాయకుడు సిమ్రన్‌జిత్ సింగ్ మాన్ స్వర్ణ దేవాలయ ప్రాంగణానికి చేరుకోగానే, ఆయన మద్దతుదారులు ఖలిస్థాన్ జిందాబాద్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ముందురోజు దల్ ఖల్సా అనే సంస్థ ఆధ్వర్యంలో అమృత్‌సర్‌లో భారీ ప్రదర్శన నిర్వహించారు. బుర్జ్ అకాలీ ఫూలా సింగ్ ప్రాంతం నుంచి స్వర్ణ దేవాలయం వరకు సాగిన ఈ ప్రదర్శనలో యువకులు, వృద్ధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆ సమయంలో కూడా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు మార్మోగాయి. ఈ ప్రదర్శనలో సిమ్రన్‌జిత్ సింగ్ మాన్‌తో పాటు పంథ్ సేవక్ నాయకుడు దల్జీత్ సింగ్ కూడా పాల్గొన్నారు. ఆపరేషన్ బ్లూస్టార్‌కు నిరసనగా శుక్రవారం అమృత్‌సర్‌లో బంద్‌కు కూడా దల్ ఖల్సా పిలుపునిచ్చింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా స్వర్ణ దేవాలయం పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రత్యేక బలగాలను మోహరించారు.

## కస్టమర్ల సొమ్మును వాడుతున్న బ్యాంక్ అధికారిణి: అరెస్టు చేసిన పోలీసులు

**జైపూర్, జూన్6:** బ్యాంకులో డబ్బు దాచుకుంటే భద్రం. అయితే బ్యాంకులోని అధికారులే ఆ డబ్బునుకాజేస్తే కస్టమర్ల పరిస్థితి ఏంటి? రాజస్థాన్‌లోని ఐసిఐసిఐ బ్యాంక్‌లో ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. కస్టమర్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన డబ్బును ఓ అధికారిణి స్టాక్ మార్కెట్లో పెట్టుబడిగా పెట్టేందుకు వాడుకుంది. భారీ నష్టాలు రావడంతో వాటిని తిరిగి జమ చేయలేకపోయింది. విషయం కాస్త బయటపడడంతో పోలీసులు ఆమెను అరెస్టు చేశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం సాక్షి గుప్తా ఐసిఐసిఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పనిచేస్తోంది. ఈ క్రమంలో బ్యాంక్‌లో పలువురి ఫిక్స్‌డ్ డిపాజిట్ల డబ్బును దుర్వినియోగం చేసింది. 40 మందికిపైగా కస్టమర్లకు చెందిన రూ.4.58 కోట్లను అక్రమంగా వాడుకుంది. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆ సొమ్మును ఉపయోగించింది. అయితే అందులో ఆమెకు భారీగా నష్టాలు రావడంతో ఆ డబ్బును తిరిగి జమ చేయలేకపోయింది. ఓ వ్యక్తి తన ఎఫ్‌డి గురించి తెలుసుకునేందుకు బ్యాంక్‌కు రాగా ఈ స్కామ్ విషయం బట్టబయలైంది. దీంతో బ్యాంకు అధికారులు ఆమెపై కేసు నమోదు చేశారు. సాక్షి తన సోదరి వివాహ వేడుకలో ఉండగా పోలీసులు వెళ్లి ఆమెను అరెస్టు చేశారు.

## రాజ్యసభ ఎన్నికలకు కమల్‌హాసన్ నామినేషన్



**చెన్నై, జూన్ 6:** ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధినేత కమల్ హాసన్ రాజ్యసభకు శుక్రవారం నామినేషన్ వేశారు. తమిళనాడు సెక్రటేరియట్‌లో ఆయన తన నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్ కార్యక్రమానికి తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ హాజరయ్యారు. భాగస్వామ్య పార్టీల నేతలు వీసీకే చీఫ్ తిరుమావలన్, ఎండీఎంకే చీఫ్ వైకో, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుంతగై సైతం పాల్గొన్నారు. డీఎంకే ఒక రాజ్యసభ సీటును ఎంఎన్‌ఎంకు కేటాయిస్తూ కమల్‌హాసన్ పేరును ఇటీవల ప్రకటించింది. తమిళనాడు అసెంబ్లీలో 234 మంది సభ్యులుండగా, రాజ్యసభ అభ్యర్థుల గెలుపునకు ఒక్కొక్కరికి 34 ఓట్లు అవసరమవుతాయి. 158 ఎమ్మెల్యేల బలం డీఎంకేకు ఉంది. డీఎంకేకు సొంతంగా 133 ఎమ్మెల్యేల బలం ఉండగా, భాగస్వామ్య పార్టీలైన కాంగ్రెస్‌కు 17, వీసీకేకు 4, సీపీఐ, సీపీఎంలకు చెరో నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. సంఖ్యా బలం ప్రకారం 4 రాజ్యసభ సీట్లను డీఎంకే సునాయాసంగా గెలుచుకుంటుంది. కమల్ కాకుండా మరో ముగ్గురు అభ్యర్థులను డీఎంకే నిలబెట్టింది. కవి, తమిళ అధికార భాషాకమిషన్ మాజీ చైర్‌పర్సన్ సల్మా, సీనియర్ అడ్వకేట్ పి.విల్సన్, మాజీ మంత్రి ఎస్.ఆర్.శివలింగంను తమ అభ్యర్థులుగా డీఎంకే ప్రకటించింది. జూన్ 19 రాజ్యసభకు ఎన్నికలు జరగనున్నాయి. 2018లో పార్టీ కమల్‌హాసన్ 2018లో మదురై జరిగిన ఒక కార్యక్రమంలో మక్కల్ నీది మయ్యం పార్టీని ప్రారంభించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయనప్పటికీ డీఎంకే సారథ్యంలోని ఇండియా కూటమికి ప్రచారం చేసింది. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి 2.62 శాతం ఓట్లు పడ్డాయి.



# 'విశ్వశాంతి మహాశక్తి గణపతి'గా ఖైరతాబాద్ గణేశుడు

### ఈసారి 69 అడుగుల ఎత్తులో భక్తులకు దర్శనం

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో ప్రతిష్టాత్మకంగా జరిగే ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలకు సమయం ఆసన్నమైంది. నిర్జల ఏకాదశి రోజు జూన్ జరిగే ఈ సంప్రదాయ కార్యక్రమంలో ఖైరతాబాద్ మహాగణపతి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈమేరకు శుక్రవారం గణేశుడి మండపం వద్ద కర్ర పూజ ఘనంగా నిర్వహించారు. గణపతి రూపాన్ని అధికారికంగా విడుదల చేశా రు. దీంతో ఈ యేడాది గణనాథుడు 'విశ్వశాంతి మహాశక్తి గణపతి'గా 69 అడుగుల ఎత్తులో భక్తులకు దర్శనమివ్వనున్నాడు. మహాగణపతికి కుడివైపు జగన్నాథస్వామి, లక్ష్మీసమేత హయగ్రీవస్వామి దర్శనమిస్తే, ఎడమవైపు లలిత త్రిపురసుందరి- శ్రీగజలక్ష్మీదేవి కూడా కొలువై ఉంటారని ఉత్సవ సమి తి సభ్యులు తెలిపారు. శ్రీగణేశ ఉత్సవ కమిటీ-ఖైరతాబాద్ గణేశ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ర పూజకు ఎమ్మెల్యే దానం నాగేందర్, రాజ్యసభ ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు.

# కొత్త జూ. లెక్చరర్లకు శిక్షణ తరగతులు

### ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో 9 నుంచి 11 వరకు శిక్షణ

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఈ యేడాది ఏప్రిల్‌లో సుమారు 1092 మంది జూనియర్ లెక్చరర్లు కొత్తగా నియామితులయ్యారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిజిపిఎస్‌సి) ద్వారా నియామకాలను చేపట్టారు. రాష్ట్రంలో ఉన్న 430 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో దాదాపు 12 సంవత్సరాల తరువాత జేఎల్ పోస్టులను భర్తీ చేశారు. ఏప్రిల్‌లో జేఎల్స్‌గా నియమితులైన వారిలో గణితం లెక్చరర్లకు మూడు రోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహించాలని ఇంటర్ విద్య శాఖ నిర్ణయించింది. 100 మంది గణితం లెక్చరర్లకి ఈ నెల 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి)లో జేఎల్స్‌కి శిక్షణ తరగతులను ఇవ్వాలని ఇంటర్ విద్య శాఖ నిర్ణయించింది. 100 మందిని రెండు బ్యాచ్‌లుగా విభజించి వారికి కెపాసిటీ బిల్డింగ్‌తోపాటు ప్రేరణాత్మకమైన శిక్షణను అందించాలని ఇంటర్ విద్యా శాఖ నిర్ణయించింది. శిక్షణ అనంతరం ఈ నెల 12 నుంచి లెక్చరర్లు తమ కాలేజీల్లో క్లాసులను బోధించనున్నారు.

# ఉద్యోగులకు బాసటగా ప్రభుత్వం

### తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ లచ్చిరెడ్డి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఉద్యోగులకు బాసటగా నిలుస్తుందని తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగుల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేయూతగా నిలుస్తుందన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తుందన్నారు. రాష్ట్ర కేబినేట్ ఉద్యోగుల విషయంలో గురువారం తీసుకున్న నిర్ణయాలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రెండు డిఎల చెల్లింపు, ఆరోగ్య పథకం అమలుకు ట్రస్ట్ ఏర్పాటు, పెండింగ్ బిల్లుల చెల్లింపునకు ప్రతి నెల రూ.700 కోట్ల విడుదల, ఎన్నికల సమయంలో జరిగిన బదలీ అయిన ఉద్యోగులు సొంత జిల్లాలకు తిరిగి పంపడం తదితర అంశాలపై తీసుకున్న నిర్ణయాల పట్ల సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు, ప్రభుత్వ పెద్దలకు ధన్యవాదాలను తెలిపారు. నాంపల్లి సిసిఎల్‌ఎ కార్యాలయం ప్రాంగణంలోని డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ కార్యాలయం శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ ఉద్యోగుల జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ రాష్ట్రంలో ఫ్రెండ్లీ ప్రభుత్వం నడుస్తుందన్నారు. సాధారణ బదిలీలు, సాధారణ ఎన్నికల సమయంలో బదలీ అయిన అధికారులను పూర్వ జిల్లాలకు బదలీ చేయాలని కోరామన్నారు. దీనిపై కూడా కేబినేట్ సానుకూలంగా స్పందించడంతో చాలా మంది ఉద్యోగులకు లాభం జరుగుతుందన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలిపారు.



ఇర్కోడు మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీమంత్రి హరీశ్‌రావు

# పద్మశాలి సంఘం అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తా

### చదువుతోనే పేదరికం దూరం: మాజీమంత్రి హరీశ్‌రావు

**సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** పద్మశాలి సంఘం అభివృద్ధికి తనవంతు పూర్తి సహాయ సహకారాలు ఎప్పుడు ఉంటాయని మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయం ఆవరణలో శుక్రవారం నిర్వహించిన పద్మశాలి సమాజం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్స వంలో పాల్గొని ఆయన మాట్లాడారు. పద్మశాలీలు వృత్తిమీద ఆధారపడి జీవించే పరిస్థితి లేదని, పని చేసుకుందామంటే అవకాశాలు తక్కువగా ఉన్నాయని పోటీ ప్రపంచంలో నిలదొక్కుకోవడం కష్టంగా మారిందన్నారు. పిల్లలను బాగా చదివించాలని చదువుతోనే పేదరికం దూర మవుతుందన్నారు. దేవాలయ, సమాజ అభివృద్ధికి తన వంతు సహా య సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి నూతన కార్య వర్గం, పద్మశాలి సమాజం ప్రతినిధులు కాముని రాజేశం, గుండు భూపేష్, గూడూరి శ్రీనివాస్, డాక్టర సతీష్, బూ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సిద్ధిపేట రూరల్ మండలం ఇర్కోడు గ్రామంలో మహంకాళి అమ్మవారి దేవా లయ ప్రతిష్ఠాపన ఉత్స వాల్లో జరిగిన పూర్ణహుతి కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మహంకాళి అమ్మవారి దేవాలయాన్ని కెసిఆర్ ఆశీస్సులతో రూ.50 లక్షలతో అద్భుతంగా నిర్మించుకున్నామన్నారు. సిద్ధిపేట రూరల్ మండల పరిధిలోని చింతమడకలోని పట్టాభిరామ దేవాలయాన్ని దర్శించుకొని దేవాలయ ధ్వజ స్తంభం ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించారు.

సిద్ధిపేట రూరల్ మండల పరిధిలోని పెద్దలింగారెడ్డిపల్లిలో మహంకాళి అమ్మవారి దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చిన్నకోడూరు మండల పరిధిలోని రామంచ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీ పెద్దమ్మ దేవా లయ పునర్ నిర్మాణ పనులకు హరీష్‌రావు భూమి పూజ చేశారు.

# రాజన్న కోడెలపై రాజకీయం వద్దు

### మంత్రి కొండా సురేఖ

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాజన్న కోడెలపై ఎటువంటి రాజకీయాలు చేయవద్దని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రతిపక్ష పార్టీలకు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గడిచిన 10 యేళ్లలో వేములవాడ దేవస్థానానికి సంబంధించి దేవాదాయ శాఖకు సంబంధించి బిఆర్ఎస్ పాలనలో ఏంచేశారో చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో వేములవాడ టెంపుల్ కి కేసీఆర్ ఇచ్చిన హామీల్లో ఒక్క పైసా కూడా ఇవ్వలేదన్నారు. కోడెల దుస్థితికి పాపం కేసీఆర్ పాలనదేనని, కోడెల ఘటన జరిగిన వెంటనే తమ ప్రభుత్వం స్పందించిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఈ విషయంలో బురద రాజకీయం చేయడం సరి కాదన్నారు.

తమ హయాంలో సక్సెస్‌ఫుల్‌గా సరస్వతీ పుష్కరాలు నిర్వహించామని, 30 లక్షల మంది భక్తులు వచ్చినా ఎక్కడా చిన్న ఇబ్బంది జరగకుండా నిర్వహించామన్నారు. ఇక భద్రకాళి ఆలయం విస్తరణ పనులు కోట్లాది రూపాయలతో చేపట్టామన్నారు. యాదగిరిగుట్ట మీద కేసీఆర్ బొమ్మలను చెక్కించుకున్న వాళ్లకు అసలు దేవుళ్ల విషయంలో మాట్లాడే అర్హత ఉందా అని సురేఖ ప్రశ్నించారు. యాదగిరిగుట్టకి తాము రూ. 63 కేజీల బంగారంతో గోపురం తాపడం చేయించామన్నారు. సామూహిక కోటి దీపో త్సవం, పలు నదీ హారతి కార్యక్రమాలు, కాళేశ్వ రం, యాదగిరిగుట్టలకు మహా కుంభాభిషేకం చేశామన్నారు.గత పదేండ్ల పాటు రాష్ట్ర సంపదను ఇష్టారీతిన దోచుకున్న కల్వకుంట్ల దండుపాళ్యం బ్యాచ్ నేడు కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంటే.ఉద్వేగం పేరుతో మనల్ని ఉన్మాదులను చేసే కుట్రకు పాల్పడుతు ఒడటం బాధాకరమన్నారు. కేసీఆర్ కుటుంబంలో అంతర్గత గొడవలతో బీఆర్ఎస్ నాయకులకు ఏం మాట్లాడాలో.... ఏ విధంగా స్పందించాలో అర్థం కావడం లేదన్నారు. వేములవాడ రాజన్న దగ్గర మొక్కులు మొక్కి రూ.100 కోట్లు ఇస్తానని దేవుడిని మోసం చేసిన ఘనత కేసీఆర్, కేటీఆర్ లది కాదా? అని ఆమె ప్రశ్నించారు. అప్పుడు కేసీఆర్ హామీ ఇచ్చినట్లు వేములవాడకు వంద కోట్లు ఖర్చు పెడితే గోశాల కూడా బాగుపడేది కదాని ప్రశ్నించారు. కోడెల మొక్కులు,కోడెలు సమర్పించుకోవటం భక్తుల నమ్మకం, విశ్వాసాలకు సంబంధించిందన్నారు. వాటిని కూడా రాజకీయం చేయటం బీఆర్ఎస్ పార్టీ నీచ రాజకీయానికి, ఆ పార్టీ నాయకుల నీచ మనస్తత్వానికి నిలువెత్తు నిదర్శనమన్నారు. కేసీఆర్ పదేండ్ల అరిష్టపు పాలన ఇప్పటికీ వేములవాడను వెంటాడుతోందన్నారు. ఆ పాపం బీఆర్ఎస్ పార్టీని కూడా వెంటాడుతుందని.. అందుకే ఆ పార్టీలో లుకలుకలు తెరపైకి వస్తున్నాయన్నారు.

రాజన్న దేవాలయం విస్తరించేందుకు వేగంగా చర్యలు చేపట్టామని గుర్తు చేశారు. ఒక్కో నెలలో భక్తులు ఎక్కువ సంఖ్యలో కోడెలను సమర్పిస్తారని, ఇది అక్కడ అందరికీ తెలిసిందేనని, కొన్నిసార్లు అనారోగ్యంతో ఉన్న కోడెలను భక్తులు ఆలయం వద్ద వదిలేసి వెళుతారని.. వాటిని కూడా సంరక్షించిన బాధ్యత ఆలయంపై ఉంటుందని అన్నారు. కోడెలు జబ్బు పడ్డప్పుడు, వాటి సంరక్షణకు 12 మందితో పశువైద్య అధికారుల బృందాన్ని తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రతి రోజూ సరిపడేంత పచ్చి గడ్డి అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోవులను కాపాడాలని, గోశాలలను అభివృద్ధి చేయాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని గుర్తు చేశారు.

# రాజేంద్రనగర్‌లో దంపతుల దారుణహత్య

### కత్తులతో పొడిచి కిరాతకంగా చంపిన దుండగులు

### అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం : డిసిపి సిహెచ్ శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న రాజేంద్రనగర్ డిసిపి సిహెచ్ శ్రీనివాస్

**హైదరాబాద్ (అత్తాపూర్) జూన్ 6, ప్రభాతవార్త :** భార్యాభర్తలను అత్యంత కిరాతకంగా గుర్తు తెలియని దుండగులు కత్తులతో పొడిచి చంపిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జనచైతన్య ఫేస్-2లో చోటుచేసుకుంది. సమాచారాన్ని అందుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలానికి చేరుకుకొని ఆధారాలు సేకరించి మృత దేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. రాజేంద్రనగర్ డిసిపి చింతమనేని శ్రీనివాస్ వివరాల ప్రకారం.. హైదర్‌గూడా జనచైతన్య ఫేస్-2లో దంపతులు షేక్‌అబ్దుల్లా (70) రిజ్వానా బేగం (65)లు నివాసముంటున్నారు. వీరు 40 రోజుల క్రితమే ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. భర్త షేక్ అబ్దులా (70) బ్యాంకు ఎంప్లాయిగా చేసి రిటైర్ అయ్యాడు. భార్య ఓ ప్రైవేట్ కాలేజీలో హెచ్‌ఒడిగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. అయితే బిల్డింగ్‌ను వీరు సొంతగానే నిర్మించుకొని మిగతా పోర్షన్లు రెంట్‌కి ఇచ్చి, ఒక డూప్లెక్స్‌లో నివాసం ఉంటున్నారని తెలిపారు. అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌ను విచారించగా గురువారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులు వచ్చారని, మమ్మల్ని మసాజ్ గురించి బుక్ చేసుకున్నారని చెప్పడంతో వాచ్‌మెన్ యజమానికి ఫోన్‌చేసి వీళ్లను తీసుకెళ్లి వారి పోర్షన్ దగ్గర వదిలి వచ్చినట్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారణ చేపట్టామని, వీరిద్దరే దంపతులను హత్య చేసినట్లు అనుమానిస్తున్నట్లు తెలిపారు. మృతులకు నాలుగురు పిల్లలు ఉన్నారని పిల్లలు ఇద్దరు యుఎస్‌లో, ఇద్దరు లండన్‌లో ఉండడం వల్ల ఎలాంటి సమాచారం లభించలేదన్నారు. కత్తులతో పొడిచి హత్య చేసినట్లు ఆధారాలు ఉన్నాయని క్లూస్‌టీం, డాగ్స్ స్క్వాడ్‌తో అన్ని ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి సిసి కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని తొందరగానే కేసు చేధిస్తామని డిసిపి వెల్లడించారు.

# గురుకులాల అద్దె బకాయిలు తక్షణమే చెల్లించాలి

### గురుకుల విద్య నిర్వీర్యానికి ప్రభుత్వం కుట్ర : ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కౌన్సిల్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ గురుకులాల అద్దె బకాయిలను వెంటనే చెల్లించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రాష్ట్రంలోని గురుకుల విద్యార్థుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ మండిపడ్డారు. గురుకుల విద్యార్థులకు మౌలిక సదుపాయాలు, నాణ్యమైన ఆహారం అందించడంలో సర్కార్ వైఫల్యం చెందిందన్నారు.

అద్దె భవనాల్లో కొనసాగుతున్న 650 గురుకుల పాఠశాలల కిరాయిలు దాదాపు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈనెల 12 నుండి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో .. భవన యాజమాన్యాలు ఆలోపు బిల్లులు చెల్లించకపోతే భవనాలకు తాళాలు వేస్తామని చెబుతున్నరాని.. కాబట్టి ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న గురుకులాల అద్దె బకాయిలు రూ.215 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, జనరల్ విద్యార్థులకు గురుకులాలు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని.. అలాంటి గురుకులాలకు కనీసం కిరాయిలు చెల్లించకుండా ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు. ఈ నెల12 నుంచి విద్యార్థులు హాస్టల్స్ వస్తే కిరాయిలు చెల్లించకపోతే భవన యాజమాన్యాలు తాళాలు వేస్తే విద్యార్థులు రోడ్డు మీద ఉండే పరిస్థితి వస్తుందని.. ప్రభుత్వం వెంటనే అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాల కిరాయిలు చెల్లించాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం గురుకులాలకు సొంత భవనాలు నిర్మించేలా నిధులు కేటాయించాలని, విద్యా సంవత్సరం ప్రారంభ నేపథ్యంలో గురుకుల విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేసి మంచి నాణ్యమైన ఆహారం అందించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# అద్భుత సాహితీమూర్తి ఆచార్య ఎస్వీ రామారావు

### ఆచార్య కొలకలూరి ఇనాక్ అభినందన



ఆచార్య ఎస్వీ రామారావును ఘనంగా సత్కరిస్తున్న కొలకలూరి ఇనాక్, పద్మనాభరావు, సురేష్‌చంద్ర, ఫణీంద్ర, గౌరీశంకర్, నరసింహాచార్య, దత్తాత్రేయశర్మ తదితరులు

**హైదరాబాద్ (నాంపల్లి), జూన్ 6, ప్రభాతవార్త :** ఆచార్య ఎస్.వి.రామారావు నిరంతర అద్భుత సాహితీమూర్తి, అక్షర తపస్వి అని శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. విమర్శ అనేటటువంటిది లేనిరోజుల్లో విశ్వవిద్యాలయాల్లో విమర్శ ప్రక్రియను ప్రారంభించారని, అధ్యాపకుడుగా సౌమనస్యం, సుందర భావజాలం, భావయుక్తం, మంచితనం, ప్రేమ మమకారాలు, చైతన్యం ఆయన రచనల్లో ఉన్నాయన్నారు. విద్యార్థిని ప్రేమించే గొప్పవ్యక్తిత్వం ఉన్న ఏకైకవ్యక్తి ఎస్వీరామారావు అని స్పష్టం చేశారు. సాహిత్యం అధ్యాపకధర్మంలో, ఆలోచన. పరిశోధన నిర్విరామ తపస్సుచేస్తున్న ఎస్వీ 85వ జన్మదిన మహో త్సవం విద్యార్థులంతా కలిసిచేయడం గొప్పవిశేషమన్నారు. 1924 తర్వాత 2000దాకా తెలుగుసాహిత్యంలో వచ్చిన రచయి తలందర్నీ పరిచయం చేయాలన్న ఆయన ప్రయ త్నం అనితరసాధ్యమని, నిజానికి విశ్వవిద్యా లయాల వంటివి చేయాల్సిన పని ఇదన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ఎస్.వి.రామారావు 85వ జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యా లయం లోని డా. నందమూరి తారక రామారావు కళా వేదికలో శతజయంతి సాహితీమూర్తులు, విమర్శ నారామం ఆచార్య ఎస్వీ రామారావు సమగ్ర సాహిత్య సమాలోచన గ్రంథాల ఆవి ష్కరణ దత్తాత్రేయశర్మ, డా. లలితావాణి, సాధన నరసింహాచార్య, డా. ఆచార్య ఫణీంద్రల నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆచార్య కొలకలూరి ఇనాక్ శతజయంతి (సాహితీమూర్తులు) గ్రంథాన్ని; సభాధ్యక్షుడు దూరదర్శన్ మాజీ సంచాలకుడు డా. ఆర్.అనంతపద్మనాభరావు విమర్శ నారామం (ఆచార్య ఎస్వీ రామారావు-సమగ్ర సాహిత్య సమాలోచన) గ్రంథాలను విశిష్ట అతిథులు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, సురేష్‌చంద్రశర్మ, ఆచార్య సాగి కమలాకరశర్మ తదితరులతో కలిసి ఆవిష్కరించి ఎస్వీ రామారావును ఘనంగా సత్కరించారు. అనంతరం పద్మనాభరావు అధ్యక్షోపన్యాసంలో 85 ఏళ్లయినా నిరంతర సాహితీ శ్రామికుడని, పుస్తకాలు వ్రాస్తూనే ఉన్నారని అన్నారు. డా. ఆచార్య ఫణీంద్ర శతజయంతి; ఆచార్య టి. గౌరీశంకర్ విమర్శనారామం గ్రంథాల సమీక్ష కావించారు. చివరిగా 30 మంది ప్రముఖ సాహిత్య, సాంస్కృతిక సంస్థల సారథులకు ఘనంగా ఆత్మీయ సత్కారం చేశారు. సభకు ముందు ఆచార్య సాగి కమలాకరశర్మ, ఆచార్య వేణు, ఆచార్య ఫణీంద్ర ప్రభృతులు పాల్గొన్న గోలకొండ సాహితీ వైభవం సాహిత్యరూపకం ప్రదర్శించారు.

# 18 నుంచి గ్రూప్-3 అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్

### జూలై 8 వరకు కొనసాగింపు

### షెడ్యూల్ ప్రకటించిన టిజిపిఎస్‌సి

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1388 గ్రూప్-3 పోస్టుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18 నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టిజిపిఎస్‌సి) ప్రకటించింది. ఈ నెల 18 నుంచి జులై 8 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను కొనసాగించనున్నట్టు కమిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 1388 గ్రూప్-3 పోస్టుల భర్తీ కోసం టిజిపిఎస్‌సి 2022 డిసెంబర్ 31న నోటిఫికేషన్ నంబర్.29/2022ను జారీ చేసింది. ఫలితాల ప్రకటన అనంతరం సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి ఎంపికైన అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను ఈ నెల 18 నుండి జులై 8 వరకు ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1.30 వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 5.30 వరకు నిర్వహించనున్నారు. ఎవరైనా ఈ తేదిల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి హాజరు కాలేకపోతే వారికి రిజర్వ్ డేగా నిర్ణయించిన జులై 9న ఉదయం 10:30 నుండి సాయంత్రం 5.30 వరకు సురవరం ప్రతాప్ రెడ్డి విశ్వవిద్యాలయం పబ్లిక్ గార్డెన్ రోడ్, నాంపల్లి, హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థుల జాబితా కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. షార్ట్‌లిస్ట్ చేయబడిన అభ్యర్థులు వెరిఫికేషన్ మెటీరియల్, రోజు వారీగా షెడ్యూల్‌ను ఈ నెల 10 నుండి కమిషన్ వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలని కార్యదర్శి ప్రకటించారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం వచ్చేటపుడు అభ్యర్థులు అవసరమైన అన్ని ఒరిజినల్ డాక్యుమెంట్‌లను, స్వీయధృవీకరించబడిన ఫోటోస్టాట్ కాపీల సెట్‌ను తప్పకుండా తీసుకురావాలని సూచించారు.

# ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడిన డయల్ 112

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** నగరంలోని బంజారాహిల్స్‌లో గల కమాండ్ కంట్రోల్ కేంద్రంగా పనిచేస్తున్న డయల్ 112 ఆపదలో వున్న వ్యక్తి ప్రాణా లను కాపాడిన ఘటన ఇది. కమాండ్ కంట్రోల్ డైరెక్టర్ కమలాసన్ రెడ్డి దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. గురువారం రాత్రి పది గంటల ఏడు నిమిషాలకు డయల్ 112కు ఒక ఫోన్ వచ్చింది. కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని తంగోపేపేట్ తాండాలో ఓ వ్యక్తిని కొందరు కత్తులతో పొడి చారని, బాధితుడి పరిస్థితి తీవ్రంగా వుందని, అతనికి వెంటనే వైద్యం అందించాల్సిన అవసరం వుందని, నిందితులను పట్టుకునేందుకు పోలీసుల అవసరం కూ డా వుందని ఫోన్ చేసిన వ్యక్తి తెలిపారు. దీనిపై వెంటనే స్పందించిన డయల్ 112 సిబ్బంది కామారెడ్డి జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఇదే సమయంలో బాన్సువాడ రూరల్ పోలీసులను అలర్ట్ చేసి ఘటనా స్థలికి వెళ్లాలని ఆదేశించి, సమీపంలోని అంబులెన్స్‌ను కూడా అక్కడకు పంపారు. డయల్ 112 చొరవ కారణంగా పోలీసులతో పాటు అంబులెన్స్ సిబ్బంది నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలికి చేరుకుని బాధితుడిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి త రలించి వైద్య సేవలందేలా చేశారు. ఇప్పుడు అతని పరిస్థితి పరవాలేదని, కోలుకుంటున్నాడని వైద్యులు తెలిపారు. కాగా బాధితుడిని కత్తులతో పొడిచి పారిపో యిన వారి కోసం బాన్సువాడ రూరల్ పోలీసులు గాలింపు చేబట్టారు. రాష్ట్రంలో ఆపదలో వున్న వారిని డయల్ 112 ఆదుకునేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటుందని కమాండ్ కంట్రోల్ డైరక్టర్ కమలాసన్‌రెడ్డి తెలిపారు.

# మంత్రి పొంగులేటికి ట్రెసా కృతజ్ఞతలు

**హైదరాబాద్ జూన్ 6. ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల తిరుగు బదలీలు చేపట్టాలని కేబినెట్ నిర్ణయం తీసుకోవడం పట్ల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) కృతజ్ఞతలు తెలిపింది. శుక్రవారం ట్రెసా రాష్ట్ర అధ్యక్షులు వంగా రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రిని కలిశారు.ఈ సందర్భంగా మంత్రి బదిలీల విషయంలో ట్రెసా కృషిని అభినందిస్తూ బదిలీలు త్వరలోనే పూర్తవుతాయని, రెవెన్యూ ఉద్యోగులందరూ కొత్త చట్టం, రెవెన్యూ సదస్సుల నేపథ్యంలో ప్రజలకు మేలైన సర్వీసులు అందించాలని కోరినట్లు రవీందర్ రెడ్డి తెలిపారు.బదిలీల విషయంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపినందులకు ట్రెసా పక్షాన ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వానికి పూర్తిగా సహకరిస్తామని హామీ ఇచ్చారు.మంత్రిని కలిసిన వారిలో ట్రెసా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతం కుమార్, రాజ్‌కుమార్, రమన్ రెడ్డి, చక్రవర్తి, పకీల్, రామకృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

# గురుకుల కళాశాలలో తొలగించిన సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

### మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు హాసేన్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 6, ప్రభాతవార్త:** స్టాండర్డ్ గురుకుల కళాశాలలో పనిచేస్తున్న వార్డెన్స్,అసిస్టెంట్ కేర్ టేకర్స్‌లను తొలగించడం అన్యాయమని, వెంటనే విధులోకి తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమల్ల హసేన్ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి రాసిన లేఖ పత్రులను శుక్రవారం పత్రికలకు విడుదల చేశారు. కొన్ని సంవత్సరాల నుంచి నడుస్తున్న స్టాండర్డ్ గురుకుల కళా శాలలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఎస్సీ గురుకులాలలో పని చేస్తున్న వార్డెన్స్, అసిస్టెంట్ కేర్ టేకర్స్, 240 మంది ఉద్యోగాలను నిర్ధాక్షణంగా తొలగించడం జరిగిందని, వీళ్ళందరూ 10 సంవత్సరాల బోధన అనుభవం, పోస్ట్ గ్రాడ్యుయేషన్ బి.ఎడ్ అర్హత ఉన్నవారు. వారిని ఇంటర్వ్యూ నిర్వహించి మెరిట్ ప్రాతిపదికన తీసుకున్నారని, పది సంవత్స రాల అనుభవం ఉండి, ఈ ఉద్యోగం మీదనే వారి కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని, ఈ ఉద్యోగం లేకపోతే వారు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలు మొత్తం రోడ్డుమీద పడే అవకాశం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.

# లాసెట్-2025 పరీక్షకు 79 శాతం మంది హాజరు

### 10న ప్రాథమిక కీ విడుదల

**హైదరాబాద్ జూన్ 6. ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు లా కాలేజీల్లో యుజి, పిజి కోర్సుల్లో ప్రవేశాల కోసం శుక్రవారం నిర్వహించిన లాసెట్-2025, పిజి లాసెట్-2025 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకి 79.02 శాతం మంది హాజరైనట్టు లాసెట్-2025, పిజి లాసెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ బి విజయలక్ష్మీ తెలిపారు. పరీక్షకి 57,715 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 45,609 మంది హాజరయ్యారు. మూడు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మూడు సంవత్సరాల లా కోర్సులో ప్రవేశ పరీక్షను నిర్వహించగా.. దరఖాస్తు చేసుకున్న 20,719 మందిలో 16,109 మంది(77.75శాతం) పరీక్షలకు హాజరయ్యారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 2 గంటల వరకు 5 వరకు నిర్వహించిన పరీక్షకు 20,491 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 16,009 మంది(78.13 శాతం) మంది హాజరయ్యారు. 5 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ లా కోరుతోపాటు పిజి లా కోర్సులో ప్రవేశాల పరీక్షను సాయంత్రం 4 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించగా.. ఇందుకు 16,505 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 13,491 మంది(81.74 శాతం) హాజరయ్యారు. ఉదయం పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 76 కేంద్రాలను ఏర్పాటు చేయగా.. సాయంత్రం సెషన్‌కి 65 కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తంగా లాసెట్, పిజి లాసెట్‌కి 57,715 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 45,609 మంది(79.02 శాతం) పరీక్షలకి హాజరయ్యారు. పరీక్షలకి సంబంధించిన ప్రాథమిక కీని ఈ నెల 10న విడుదల చేయనున్నట్టు కన్వీనర్ తెలిపారు. ప్రాథమిక కీపై అభ్యంతరాలను ఈ నెల 14 వరకు స్వీకరించనున్నట్టు ప్రకటించారు.

# మాజీ సర్పంచ్‌ల అరెస్టును ఖండిస్తున్నాం

### జెఎసి అధ్యక్షుడు సర్వి యాదయ్యగౌడ్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన మాజీ సర్పంచ్‌ల అరెస్టులను ఖండిస్తున్నట్లు మాజీ సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులు చెల్లించకుండా కక్ష సాధింపు చర్యకు పాల్పడుతూ రాజకీయాలు చేస్తున్న సిఎం రేవంత్ రెడ్డి ఏ జిల్లాకు పర్యటన చేస్తే జిల్లాకు సంబంధించిన ప్రశ్నించే గొంతికలను అర్ధరాత్రి ఇళ్ల ముందట పోలీసులను పెట్టి అరెస్టు చేపియ్యడం సిగ్గుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. ఈ ప్రజా పాలనలో అరెస్టులు నిర్బంధాలు నా పరిపాలనంటే గ్రామా అభివృద్ధి పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సంబంధించిన సర్పంచులు అడుగుతే అర్ధరాత్రి పోలీసులను పెట్టి అరెస్టు చేయించడమేనా మీ ప్రజాపాలన అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని చెప్పి శంకుస్థాపనలు చేయడం ఏందో అర్థం కావడం లేదన్నారు.మా పెండింగ్ బిల్లులు చెల్లించమని 17 నెలలుగా ప్రభుత్వానికి వినతి పత్రాలు ఇస్తూ గాంధీ మార్గంలో మార్గంలో నిరసనలు తెలుపుతూ మొత్తుకున్నా కనికరం లేని రాక్షస పాలన మాకు వద్దు అన్నారు.రేవంత్ రెడ్డి ప్రాజాపాలనకు ప్రజలు వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారాని ఆయన హెచ్చరించారు. ఈ ప్రభుత్వం ప్రజల్ని దృష్టి మళ్లించాలనే కాళేశ్వరం కమిషన్ పేరుతో ప్రతిపక్ష నేతలకు నోటీసులు ఇస్తోందని ఆయన ఆరోపించారు. కక్షపూరిత రాజకీయాలతో ప్రభుత్వం నడిపిస్తున్నారనే అంశాన్ని ప్రజలు గ్రహిస్తున్నారనే అంశాన్ని గుర్తుపెట్టుకో వాలన్నారు. మీరు ప్రజా పాలన మీద దృష్టి పెట్టి మీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# మళ్లీ పెరుగుతున్న కరెంట్ డిమాండ్

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగానికి కూడా క్రమేపీ డిమాండ్ పెరుగుతుంది. వేసవిలో అకాల వర్షాలు, వడగండ్ల వానలతో వాతావరణం చల్లబడి ఉష్ణోగ్రతలు తగ్గాయి. మరోవైపు నైరుతి రుతుపవనాలు, అవర్తనాలు, అల్పపీడనాల ప్రభావంతో తెలంగాణలో జలవిల కాలంలో విస్తృతంగా వర్షాలు కురియడంతో రాష్ట్రంలో కరెంట్ వినియోగం తగ్గిపోయింది. అయితే నైరుతి రుతుపవనాలు బలహీనపడటంతో ఇప్పుడు మళ్లీ గత మూడు నాలుగు రోజులుగా ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ఉష్ణోగ్రతల్లో పెరుగుదల చోటు చేసుకుంది. దీంతో రాష్ట్రంలో కరెంట్ వినియోగంలో పెరుగుదల చోటు చేసుకుంది. మే 25వ తేదీన 7903 మెగావాట్ల విద్యుత్ వినియోగం జరగ్గా, 26న 8689 మెగావాట్లు, 27న 8689 మెగావాట్లు, 28న 8304 మెగావాట్లు, 29న 8484 మెగావాట్లు, 30న 8862 మెగావాట్లు 31న 8886 మెగావాట్లు, ఈ నెల 1న 8745 మెగావాట్లు, 2న 9411 మెగావాట్లు, 3న 9632 మెగావాట్లు, 4న 10125 మెగావాట్లు, 5వ తేదీన 10008 మెగావాట్ల మేర విద్యుత్ వినియోగం జరిగినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. మరి కొద్ది రోజుల పాటు ఉష్ణోగ్రతలు పెరుగనున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగం కూడా మరింత పెరుగుతుందని విద్యుత్ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

# ఢిల్లీ సిఎంను చంపేస్తామంటూ బెదిరింపులు



**న్యూఢిల్లీ, జూన్ 6:** ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాను హత్య చేస్తామంటూ బెదిరింపులు వచ్చాయి. సీఎంను చంపేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లో బెదిరించారు. ఈ బెదిరింపు కాల్‌తో అప్రమత్తమైన పోలీసులు ఫోన్ నంబర్ ఆధారంగా బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో ఘజియాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఓ ఫోన్ కాల్ వచ్చింది. ఫోన్ చేసిన వ్యక్తి ఢిల్లీ సీఎం రేఖా గుప్తాను చంపేస్తానని బెదిరించి ఫోన్ పెట్టేశాడు. దీంతో అప్రమత్తమైన ఘజియాబాద్ పోలీసులు ఈ విషయాన్ని వెంటనే ఢిల్లీ పోలీసులకు తెలియజేశారు. అలర్ట్ అయిన ఢిల్లీ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కొత్వాలి పోలీస్ స్టేషన్ ప్రాంతం నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు గుర్తించారు. అయితే, ఆ ఫోన్ నంబర్ స్విచ్‌ఆఫ్ అని వస్తోంది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనపై దర్యాప్తుచేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.



# రాష్ట్రహోదా డిమాండ్‌పై ప్రధాని మోడీ ఎదుట జమ్మూకాశ్మీర్ సిఎం ఒమర్‌అబ్దుల్లా ప్రస్తావన

**శ్రీనగర్, జూన్ 6:** ప్రధాని మోడీ తనను త్వరలో ప్రమోట్ చేస్తారని ఆశిస్తున్నట్లు జమ్మూకశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా అన్నారు. శుక్రవారం జమ్మూకశ్మీర్ పర్యటనకు వెళ్లిన మోడీ వద్ద ఆయన రాష్ట్ర హోదా అంశాన్ని ప్రస్తావించారు. ఆ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. '2014లో మీరు ఇక్కడికి వచ్చినప్పుడు నేను రాష్ట్రానికి సిఎంగా ఉన్నాను. నేను ఇప్పుడు ఒక కేంద్ర పాలిత ప్రాంత సిఎంగా డిమోట్ అయ్యాను. అప్పుడు రైల్వేశాఖ సహాయమంత్రిగా ఉన్న వ్యక్తికి లెఫ్టినెంట్ గవర్నర్ ప్రమోషన్ వచ్చింది. త్వరలో నాకు ప్రమోషన్ వస్తుందని ఆశిస్తున్నా. దీన్ని సరిదిద్దడానికి ఎక్కువ సమయం పట్టదనుకుంటున్నాను అని ఒమర్ అబ్దుల్లా మాట్లాడారు. ప్రస్తుతం జమ్మూకశ్మీర్ ఎల్‌జీగా మనోజ్‌సిన్హా ఉన్నారు. జమ్మూకశ్మీర్ పూర్తిస్థాయి రాష్ట్రంగా ఉన్నప్పుడు 2009 నుంచి 2014 వరకు ఒమర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2019లో ఆర్టికల్ 370ని రద్దు చేయడంతో పాటు జమ్మూకశ్మీర్ రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మారుస్తూ కేంద్రం సంచలన నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జమ్మూకశ్మీర్‌కు గతేడాది జరిగిన ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ కూటమి విజయం సాధించగా కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూకశ్మీర్‌కు తొలి సిఎంగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి రాష్ట్ర హోదాకోసం డిమాండ్ చేస్తూనే ఉన్నారు. అయితే ఇటీవల పహల్గాం ఉగ్రదాడి తర్వాత 26 మంది ప్రాణాలను అడ్డం పెట్టుకుని తాను జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను ఏ ముఖం పెట్టుకుని డిమాండ్ చేయాలి. నావి అంత చౌకబారు రాజకీయాలు కావు. గతంలో రాష్ట్ర హోదా ఇవ్వండి అని కేంద్రాన్ని అడగడం సిగ్గుచేటు అని గతంలో వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు

## ప్రజాపాలనలో 90 లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు

## మిగులు విద్యుత్తు లక్ష్యంగా ముందుకుపోతున్నాం

## డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూన్ 6, ప్రభాతవార్త:** కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదు అని ఎన్నికల ముందు టిఆర్ఎస్ నేతలు ప్రచారం చేశారు, మేం నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడమే కాదు మిగులు విద్యుత్తు లక్ష్యంగా ముందుకు పోతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాలోని మూసాపేట, నవాబు పేటలో పర్యటించారు. సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో రాష్ట్రంలో ఉత్పత్తులు పెరిగాయి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయని డిప్యూటీ సీఎం వివరించారు. మార్చి 2023లో బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ డిమాండ్ 15,497 మెగావాట్లు కాగా మార్చి 2025న కాంగ్రెస్ పాలనలో విద్యుత్తు పిక్ డిమాండ్ 17,162 మెగావాట్లకు చేరింది, ఒకేసారి 2,000 మెగావాట్ల మేరకు డిమాండ్ పెరిగినప్పటికీ రెప్పపాటు కూడా విద్యుత్తు సరఫరా లో అంతరాయం లేకుండా ముందుకు వెళ్ళామని డిప్యూటీ సీఎం వివరించారు. 2035 నాటికి తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్ 33, 775 మెగావాట్లుగా అంచనా వేశాం, అందుకు తగిన విధంగా ఉత్పత్తి, సరఫరా కు అవసరమైన ప్రణాళికలను ఇప్పుడే సిద్ధం చేశామని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్రంలో సమృద్ధిగా విద్యుత్ సరఫరా ఉండడంతో ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడి దారులు రాష్ట్రానికి తరలి వస్తున్నారని వారందరికీ అవసరమైన విద్యుత్ సరఫరా చేస్తాం, ప్రపంచం తోనే పోటీ పడతామని తెలిపారు. తెలంగాణ రైసింగ్‌ను కుట్రదారులు ఆపలేరు, ఈ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల ప్రభుత్వం ద్వారానే సాధ్యం అన్నారు. రాష్ట్రంలో 90 లక్షల కుటుంబాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి, ఈ సంక్షేమాన్ని చూడలేని పథకాలు ప్రజలకు చేరవద్దు అనుకునే కొద్దిమంది మా ఆశయానికి సోషల్ మీడియా ద్వారా తూట్లు పొడవాలని చూస్తున్నారని డిప్యూటీ సీఎం అన్నారు. ప్రజలకు పథకాలు అందవద్దు, వారిలాగే దోపిడీ చేయాలని గత పాలకులు భావిస్తున్నారు కానీ ప్రజలే కేంద్రంగా పాలన జరగాలని తమ తపన అని తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను కష్టపెడుతుంది అని బీఆర్ఎస్ నేతలు మొసలి కన్నీరు కారుస్తున్నారు.. ఈ ప్రభుత్వం పాలకుల కోసం కాదు ప్రజల కోసమే అని గుండెపై చేయి వేసుకొని తాను ధైర్యంగా చెబుతున్నానని అన్నారు. ఒక ఇంట్లో 200యూనిట్ల వరకు ఫ్రీ కరెం టు, ఒక్కొక్కరికి ఆరు కేజీల చొప్పున సన్న బియ్యం, దేశంలోనే ఏ రాష్ట్రంలో నూ సన్న బియ్యం పంపిణీ జరగడం లేదన్నారు. 40 శాతం డైట్ చార్జీలు పెంచాం, ఉన్నత చదువులు చదువుకునే పిల్లల కోసం ఫీజు రియంబర్స్మెంట్ చేస్తున్నాం, ఆ ఇంట్లో ఎవరైనా



సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సిఎం భట్టి

జబ్బు పడితే పది లక్షల వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా వైద్య సహాయం అందిస్తున్నారు. చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రభుత్వ ఉద్యోగాలు రానివారికి రాజీవ్ యువ వికాసం కింద స్వయం ఉపాధి పథకం, ఆ ఇంట్లో రెండు లక్షల వరకు అప్పు తెచ్చుకున్న రైతుకు రుణమాఫీ నేరుగా రైతు అకౌంట్లో జమ చేశాం, ప్రతి రైతుకు రైతు భరోసా కింద 12000, భూమిలేని ఇంట్లో వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద 12000, ఇల్లు లేని వారు ఇల్లు కట్టుకోవడానికి 5 లక్షలు, ఇంట్లో వృద్ధులు వితంతువులు ఉంటే వారికి పెన్షన్ ప్రతినెల ఇచ్చేలా కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. బీఆర్ఎస్ నాయకులకు 10 సంవత్సరాలపాటు మహిళలు ఎందుకు గుర్తు రాలేదని ప్రశ్నించారు. గత ఎన్నికల ముందు పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా వచ్చేది ఇందిరమ్మ ప్రభుత్వమే పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఉదండపూర్ రిజర్వాయర్ కింద భూమి కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తామని హామీ ఇచ్చామని, ఆ మేరకు ప్రజా ప్రభుత్వం ఏర్పడింది ఉదండాపూర్ రైతులకు రూ.70 కోట్లు విడుదల చేశామని వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడే ఉండే పార్టీ కాంగ్రెస్ అన్నారు. జూరాల నుంచి శ్రీశైలం వరకు చేపట్టిన ప్రాజెక్టులన్ని కాంగ్రెస్ తోనే సాధ్యం అయ్యాయన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే గిరిజన బిడ్డలు ఆత్మగౌరవంతో తలెత్తుకొని బతికేలా రూ. 12,600 కోట్లతో ఇందిరా సౌర గిరిజల వికాసం అనే పథకాన్ని తీసుకువచ్చాం అన్నారు. రాష్ట్రంలోని గిరిజనుల ఆధీనంలో ఉన్న 6.70 లక్షల ఎకరాల్లో ఉచితంగా బోరు బావులు, సోలార్ పంపు సెట్లు, అవకాడో వంటి మొక్కలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు ప్రాజెక్టు పరిధిలో ఒకరోజు స్విచ్ ఆన్ చేసి వెంటనే స్విచ్ ఆఫ్ చేయడం మినహా ఒక్క ఎకరాకు సాగునీరు ఇవ్వలేదు అని విమర్శించారు. కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు జి మధుసూదన్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి,మేఘా రెడ్డి, మహబూబ్‌నగర్ కలెక్టర్ జి. విజయేందిర బోయి, ట్రాన్స్ కో సి.ఎం.డి.కృష్ణ భాస్కర్, టి.జ్డి. ఎస్.పి.సి.డి.ఎల్.సి.ఎం.డి.ముషారఫ్ ఫారూఖి,రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌స్థానిక సంస అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు పాల్గొన్నారు.

# రేపు, ఎల్లుండి ఐసెట్-2025 పరీక్ష

## 71,757 మంది దరఖాస్తు.. 96 పరీక్ష కేంద్రాల ఏర్పాటు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఎంబిఏ, ఎంసిఏ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే కామన్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ ఐ సెట్-2025 పరీక్షలను రేపు(ఆదివారం), ఎల్లుండి (సోమవారం) నిర్వహించ నున్నారు. ఐ సెట్-2025కి 71,757 మంది దరఖాస్తు చేసుకున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ ఆలువాల రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16 జోన్లలో 96 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. పరీక్షలకి 34,409 మంది పురుషులు దరఖాస్తు చేసుకోగా.. 37,331 మంది మహిళలు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించనుండగా.. సోమవారం ఉదయం సెషన్‌ను నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు ఒక సెషన్‌ను.. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో సెషన్‌ను నిర్వహించనున్నారు. ఇక సోమవారం సెషన్‌ను ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు పరీక్షను నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రం గేట్లను పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందుగానే మూసివేయనున్నట్టు కన్వీనర్ ప్రకటనలో తెలిపారు.

# విరాట్ కోహ్లిపై పోలీసులకు ఫిర్యాదు

**బెంగళూరు, జూన్ 6:** బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు సన్మాన కార్యక్రమం సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లిపై పోలీసులకు ఫిర్యాదు చేసారు. రియల్‌ఫైటర్స్ ఫోరం తరఫున ఏఎం వెంకటేశ్ అనే వ్యక్తి కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఫిర్యాదు చేశారు. ప్రముఖ క్రికెటర్ అయిన కోహ్లిపై చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు, ఇప్పటికే ఈ ఘటనపై నమోదైన ఎఫ్‌ఐఆర్‌తో కలిపి దీనిని కూడా విచారణకు పరిగణనలోకి తీసుకుంటామని వెంకటేశ్ కు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఈ తొక్కిసలాట ఘటనపై కర్ణాటక పోలీసులు ఇప్పటికే నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో, ఆర్‌సీబీ ఫ్రాంచైజీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ పాలక కమిటీలు అవసరమైన అనుమతులు లేకుండానే విజయోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించాయని పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహితలోని పలు సెక్షన్ల కింద ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో సెక్షన్ 105 హత్యతో సమానం కాని నేరపూరిత నరహత్య, 115(2)స్వచ్ఛందంగా గాయపరచడం, 118(1) ప్రమాదకర ఆయుధాలు లేదా సాధనాలతో స్వచ్ఛందంగా గాయపరచడం లేదా తీవ్రంగా గాయపరచడం, 118(2) రెడ్‌విత్ సెక్షన్ 3(5) ఉమ్మడి ఉద్దేశంతో పలువురు వ్యక్తులు చర్యకు పాల్పడినప్పుడు స్వచ్ఛందంగా తీవ్రంగా గాయపరచడం, 190 చట్టవిరుద్ధంగా గుమికూడటం, 132 ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడానికి నేరపూరిత బలప్రయోగం, 125(ఎ) తప్పుడు అఫిడవిట్ దాఖలు చేయడం, 125(బి) మానవ ప్రాణాలకు హాని కలిగించే నిర్లక్ష్యపూరిత చర్యలు ఉన్నాయి.

ఇదిలా ఉండగా, తొక్కిసలాట ఘటనకు సంబంధించి కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో మరో రెండు అదనపు కేసులు నమోదయ్యాయి. తొక్కిసలాటలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స



పొందిన రోలాండ్ గోమ్స్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆర్‌సీబీ ఫ్రాంచైజీ, కేఎస్‌సీఏ, డీఎన్ఏ సంస్థలపై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 125(ఎ) కింద కేసు నమోదు చేశారు. మరోవైపు, బీజేపీ ప్రతినిధి బృందం కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిర్యాదు చేసింది

# కొత్తగా పార్టీలోకి వచ్చిన నేతలతోనే పాత వారికి ఇబ్బందులు

## పరస్పర విమర్శలు చేసుకుంటున్నారు, వారికి చెక్ పెట్టండి

## సిఎం రేవంత్‌తో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, జూన్ 6:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో రాష్ట్ర కాంగ్రెస్ ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ శుక్రవారం భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో వారు గంటపాటు సమావేశమయ్యారు. గత పది రోజులుగా పార్టీ నేతలతో మీనాక్షి వరుస సమీక్షలు నిర్వహించారు. పార్టీ నేతల అభిప్రాయాలను సీఎం రేవంత్ రెడ్డితో మీనాక్షి నటరాజన్ చర్చించారు. పార్లమెంట్ నియోజకవర్గాలకు సంబంధించి అలాగే అసెంబ్లీకి సంబంధించి నేతలతో ఉమ్మడి జిల్లాలకు కొంతమంది అబ్జర్వర్స్‌ను నియమించారు. వారందరితో వరుసగా పది రోజులపాటు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఈ విషయాలన్నీ రేవంత్ రెడ్డికి మీనాక్షి వివరించారు. కాగా, మీనాక్షి నటరాజన్ సమీక్షల్లో చాలా మంది నేతలు జిల్లాలు, నియోజకవర్గాల్లో ఒక నేతపై మరొక నేత ఫిర్యాదులు చేసుకున్నారు. దాంతో పాటు ఆధిపత్యపోరుకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి.

కాంగ్రెస్ పార్టీకి సంబంధించి జిల్లాలు, నియోజకవర్గాల్లో నేతలు సోషల్ మీడియాలో చాలా వీక్‌గా ఉన్నారని, చాలా మందికి సోషల్ మీడియాపై అవగాహన లేదని, ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సంబంధించి వివరాలు తెలియవని, వాటిపై వారికి అవగాహన లేకపోవడంతో జనాలకు వివరించలేక పోతున్నారని మీనాక్షికి ఫిర్యాదులు అందాయి. అన్ని విషయాలను ఆమె సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. ఈ సమస్యలన్నింటికి పరిష్కార మార్గాలు చూపవలసిందిగా ఆమె సీఎంను కోరారు. అలాగే కొత్తగా కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నేతల వల్ల పాత నేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారని దీనికి చెక్ పెట్టాలని మీనాక్షి నటరాజన్ భావిస్తున్నారు. వీటన్నింటికి సంబంధించిన విషయాలను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# పంటలు వేయకముందే రైతు భరోసా

## అధిక లాభాలు వచ్చే పంటలు వేయాలి

## హుస్నాబాద్ రైతాంగం తెలంగాణకు మార్గదర్శకంగా ఎదగాలి

## రైతు మహోత్సవంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త:** వర్షాకాలం రైతులు పంటలు వేయక ముందే వారి ఖాతాలలో రైతు భరోసాను జమ చేస్తామని రాష్ట్ర వ్యావసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు . శుక్రవారం రోజున హుస్నాబాద్ మార్కెట్ యార్డులో మూడు రోజుల పాటు జరగనున్న రైతు మహోత్సవ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే , రాష్ట్ర రవాణా , బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలసి ప్రారంభించారు . రైతు మహోత్సవ కార్యక్రమానికి ఎడ్లబండ్లపై ఊరేగింపుగా మార్కెట్ యార్డు వద్దకు చేరుకోగా జిల్లా కలెక్టర్ మిక్కలినేని మనుచౌధరి అధికారులు ఘనంగా స్వాగతం పలికారు . అక్కడ ఏర్పాటు చేసిన దాదాపు 150 స్టాల్స్‌లో ఆయిల్ ఫాంతో పాటు ప్రకృతి సిద్దంగా పండించిన కూరగాయలు , ఉద్యానవన , పట్టు పరిశ్రమకు సంబందించిన వాటిని పరిశీలించి వాటి గురించి అడిగి తెలుసుకున్నారు . అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో అతి త్వరలోనే ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంచ అయిన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేయబోతున్నామని ,కావున ఈ ప్రాంత రైతాంగం నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వ్యవసాయ పద్దతులను నేర్చుకోవాలనే ఉద్దేశంతోనే ఈ రైతు మహోత్సవ కార్యక్రమాన్ని ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్నట్లు వివరించారు . మరో రెండు రోజులు సాగే ఈ రైతు మహోత్సవాలలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రతీస్టాల్‌ను పరిశీలించి నూతన వ్యవసాయ విధానాలను తెలుసుకోవడంతో పాటు రానున్న రోజుల్లో గ్రామీణ ప్రాంతంగా ఉన్న హుస్నాబాద్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్రానికే మార్గదర్శకంగా ఎదగాలని ఆకాంక్షించారు . మారుతున్న వాతావరణ పరిస్థితి , యాంత్రీకరణ , సేంద్రీయ వ్యవసాయ పద్దతుల కోసం రైతులకు ఇలాంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు . అనంతరం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ గతంతో పోలిస్తే రైతులు పంటలకు యూరియాతో పాటు పురుగుల మందులు ఎక్కువ వాడుతున్నారని మన రాష్ట్రంలో మందులు ఎక్కువ వాడడం వల్ల ఇతర రాష్ట్రాలు మన రాష్ట్రం పంటలు కొనడానికి ఇష్టపడటం లేరన్నారు . కావున రైతులు ప్రకృతి సిద్దంగా సేంద్రీయ ఎరువులతోనే పంటలు పండించాలని అప్పుడే మన పంటలకు ఎక్కువ విలువ ఉంటుందన్నారు . వ్యవసాయ యూనివర్సిటీ వీసీలు , ప్రొఫెసర్లు , శాస్త్రవేత్తల ద్వార ఏ భూమిలో ఏ పంటలు ఎక్కువగా పండుతాయో అందులో అధిక ఆధాయం వచ్చే పంటలను తెలుసుని సాగుచేసుకోవాలన్నారు .

ఈ వర్షాకాలం రైతులు పంటలు సాగు చేయకముందే వారి ఖాతాలలో రైతు భరోసా నిధులు విడుదల చేస్తామన్నారు. హుస్నాబాద్‌లో ప్రభుత్వ స్థలం కేటాయిస్తే ఆయిల్ ఫామ్ గోడవున్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు . రైతులు ఆయిల్ ఫామ్ సాగుచేస్తే అధిక లాభాలు వస్తాయని , మూడు సంవత్సరాల వరకు అంతర్ పంటలు కూడా వేసుకుని ఆధాయం పొందవచ్చని , ఆయిల్ ఫామ్ సాగు చేసే రైతులకు హార్టికల్చర్ నుండి కూడా పెట్టుబడి సహాయం అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు . కేంద్రం నుండి రాష్ట్రానికి సరిపడా ఎరువులు రావడం లేదని , ఎరువులు , యూరియా కొరత లేకుండా ఉండేందుకు బఫర్ స్టాక్ పెట్టుకున్నామని వర్షాకాలానికి రైతులకు ఎరువులు , విత్తనాలకు ఎలాటి కొరత లేదన్నారు . ప్రభుత్వానికి నష్టం జరుగుతున్నా రైతులను ఆర్థికంగా అభివృద్ది చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయిల్ ఫాం మొక్కలు ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేస్తూన్నామన్నారు.


# టి.నాబ్‌కు పట్టుబడిన అంతర్రాష్ట్ర అల్ప్రాజోలం స్మగ్లర్లు

**హైదరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కల్తీ కల్లు తయారీకి వాడే అల్ప్రాజోలంను స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు బడా స్మగ్లర్లను తెలంగాణ యాంటీ నార్కో టిక్ బ్యూరో (టి.నాబ్) పోలీసులు అరెస్టు చేశారు. వనపర్తి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ పోలీసు విభాగాల ప్రాంతీయ నార్కోటిక్ కంట్రోల్ సెల్ (ఆర్ఎన్‌సి సి) సిబ్బంది జాయింట్ ఆపరేషన్‌తో ఈ స్మగ్లర్లను వనపర్తిలో టి.నాబ్ అరెస్టు చేసింది. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి అరకిలో అల్ప్రాజోలంను స్వాధీనం చే సుకున్నారు. టి.నాబ్ డైరక్టర్ సందీప్ శాండిల్యా దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని గాంధా రి సహా పలుచోట్ల ఇటీవల కల్తీ కల్లుకు అనేక మంది అస్వస్తతకు గురైన ఘటనను సర్కారు తీవ్రంగా పరిగణించి దీనికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించడం తెలిసిందే. దీంతో రంగంలో దిగిన టి.నాబ్ గాంధారి తదితర ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్లకు కల్తీ కల్లు తయారీకి కావలసిన అల్ప్రాజోలం సరఫరా చేస్తున్న వ్యక్తులపై నిఘా వుంచగా గద్వాల్ జిల్లా గట్టు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన భాస్కర్ గౌడ్ (42), బింగిదొడ్డి గ్రామానికి చెందిన ఈడిగ నరసింహా గౌడ్ (31)లు దీనికి కారకులని తేలింది. వీరి కోసం గాలింపు చేబట్టగా గురువారం నాడు వనపర్తి జిల్లా పెబ్బేర్ వద్ద ఇద్దరు దొరికిపోయారు. వీ రి వద్ద నుంచి అరకిలో అల్ప్రాజోలం జప్తు చేశారు. వీరిద్దరు ఐదేళ్లుగా అల్ప్రాజోలం విక్రయిస్తున్నట్లు తేలింది. వీరి ముఠాలో అనంతపురం జిల్లాకు చెందిన రా మకృష్ణ, హార్షవర్ధన్ గౌడ్, కర్నూల్ పట్టణానికి చెందిన ఈడిగ జగదీష్, ఈడిగ గోపాల్‌లు కీలకంగా వున్నారు. ఈ నలుగురు పరారీలో వుండగా వారి కోసం గాలిస్తున్నారు. ఈ నలుగురి నుంచి భాస్కర్‌గౌడ్, నరసింహాగౌడ్ కిలో రెండు ల్‌ల 80 వేల రూపాయలకు అల్ప్రాజోలం కొని దానిని నాలుగు లక్షల రూపాయలకు అమ్ముతున్నారు. తాము కొన్న అల్ప్రాజోలంను తెలంగాణ అంతటా కల్లు కాంపౌండ్ల నిర్వాహకులకు అమ్ముతుంటారు. కల్తీ కల్లు తయారీలో ముఖ్యమైన అల్ప్రాజోలంను కేంద్రం చాలా కాలం క్రితమే నిషేధం విధించినా భాస్కర్ గౌడ్, నరసింహా గౌడ్ లాంటి స్మగ్లర్లు చాటుమాటు గా దానిని ఖరీదు చేసి గుట్టుగా వ్యాపారం సాగిస్తున్నారు. వీరి అ రెస్టు విషయంలో వనపర్తితో పాటు నిజామాబాద్, మహబూబ్‌నగర్ పోలీసులు టి.నాబ్‌కు సహకరించారు. కాగా అల్ప్రాజోలంపై ఉక్కుపాదం మోపిన టి.నాబ్ పోలీసులు ఇప్పటివరకు 338 కిలోలను జప్తు చేయడంతో పాటు పలు వురు స్మగ్లర్లను అరెస్టు చేసింది. కాగా డ్రగ్స్ సహా అల్ప్రాజోలం వంటి మత్తు పదార్థాల గురించి ప్రజల వద్ద సమాచారం వుంటే వెంటనే 1908కు తెలపాలని టి.నాబ్ డైరక్టక్ సందీప్‌శాండిల్య కోరారు.

# నేను తీసుకున్న రుణం కంటే ఎక్కువ జమచేసుకున్నారు?

## నన్ను దొంగను అంటే అంగీకరించను.. పారిపోయాననండి.. తప్పలేదు

## పోడ్‌కాస్ట్‌లో పారిశ్రామికవేత్త విజయ్‌మాల్యా



**బెంగళూరు, జూన్ 6:** మనీలాండరింగ్ ఆరోపణలు, సుమారు రూ. 9,000 కోట్లకు పైగా మోసంచేసిన కేసుల్లో భారత్‌లో వాంటెడ్‌గా ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా మరోసారి వార్తల్లోకి ఎక్కారు. పారిశ్రామికవేత్త రాజ్ షమానీతో నాలుగు గంటల పాటు సాగిన ఒక పాడ్‌కాస్ట్‌లో ఆయన తనపై ఉన్న కేసులు, వివాదాస్పద రీతిలో భారత్ విడిచి వెళ్లడం, చట్టపరమైన పోరాటాలు, కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ పతనం, తనను దొంగ అనిపిలవడం వంటి అంశాలపై స్పందించారు. 2016 మార్చి తర్వాత భారత్ కు వెళ్లనందుకు నన్ను పరారీలో ఉన్న వ్యక్తి అనొచ్చు. నేను పారిపోలేదు, ముందే ఖరారైన పర్యటనలో భాగంగానే భారత్ నుంచి బయటకు వెళ్లాను. సరే, నేను సరైనవని భావించే కారణాల వల్ల తిరిగి రాలేదు, కాబట్టి మీరు నన్ను పరారీలో ఉన్న వ్యక్తి అని పిలవాలనుకుంటే పిలవండి, కానీ దొంగ అనే మాట ఎక్కడి నుంచి వస్తోంది. అసలు దొంగతనం ఎక్కడ జరిగింది అని మాల్యా పాడ్‌కాస్ట్ లో ప్రశ్నించారు.

2016 నుంచి యూకేలో నివసిస్తున్న మాల్యా విదేశాల్లో ఉండటం వల్ల తన న్యాయపరమైన చిక్కులు మరింత తీవ్రమయ్యాయా అనే అంశంపైనా వ్యాఖ్యానించారు. "భారత్ లో నాకు న్యాయమైన విచారణ, గౌరవప్రదమైన ఉనికి లభిస్తుందన్న హామీ ఉంటే మీరు చెప్పింది నిజమే కావచ్చు, కానీ నాకు ఆ హామీ లేదని ఆయన అన్నారు. న్యాయబద్ధమైన విచారణకు హామీ ఇస్తే భారత్ కు తిరిగి వస్తారా అని ప్రశ్నించగా నాకు అలాంటి హామీ లభిస్తే కచ్చితంగా దాని గురించి ఆలోచిస్తానని మాల్యా బదులిచ్చారు. అప్పగింత కేసులో యూకే హైకోర్ట్ ఆఫ్ అప్పీల్ ఇచ్చిన తీర్పును ఆయన ఉటంకిస్తూ భారతీయ జైళ్లలోని పరిస్థితులు యూరోపియన్ మానవ హక్కుల కన్వెన్షన్‌లోని ఆర్టికల్ 3ను ఉల్లంఘిస్తున్నాయని తేలిందని చెప్పారు. అందువల్ల వారిని వెనక్కి పంపలేరని పేర్కొంటూ తనకు కూడా అలాంటి ఆందోళనలు ఉన్నాయని పరోక్షంగా పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలో మాల్యా చేసిన వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదు. కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ పతనం గురించి మాల్యా మాట్లాడుతూ 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇందుకు ఒక ప్రధాన కారణమని తెలిపారు.

మీరు లేమాన్ బ్రదర్స్ గురించి విన్నారుకదా, ప్రపంచ ఆర్థిక సంక్షోభం గురించి విన్నారు కదా అది భారత్ పై కచ్చితంగా ప్రభావం చూపిందని షమానీతో అన్నారు. ప్రతి రంగం దెబ్బతింది. డబ్బు ఆగిపోయింది. భారత రూపాయి విలువ కూడా దెబ్బతిందని వివరించారు. నేను ఆనాటి ఆర్థికమంత్రి ప్రణబ్ ముఖర్జీ వద్దకు వెళ్లి నాకు ఒక సమస్య ఉందని చెప్పాను.

కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ కార్యకలాపాలు తగ్గించుకోవాలి, విమానాల సంఖ్యను తగ్గించాలి, ఉద్యోగులను తొలగించాలి, ఎందుకంటే ఈ కుంగిపోయిన ఆర్థిక పరిస్థితుల్లో కార్యకలాపాలు కొనసాగించలేనని చెప్పారు. అయితే, కార్యకలాపాలు తగ్గించవద్దని, బ్యాంకులు మద్దతు ఇస్తాయని ఆయన తనకు సలహా ఇచ్చారని చెప్పారు. మాల్యాకు న్యాయపరమైన చిక్కులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 9న భారతీయ స్టేట్ బ్యాంక్ సహా భారతీయ రుణదాతల కన్సార్టియంకు చెల్లించాల్సిన రూ. 11,101 కోట్ల రుణానికి సంబంధించి లండన్ హైకోర్టు జారీ చేసిన దివాలా ఉత్తర్వులపై చేసిన అప్పీల్ తిరస్కృతికి గురయింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. వాస్తవంగా చెల్లించాల్సిన రూ. 6,200 కోట్లకు బదులుగా బ్యాంకులు ఇప్పటికే రూ. 14,000 కోట్లు రాబట్టుకున్నాయనికోర్టులోనే మా న్యాయవాదులు వాదించారు.

రాబట్టుకున్న మొత్తానికి సంబంధించిన వివరణాత్మక లెక్కలను అందించాలని రుణదాతలను ఆదేశించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఆర్. దేవదాస్ నేతృత్వంలోని ధర్మాసనం సంబంధిత బ్యాంకులకు, రుణరికవరీ అధికారులకు నోటీసులు జారీ చేసింది.

అయినప్పటికీ 2012లో కార్యకలాపాలు నిలిపివేసిన కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్‌కు సంబంధించిన ఆర్థిక నేరాలకు గాను విచారణ ఎదుర్కోవడానికి మాల్యాను తీసుకొచ్చేందుకు భారత అధికారులు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

# 'హరి హర వీర మల్లు' కాస్త ఆలస్యం..

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు అత్యంత ఆసక్తిగా ఎదురు చూస్తున్న చిత్రాలలో హరి హర వీర మల్లు ఒకటి. ఈ చిత్ర విడుదల గురించి జరుగుతున్న ప్రచారాలు, పెరుగుతున్న ఊహాగానాలు నేపథ్యంలో నిర్మాతలు అధికారిక ప్రకటన విడుదల చేశారు. అచంచలమైన ఓపిక మరియు నమ్మకంతో హరి హర వీరమల్లు సినిమాకు తోడుగా నిలిచిన అభిమాన నటులు, శ్రేయోభిలాషులు మరియు సినీ ప్రేమికులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. గతంలో ప్రకటించిన జూన్ 12వ తేదీకి చిత్రాన్ని మీ ముందుకు తీసుకురావడానికి అవిశ్రాంత ప్రయత్నాలు చేస్తున్నాము. అయినప్పటికీ ఆ తేదీకి చిత్రాన్ని థియేటర్లలోకి తీసుకు రాలేకపోతున్నామని తెలియజేస్తున్నాము. కష్టమైనప్పటికీ తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ యొక్క ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని మరింత గొప్పగా మలచాలనేదే మా ప్రయత్నం. ప్రతి ఫ్రేమ్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, అద్భుతమైన చిత్రంగా మలిచే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నాము. అందుకే మేము మరికొంత సమయం తీసుకుంటున్నాము. మీ ఎదురు చూపులకు బహుమతిగా గొప్ప చిత్రాన్ని అందిస్తామని హామీ ఇస్తున్నాము. మరోవైపు, సామాజిక మాధ్యమాల్లో హరి హర వీరమల్లు చిత్రం గురించి తప్పుడు వార్తలు ప్రచారమవ్వడం మేము గమనించాము. చాలామంది తమకు తోచినది రాసేస్తున్నారు. ధృవీకరించని వార్తలను నమ్మవద్దని, వాటిని వ్యాప్తి చేయవద్దని మేము ప్రతి ఒక్కరినీ కోరుతున్నాము. దయచేసి మా అధికారిక హ్యాండిల్స్ ద్వారా మాత్రమే సినిమాకి సంబంధించిన అప్డేట్ల కోసం వేచి ఉండండి. అప్పటి వరకు,



ఎటువంటి ప్రచారాలను నిజమని భావించకండి. హరి హర వీరమల్లు చిత్రం ఒక అద్భుతమైన ప్రయాణం. వందలాది మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు కలిసి వెండితెరపై అద్భుతాన్ని సృష్టించడానికి 24 గంటలూ తమ శక్తికి మించి కృషి చేస్తున్నారు. ఈ ఆలస్యం మన సహనాన్ని పరీక్షించవచ్చు. కానీ, అంత కంటే గొప్పది ఏదో రూపుదిద్దుకుంటుందని కూడా ఇది సూచిస్తుంది.

ప్రతి దృశ్యం ఆశ్చర్యపరిచేలా, ప్రతి శబ్దం ప్రతిధ్వనించేలా, ప్రతి సన్నివేశం ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేయాలనే లక్ష్యంతో చిత్ర బృందం నిర్మాణానంతర కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. హరి హర వీరమల్లు యొక్క భారీ మరియు శక్తివంతమైన థియేట్రికల్ ట్రైలర్ త్వరలో విడుదల కానుందని తెలియజేయడానికి మేము చాలా సంతోషిస్తున్నాము. ట్రైలర్‌తో పాటు, కొత్త విడుదల తేదీని కూడా తెలియజేస్తాము. కాబట్టి భారీ ప్రకటన కోసం వేచి ఉండండి. సినిమాపై రోజు రోజుకి అంచనాలు పెరిగి పోతున్నాయి. అద్భుతమైన ట్రైలర్‌ను మీతో పంచుకోవడానికి మేము ఆసక్తిగా ఎదురు చూస్తున్నాము. అద్భుతాన్ని చూడటానికి సిద్ధంగా ఉండండి. ఈ చిత్రానికి ఎ.ఎం. జ్యోతి కృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

# ఈ నెలలోనే 'మోగ్లీ 2025' టీజర్

తన తొలి చిత్రం బబుల్ గమ్‌లో తన అద్భుతమైన నటనతో అలరించిన యంగ్ హీరో రోషన్ కనకాల ప్రస్తుతం మోగ్లీ 2025లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి నేషనల్ అవార్డ్ విన్నింగ్ కలర్ ఫోటో డైరెక్టర్ సందీప్ రాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై విజనరీ ప్రొడ్యూసర్ టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా మేకర్స్ మారేడుమిల్లిలో బిగ్ క్లైమాక్స్ యాక్షన్ షెడ్యూల్ పూర్తి చేశారు. 15 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్ లో మ్యాసీవ్ యాక్షన్ సీక్వెన్సలని షూట్ చేశారు. ఈ క్లైమాక్స్ సీక్వెన్స్‌లో రోషన్ కనకాల చాలా రిస్క్ తీసుకుని యాక్షన్ స్టంట్స్‌ని పెర్ఫార్మ్ చేశారు. ఈ సీన్స్ సినిమాలో మేజర్ హైలెట్‌గా వుండబోతున్నాయి. మారేడుమిల్లిలో మూడో షెడ్యూల్ పూర్తి చేశారు. ఇంకొక్క షెడ్యూల్‌తో సినిమా షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ఈ నెలలోనే టీజర్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమాలో విజువల్స్, యాక్షన్ హైలెట్‌గా ఉండబోతున్నాయి. ఈ సినిమాలో మ్యూజిక్‌కి చాలా ఇంపార్టెన్స్ ఉంది. మోగ్లీ ఆల్బమ్, బ్యాగ్రౌండ్ స్కోర్ అవుట్ స్టాండింగ్‌గా ఉండబోతుంది. ఆడియన్స్‌కి చాలా కొత్త ఎక్స్ పీరియన్స్ ఇవ్వబోతోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా గ్లింప్స్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఈ గ్లింప్స్ రోషన్‌ను హైఆక్టేన్ యాక్షన్ అవతార్‌లో ప్రజెంట్ చేసింది. ఈ చిత్రంతో సాక్షిసాగర్ మడోల్కర్ హీరోయిన్‌గా ఆరంగేట్రం చేస్తున్నారు. ఈ చిత్రానికి రామ మారుతి ఎం సినిమాటోగ్రఫీని నిర్వహిస్తున్నారు. కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. కోదాటి పవన్ కళ్యాణ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కిరణ్ మామిడి ఆర్ట్ డిపార్ట్‌మెంట్‌ను పర్యవేక్షిస్తుండగా, నటరాజ్ మాదిగొండ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రాఫర్ చేస్తున్నారు. స్క్రీన్‌ప్లేను రామ మారుతి ఎం, రాధాకృష్ణ రెడ్డి రాశారు. ప్రతిభావంతులైన తారాగణం, టెక్నికల్ టీంతో రూపొందుతున్న మోగ్లీ 2025 సినీ ప్రేక్షకులకు ఒక గొప్ప సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. మోగ్లీ 2025 ఈ సంవత్సరం చివర్లో విడుదల కానుంది. తారాగణం: రోషన్ కనకాల, సాక్షిసాగర్ మడోల్కర్, బండి సరోజ్ కుమార్, సాంకేతిక సిబ్బంది:రచన, దర్శకత్వం: సందీప్ రాజ్,నిర్మాతలు: టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్,బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంగీతం: కాలభైరవ,డిఓపి: రామ మారుతి ఎం ఎడిటర్: కోదాటి పవన్ కళ్యాణ్, ఆర్ట్: కిరణ్ మామిడి, యాక్షన్: నటరాజ్ మాడిగొండ సహ రచయితలు: రామ మారుతి. ఎం రాధా కృష్ణ రెడ్డి పీఆర్వో: వంశీ శేఖర్.



# ప్రేక్షకులను థియేటర్లకు ఎలా రప్పించాలన్నదే ముఖ్యం

ఎగ్జిబిటర్స్, ప్రొడ్యూసర్స్ గ్రహించవలసింది, కరెక్ట్ చేసుకోవాల్సింది పర్సంటేజ్ సిస్టం కాదు.. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించడం ఎలా అని..! ఇప్పుడున్న అర్ధ రూపాయి వ్యాపారంలో నీది పావులు.. నాది పావలా అని కొట్టుకోవడం కాదు.. మునపటిలా మన వ్యాపారాన్ని రూపాయికి ఎలా తీసుకెళ్లాలి అనేది ఆలోచించాలి తప్ప.. ఇలాగ సినిమా విడుదలైన 28 రోజుల్లోపే ఓటిటికి ఇవ్వాలి అనే ట్రెండ్ కొనసాగితే .. రాబోయే నాలుగైదు ఏళ్లలో 90 శాతం సింగిల్ స్క్రీన్స్ మూసుకుపోతాయి. ఈ విషయం పెద్ద హీరోలు కూడా ఆలోచించాలి. మీరు రెండు సంవత్సరాలకు ఒక సినిమా మూడు సంవత్సరాలకు ఒక సినిమా చేస్తూ పోతే థియేటర్ల నుంచి ప్రేక్షకులు కూడా దూరమైపోతారు. ఈరెండు మూడేళ్లలో చాలా మంది థియేటర్ ఓనర్స్ వాటిని మెయింటైన్ చేయలేక మూసేస్తారు. సింగిల్ స్క్రీన్స్ మూత పడిన ట్టైతే ఓన్లీ మల్టీప్లెక్స్ థియేటర్స్ అయితే పెద్ద హీరోలందరూ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే మీ సినిమా థియేటర్స్ ద్వారావచ్చే ఆదాయం కేవలం 43 మాత్రమే నిర్మాతలకు వెళుతుంది.


నిర్మాత బన్నీ వాసు

# 'వనం' టీజర్ లాంచ్

వృక్షో రక్షతి రక్షితః అన్నారు పెద్దలు. ఇలాంటి మంచి సందేశాన్నిస్తూ వనాలను సంరక్షించుకోవాలనే నేపథ్యంతో పూర్తి తెలంగాణ పల్లెటూరి బ్యాక్ డ్రాప్‌లో చిత్రీకరించిన అరుదైన సినిమా కలివి వనం. ఈ చిత్రంలో రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, బిత్తిరి సత్తి, బలగం సత్య నారాయణ, మహేంద్ర నాథ్, సతీష్ శ్రీ చరణ్, అశోక్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. హీరోయిన్‌గా నాగదుర్గ పరిచయమవుతోంది. కలివి వనం సినిమాను ఏఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్ నరేంద్ర రచనా దర్శకత్వంలో మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిలు నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న చిత్ర టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు.. ఈ కార్యక్రమానికి మీడియా మిత్రులు జర్నలిస్ట్ టీ.యఫ్.జె.ఏ. ప్రెసిడెంట్ లక్ష్మి నారాయణ,జర్నలిస్ట్ టీ.యఫ్.జె.ఏ. వైస్ ప్రెసిడెంట్ వై.జె రాంబాబు, గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డు జ్యూరీ మెంబెర్ లక్ష్మి నారాయణ, సినీజోష్ సీఈఓ రాంబాబు, గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రాఘవ, దుష్చర్ల సత్యనారాయణల చేతుల మీదుగా చిత్ర టీజర్‌ను గ్రాండ్‌గా విడుదల చేశారు. అనంతరం దుష్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ, పంచభూతాల్లాగే చెట్టు కూడా ప్రకృతి మాత. పంచభూతాలతో పాట ఆ చెట్టు తల్లి ఆశీస్సులు ఈ చిత్రానికి ఉండాలి. వనాలు బాగుంటే జనాలు బాగుంటారు. నాకు కూడా చెట్లంటే ఇష్టం. అభివృద్ధి పేరుతో చెట్లను నరకడం అన్యాయం. కలివి వనం చిత్రంతో పర్యావరణం గురించి మంచి సందేశం ఇచ్చారు. ఈ సినిమా మన సమాజానికి ఒక మార్గం వేయాలి, పర్యావరణ రక్షణ గురించి మన ప్రజల్లో ఆలోచన రేకెత్తించాలి అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ మదీన్ ఎస్.కె మాట్లాడుతూ, నేను ఈ చిత్రానికి మ్యూజిక్ చేయగలను అని నమ్మి అవకాశం ఇచ్చిన మా డైరెక్టర్ రాజ్ అన్నకు, ప్రొడ్యూసర్స్ మల్లికార్జున్, విష్ణువర్ధన్ రెడ్డికి థ్యాంక్స్. నేను ఎక్కువగా మాట్లాడకున్నా, నేను కంపోజ్ చేసిన టీజర్ మాట్లాడుతుంది. ఈసినిమాకు మంచి మ్యూజిక్ ఇచ్చేందుకు నా వంతు ప్రయత్నం చేశానని భావిస్తున్నా. నేను రిక్వెస్ట్ చేయగానే పాట రాసిన కాసర్ల శ్యామ్‌అన్నకు థ్యాంక్స్ అన్నారు. నటుడు బలగం సత్యనారాయణ మాట్లాడుతూ, సామాజిక స్పృహతో చేసిన సినిమా కలివి వనం. బలగం చిత్రంతో నాకు ఎంత పేరొచ్చిందో ఈ చిత్రానికి కూడా అలాంటి గుర్తింపే వస్తుందని ఆశిస్తున్నా. నటుడు సతీష్ కుమార్ మాట్లాడుతూ, అందరికీ వరల్డ్ ఎన్విరాన్ మెంట్ డే శుభాకాంక్షలు. మన పర్యావరణాన్ని మనం కాపాడుకుం దామనే మంచి కాన్సెప్ట్‌తో కలివి వనం సినిమాను డైరెక్టర్ రాజ్ రూపొందించారు. ఈ టీమ్‌తో నాకు సుదీర్ఘ అనుబంధం ఉంది. ఈ చిత్రంలో నేనొక ఇంపార్టెంట్ రోల్ ప్లే చేశాను. ఈ చిత్రంతో ప్రేక్షకుల రివార్డ్స్‌తో పాటు అవార్డ్స్ దక్కాలి.



# 'మిత్ర మండలి' ఫస్ట్ లుక్

బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న నూతన చిత్రం నుంచి ఇటీవల విడుదలైన ప్రీ లుక్‌కి విశేష స్పందన లభించిన సంగతి తెలిసిందే. ముసుగు అవతారాలలో ఉన్న నటులు ఎవరో తెలుసుకోవాలనే ఆసక్తి అందరిలో కలిగింది. దీని గురించి సామాజికమాధ్యమాల్లో కూడా తెగ చర్చ జరిగింది. తాజాగా ఈ చిత్రం నుంచి టైటిల్‌తో కూడిన ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఈ చిత్రానికి మిత్ర మండలి అనే ఆసక్తికర టైటిల్ ను ఖరారు చేశారు. టైటిల్ తో పాటు, అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా విడుదలైంది. ఫస్ట్ లుక్ అందరి అంచనాలను అందుకునేలా కట్టిపడేసేలా ఉంది. ఈ పోస్టర్ నీలిరంగు ముసుగుల వెనుక ఉన్న గ్యాంగ్ ను పరిచయం చేసింది. ప్రియదర్శి, రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. అపరిమిత వినోదాన్ని అందించడానికి ఈ గ్యాంగ్ సిద్ధమవుతోంది. సోషల్ మీడియా సంచలనం నిహారిక ఎన్.ఎం. మిత్ర మండలి చిత్రంతో తెలుగులోకి అరంగేట్రం చేస్తుండటం విశేషం. సోషల్ మీడియా ద్వారా వివిధ భాషల ప్రేక్షకులకు చేరువైన నిహారిక.. ఇటీవల మిషన్ ఇంపాజిబుల్ ది ఫైనల్ రెకనింగ్ కోసం టామ్ క్రూజ్‌తో కలిసి పనిచేసి వార్తల్లో నిలిచారు. అద్భుతమైన నటన, కామిక్ టైమింగ్, భిన్నమైన పాత్రల ఎంపికతో ప్రియదర్శి తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆయనకు మ్యాడ్ ఫేమ్ విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా వంటి ప్రతిభగల నటులు తోడయ్యారు. ఈ నలుగురు కలిసి మిత్ర మండలితో అద్భుతమైన వినోదాన్ని అందిస్తారు అనడంలో సందేహం లేదు. బన్నీ వాస్ తాను నూతనంగా ప్రారంభించిన బి.వి. వర్క్స్ పతాకంపై మిత్ర మండలి చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



# నాగార్జున ఇంట పెళ్లి బాజాలు

టాలీవుడ్‌కి చెందిన ప్రముఖ కుటుంబాల్లో అక్కినేని కుటుంబం కూడా ఒకటి. మరి అక్కినేని కుటుంబంలో కింగ్ నాగార్జున వారసుడు అఖిల్ అక్కినేని పెళ్లిపై గత కొన్ని రోజులు నుంచి వినిపిస్తున్న వార్తల కోసం అందరికీ తెలిసిందే.అయితే ఈ పెళ్లి ఎట్టకేలకు అట్టహాసంగా ఈ జూన్ 6 తెల్లవారు జామున 3 గంటలకి జరిగింది. నూతన వధూవరులు అఖిల్ ఇంకా జైనాబ్‌లు వేద మంత్రాలు సాక్షిగా పెళ్లి బంధంతో ఒకటయ్యారు. అక్కినేని నాగార్జున స్వగృహంలోనే ఈ పెళ్లి గ్రాండ్‌గా జరగడం విశేషం. మరి మెగాస్టార్ చిరంజీవి ఇంకా తన వారసుడు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ దంపతులు ఇంకా పలువురు రాజకీయనాయకులు సహా బిజినెస్ మ్యాగ్నెట్ పలువురు కూడా హాజరయ్యి కొత్త జంటకి తమ ఆశీస్సులుఅందించారు. ఈఆదివారం గ్రాండ్‌గా రిసెప్షన్‌ని ప్లాన్ చేయగా దీనికి మరింతమంది ముఖ్య అతిథులు హాజరు కానున్నారట.






# బాలీవుడ్ సినిమాలో 'రష్మిక'కు మళ్లీ ఛాన్స్

ప్రస్తుతం స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న జెట్ స్పీడ్‌లో దూసుకెళుతోంది. దక్షిణాదితో పాటు బాలీవుడ్‌లోనూ వరుసగా క్రేజీ ఆఫర్లు అందుకుంటోంది అందాల తార. ముఖ్యంగా బాలీవుడ్‌లో ఈ బ్యూటీకి వరుసగా సినిమా ఛాన్సులు వస్తున్నాయి. ఇటీవల సల్మాన్ ఖాన్‌తో కలిసి సికందర్ సినిమాలో నటించింది రష్మిక. రంజాన్ సందర్భంగా విడుదలైన ఈ సినిమా పెద్దగా ఆడలేదు. అయితే ఒక ఫ్లాప్ సినిమా వచ్చినప్పటికీ, రష్మికకు ఇప్పుడు మరో మంచి బాలీవుడ్ సినిమా అవకాశం వచ్చింది. 2012లో విడుదలైన కాక్‌టెయిల్ సూపర్ హిట్‌గా నిలిచింది. సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొనే, డయానా పెంటీ నటించిన ఈ మల్టీ స్టారర్ మూవీ హిందీ ఆడియెన్స్‌ను బాగా అలరించింది. ఒక మోడ్రన్ అమ్మాయి, ఒక ట్రెడిషనల్ లేడీ, ప్లేబాయ్ లాంటి అబ్బాయి మధ్య జరిగే ముక్కోణపు ప్రేమకథగా ఈ మూవీ తెరకెక్కింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా కాక్ టెయిల్ 2 నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రష్మికకు హీరోయిన్ పాత్ర ఇచ్చారు. కాక్‌టెయిల్ 2 చిత్రానికి లవ్ రంజన్ దర్శకత్వం వహిస్తుండగా, మ్యాడ్‌లాక్ విజయన్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. కాక్‌టెయిల్ లాగే, కాక్‌టెయిల్ 2 కూడా ముక్కోణపు ప్రేమ కథగా తెరకెక్కనుంది. ఇందులో రష్మిక మందన్న ఒక కీలక పాత్రలో నటించనుంది. అలాగే కృతి సనన్ కూడా సెకెండ్ ఫిమేల్ లీడ్‌గా యాక్ట్ చేస్తోంది. షాహిద్ కపూర్ ప్లే బాయ్ పాత్రలో కనిపించనున్నాడని సమాచారం.



# 'బ్యాచిలర్స్ ప్రేమకథలు' ప్రారంభం

యస్.యం. 4 ఫిలిమ్స్ బ్యానర్ పై గీత సింగ్, కార్తీక్, కాశీ మదన్, ఇషాని, చలానా అగ్నిహోత్రి, శృతి లయ నటీనటులుగా యం.యన్. వి సాగర్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న చిత్రం బ్యాచిలర్స్ ప్రేమ కథలు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో ఘనంగా జరుపుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ప్రముఖ దర్శకులు వి. సముద్ర కెమెరా స్విచ్చాన్ చేయగా, ప్రముఖ దర్శకులు వీర శంకర్ క్లాప్ ఇచ్చారు. అనంతరం చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చిత్ర దర్శక, నిర్మాత, సాగర్ మాట్లాడుతూ, ఇంతకుముందు నేను తీసిన కాలం రాసిన కథలు సినిమాకు ప్రేక్షకులనుండి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఆ ఉత్సాహంతో దానికి సీక్వెల్‌గా బ్యాచిలర్స్ ప్రేమ కథలు సినిమా తీస్తున్నాను ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు మంచి షోషల్ మెసేజ్ ఇవ్వబోతున్నాను.అలాగే ఇందులో కూడా నూతన నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాను. ఈ నెలలో షూటింగ్ స్టార్ట్ చేసుకుంటున్న ఈ సినిమాను త్వరలో షూటింగ్ పూర్తి చేసుకొని 2025 లోనే విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. నటి గీతా సింగ్ మాట్లాడుతూ, ఆడియన్స్ అందరూ నా పాత్రకు కామెడీ ఎక్స్పెక్ట్ చేస్తారు. కానీ అందుకు భిన్నంగా ఈ సినిమాలో ఎమోషనల్ పాత్ర చేయబోతున్నాను. ఈ సినిమా ద్వారా సెకండ్ ఇన్నింగ్ స్టార్ట్ చేసే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాత సాగర్‌కి నా ధన్యవాదాలు అన్నారు.నటుడు కార్తీక్ మాట్లాడుతూ, యూత్ మెచ్చే మంచి మెసేజ్ ఉన్న ఇలాంటి సినిమా ద్వారా ఇండస్ట్రీకు పరిచయం చేస్తున్న సాగర్‌కి నా ధన్యవాదాలు. నటుడు కాశీ మదన్ మాట్లాడుతూ, ఇప్పటివరకు బ్యాచులర్స్ పై వచ్చిన సినిమాలన్నీ మంచి హిట్ అయ్యాయి. ఇప్పుడు అదే కోవలో వస్తున్న బ్యాచిలర్స్ ప్రేమకథలు సినిమాను కూడా ప్రేక్షకులందరూ ఆదరించి ఆశీర్వదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. డి ఓ పి. ప్రసాద్ ఎస్ మాట్లాడుతూ, ఇలాంటి



మంచి కాన్సెప్ట్ ఉన్న సినిమాలు యూత్‌ని ఆకట్టుకుంటాయి. నటి ఇషాని మాట్లాడుతూ, బెంగళూరులో మోడలింగ్ చేస్తూ సినిమాలో నటించాలని హంటింగ్‌చేస్తున్న నాకు యస్.యం. 4 ఫిలిమ్స్ బ్యానర్‌లో వస్తున్న బ్యాచిలర్స్ ప్రేమ కథలు సినిమాలో నటించే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాత సాగర్‌కి నా ధన్యవాదాలు. నటి శృతి లయ మాట్లాడుతూ, ఈ స్టోరీ విన్నప్పుడు చాలా ఎక్సైట్‌గా ఫీల్ అయ్యాను మంచి సోషల్ మెసేజ్ ఇస్తున్న ఇలాంటి సినిమాలో నటించే అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది అన్నారు.

# జీన్స్‌తో నిద్ర వద్దు !



సందర్భం ఏదైనా.. కొంతమంది జీన్స్‌లోనే సౌకర్యంగా ఫీలవుతారు. అయినా ఇంటికొచ్చాక ఈ దుస్తులు మార్చుకొని వదులుగా, సౌకర్యవంతంగా ఉండే నైట్‌వేర్ ధరిస్తుంటాం. కానీ ఒక్కోసారి అనుకోకుండా స్నేహితుల ఇంటికి వెళ్లినా లేదంటే ప్రయాణాల్లో.. అదే జీన్స్‌లో నిద్రపోవాల్సి రావచ్చు. దీనివల్ల అసౌకర్యమే కాదు. ఆరోగ్యపరంగానూ కొన్ని సమస్యలు తప్పవంటున్నారు నిపుణులు. ముఖ్యంగా ప్రత్యుత్పత్తి వ్యవస్థపై ఇది ప్రతికూల ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం..

**అందుకే ఫంగల్ ఇన్ఫెక్షన్లు !** జీన్స్ .. డెనిమ్ ఫ్యాబ్రిక్‌తో తయారవుతుంది. త్వరగా చెమటను పీల్చుకునే స్వభావం ఈ మెటీరియల్‌కు ఉండదు. అందులోనూ స్కిన్ టైట్ జీన్స్ అయితే ఇక చెప్పే పనే లేదు. ఫలితంగా జననేంద్రియాల వద్ద చెమట అలాగే ఉండిపోతుంది. ఈ తేమతోనే గంటల తరబడి ఉండిపోవడం వల్ల ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తుంది. ఇది క్రమంగా ప్రత్యుత్పత్తి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అలాగే బిగుతైన దుస్తుల వల్ల ఆయా శరీర భాగాలకు గాలి ప్రసరణ సరిగ్గా జరగక.. అక్కడి చర్మంపై దురద, దద్దుర్లు, ఎరుపెక్కడం.. వంటి సమస్యలొస్తాయి. కాబట్టి సాధ్యమైనంత తక్కువ సమయం జీన్స్ ధరించేలా చూసుకోవ డం మంచిదంటున్నారు నిపుణులు. ముఖ్యంగా కాలంతో సంబంధం లేకుండా చెమట ఎక్కువగా వచ్చేవారు ఈ విషయంలో మరింత అలర్ట్‌గా ఉండడం మంచి దంటున్నారు.

**నిద్రకు అంతరాయం !** సాధారణంగా నిద్రలోకి జారుకున్న కొన్ని గంటలకు శరీర ఉష్ణోగ్రత క్రమంగా తగ్గుతూ వస్తుంది. అయితే జీన్స్ ధరించి నిద్రపోయినప్పుడు గాలి ప్రసరణ సరిగ్గా జరగక శరీర ఉష్ణోగ్రత మరింత పెరుగుతుంది. తద్వారా నిద్రకు అంత రాయం ఏర్పడుతుందని ఓ అధ్యయనంలో తేలింది. అంతేకాదు. జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి పడుకోవడం వల్ల అసౌకర్యంగానూ అనిపిస్తుంటుంది. ఇది కూడా సుఖనిద్రను దూరం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు.

**నెలసరి నొప్పి తీవ్రంగా...** జీన్స్ వంటి బిగుతైన దుస్తులు ధరించి నిద్ర పోవడం వల్ల గర్భాశయం, పొత్తి కడుపు, జననేంద్రియాలపై ఒత్తిడి పడుతుంది. అలాగే ఆయా భాగాలకు రక్తప్రసరణ కూడా సాఫీగా సాగదు. వీటన్నింటి మూలంగా నెలసరి సమయంలో నొప్పి మరింత తీవ్రమవుతుంది. మరోవైపు ఇలాంటి బిగుతైన దుస్తుల వల్ల నడుంనొప్పి, కడుపుబ్బరం, వంటి సమస్యలు వచ్చే అవకాశాలూ ఎక్కువంటున్నారు నిపుణులు. కాబట్టి పడుకునేటప్పుడైనా, ఇతర సమయాల్లో అయినా సాధ్యమైనంత వరకు వదులుగా ఉండే కాటన్ దుస్తులకు ప్రాధాన్యమివ్వడం మంచిది. ◻

# భావితరాలకు ఆదర్శం ప్రవక్తల జీవితం



***నేడు బక్రీద్. ముస్లింలు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే రెండు పండగల్లో రెండవది బక్రీద్. మక్కాలో శనివారం బక్రీద్ పండగ సందర్భంగా ఈదుల్ అజ్‌హా ప్రార్థనల్ని కోట్లాది మంది భక్తులు ఆచరించనున్నారు. భారత దేశంలో నేడు జరుపుకోనున్నారు .***

ప్రపంచంలోని ముస్లింలు నమాజు ఆచరించి వెళ్ళి ఖుర్బానీ ఇవ్వాల్సి ఉంటుంది కాబట్టి ఉదయం 9గంటల లోపల అన్ని ఈద్‌గాహ్‌లలో నమాజులు పూర్తి చేయుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఖుర్బానీ ప్రాధాన్యత: ముస్లిం సోదరులు ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండగల్లో రెండు ప్రధానమైనవి. ఇందులో 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు ఆచరించి జరుపుకు పండగను రంజాన్ అంటారు. ఇస్లాం మత వ్యాప్తి కోసం దేవుని ఆజ్ఞ కోసం తన కన్నబిడ్డను సైతం తన చేతులతో బలి (ఖుర్బానీ) ఇచ్చిన రోజూ బక్రీద్ అంటారు. మానవుడు ఆచరించాల్సి న నాలుగు ధర్మాలను పవిత్ర రంజాన్ మాసంలో ఆచరించగా ఐదవది అయిన హజ్ సందర్శనం బక్రీద్‌లో ఆచరిస్తారు. 'బక్రీ' అంటే మేక అని ఈద్ అంటే 'పండగ' అని అర్థం. బక్రీద్ అంటే దైవాజ్ఞను పాటించే భక్తులు దేనైనా సమర్పిస్తారు (ఖుర్బానీ )అనటానికి నిదర్శనంగా చెప్పవచ్చు. మానవుని సృష్టించిన అల్లాహ్ ప్రపంచంలో అన్ని విధాల సదుపాయాల్ని కల్పించి వాటిని అనుభవిస్తూ తనను ధ్యానం చేయమని ఆదేశించాడు. ఈ ఆదేశాలను ఆచరించిన ప్రవక్తల జీవితాలను భావితరాలకు అందించేందుకు పవిత్ర ఖుర్ ఆన్‌లో పలు సంఘటనలను పొందుపరచారు. అలాగే హదీసుల్లో వివరించారు. బక్రీద్ ప్రాధాన్యతకు సంబంధించి ఖురాన్‌లోని అల్ తౌబా 24లో పేర్కొన్నారు. ఇబ్రహీం సొలైఅలా అలాహోసొల్లాం భగవంతుని ఆజ్ఞతో తన కన్న బిడ్డను బలి ఇవ్వటం గమనిస్తే 'త్యాగనిరతి'కి నిదర్శనంగా చెప్పవచ్చు, ఈ పండగ సందర్భంగా జరిపే ప్రార్థనలను 'ఈదుల్ అజహ్' అని చెబుతారు. పండగలంటే కొత్త బట్టలు ధరించటం, సంతోషంగా గడపడమే కాదు. అన్ని జన్మల్లో కెల్లా అత్యుత్తమమైన మానవ జన్మను ప్రసాదించిన భగవంతునికి కృతజ్ఞతలు తెల్పుకుంటూ, భక్తి ప్రపత్తులతో ఆయన సన్నిధిలో సామూహికంగా మోకరిల్లి తమ జీవితాలను సన్మార్గంలో నడుపుటకు ప్రార్థిస్తూ పునరంకితం చేసుకోవటం అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలోనే పవిత్ర స్థలమైన 'మక్కాలో' హజ్ జరపటం అని చెప్పవచ్చు. బక్రీద్ ప్రాధాన్యత ఏమిటి- బిడ్డను బలిఇచ్చిన వైనం ఏమిటి? బక్రీద్ అంటే మేకను బలి ఇవ్వటం అని చెబుతారు. అయితే ఈ సంఘటన వెనుక సంఘటనలు ఏమిటని పరిశీలిస్తే భగవంతుని ఆజ్ఞ కోసం కన్నబిడ్డలను కూడా నిర్దాక్షిణ్యంగా బలి ఇచ్చే ప్రవక్తలున్నారా? అనే కథనం సాక్ష్యంగా ఉంది. ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం ఖలీలుల్లా భగవంతుని మార్గంలో నడుస్తుండే వారు. అయితే వారి తాత తండ్రులు విగ్రహారాధన చేసే వారు. కానీ ఇబ్రహీం మాత్రం విగ్రహారాధన కూడదనే వారు. భగవంతుడు బావి తరాలకు తమ భక్తుల చరిత్రలు చాటిచెప్ప టానికి ఎన్నో పరీక్షలు చేసే వారు. అలాంటి పరీక్షల్లో ఇబ్రహీం ఖలీలుల్లా కూడా ఒకరై ఇస్లాం చరిత్రలో చిరస్థాయిగా నిలిచారు. ఇబ్రహీం ఖలీలుల్లాను 'దేవుని మిత్రుడనే' పేరు కూడా ఉంది. ఆతన్ని భగవంతుడు పరీక్షించ దలచారు. 80 సంవత్సరాల వయసు వరకు ఇబ్రహీం ఖలీలుల్లాకు సంతతి లేదు. తరువాత వారి ప్రార్థనలతో రెండవ భార్య హాజీరాకు ఓ మగసంతానం కల్గింది. ఈ బిడ్డకు వారు ఇస్మాయిల్‌జబీ ఉల్లా అని పేరు పెట్టారు. 80 సంవత్సరాల తరువాత మగసంతానం కల్గటంతో ఇబ్రహీం ఖలీలుల్లా వారి భార్యలు సారా సొల్లే అలాహోసొల్లాం, హాజీరాలు ఎంతో ప్రేమానురాగాలతో చూసుకునే వారు. అయితే దేవుడు ఆయన్ను పరీక్షించదలచి దైవదూత జిబ్రాయిల్ ద్వారా ఓ సందేశాన్ని పంపారు. దాని ప్రకారం 80 సంవత్సరాల తరువాత జన్మించిన చిన్నారిని, పురిటిలో ఉన్న భార్య హాజిరాను నేటి జమ్ జమ్ బావి ఉన్న చోట నాడు మనుషులే కాదు. కనీసం పక్షులు కూడా సంచరించని ఎడారిలో కనీసం నీటి చుక్క కంటికి కనబడని ప్రాంతంలో వదలి పెట్టారు. భార్య హాజీరా తనను ఎందుకు ఇక్కడ వదలి పెడుతున్నారని ప్రశ్నించగా ఇది దైవాజ్ఞ అని ఇబ్రహీం ఖలీలుల్లా సమాధానం చెప్పటం గమనించదగ్గ విషయం. ఆమెతో పాటు ఇష్కఇజా(చర్మపు సంచి)లో ఖర్జూరపు కాయలు, కొంత నీటిని మాత్రమే ఉంచారు. ఎడారిలో ఓ పెద్ద కొండ వెనుక వదలి పెట్టారు. ఆయన ఇచ్చిన ఖర్జూరపు కాయలు, నీరు పూర్తికాగా మంచినీటి కోసం ఆమె పరితపించి పడిన అగచాట్లు వర్ణనా తీతం. ఆ చిన్నారి పాలకోసం ఏడుస్తూ నేలమీద కాలు రువ్వగా వచ్చిన నీటి కొలనే నేడు 'జమ్ జమ్' అంటారు. హాజిరా నీటి కోసం ఆహారం కోసం పరితపించిన ప్రాంతాన్నే 'నేడు హాజ్‌కు వెళ్ళు యాత్రికులు' సంచరించే సఫా, మరువా మైదానా లంటారు. ఈ ప్రాంతాల్లో నేడు హజ్ యాత్రికులు తప్పని సరిగా (ఫర్జ్) సందర్శిస్తారు. దేవుని ఆజ్ఞతో బిడ్డను బలి ఇచ్చిన ప్రవక్తః తరువాత ఇస్మాయిల్‌జబీ ఉల్లాకు నాలుగుసంవత్సరాల వయస్సు వచ్చింది. రోజుల బిడ్డగా ఉన్నపుడే పరీక్షలను ఎదుర్కొన్న ఆయనకు మరో అగ్నిపరీక్ష ఎదురైంది. తన తండ్రి ఇబ్రాహీం ఖలీలుల్లా ఎంతో ప్రేమగా చూసుకునే వారు. భగవంతుడు మరో సారి తన మిత్రుడు అయిన ఇబ్రాహీం ఖలీలుల్లాకు పరీక్ష పెట్టారు. ఆయన కలలో వరుసగా మూడు రోజులు 'నీకు అత్యంత ప్రీతిపాత్రమైన దానినిత్యజించాలని' వచ్చింది. మొదటి రోజు కలకు పరిహారంగా ఒంటెలను ఖుర్బానీ ఇస్తారు. రెండవ రోజూ అలాగే కల వచ్చింది. 60 సురఖ్ (బాగా ఆరోగ్యంగా) ఉన్న ఎరుపు రంగు కల్గిన ఒంటెలను బలిదానం ఇచ్చారు. మూడో రోజు కూడా అలాగే కల వచ్చింది. దాంతో ఖలీలుల్లా ఆలోచనలో పడ్డారు. తనకు ప్రపంచంలో అన్నింటి కన్నా అత్యంత ప్రీతిపాత్రమైనది తన బిడ్డ ఇస్మాయిల్. కాబట్టి దైవాజ్ఞ తన బిడ్డను బలి కోరుతోందని నిర్ణయించుకున్నారు. అయితే కన్నతండ్రి కడుపుతీపి ఆతన్ని కలచి వేస్తున్నా భగవంతుని ఆజ్ఞను పాటించటం తన ధర్మంగా భావించారు. దాంతో తన సతీమణిని ఇస్మాయిల్‌ను తన సే న్నహితుని మిలాఖత్( కలప టానికి) కోసం తీసుకెళుతున్నాను చక్కగా అలంకరించాలని సూచిస్తారు. భర్త మాటను జవదాటని హాజిరా ఇస్మాయిల్‌ను ముస్తాబు చేసారు. అయితే 'సైతాన్' హాజీరాను, ఇస్మాయిల్‌ను పలుమార్లు రెచ్చగొడుతూ ఇ బ్రహీం భగవంతుని ఆజ్ఞతో బలి ఇవ్వటానికి తీసుకెళుతున్నారని భగ్నపరచుటకు ప్రయత్నించినా ఫలించలేదు. ఆ చిన్నారి ఇస్మాయిల్‌ను సైతాన్ నిన్ను మీ తండ్రి భగవంతుని ఆజ్ఞతో బలి ఇవ్వటానికి తీసుకెళుతున్నారన్నపుడు దేవును ఆజ్ఞను పాటించటం కన్నా తనకు ఏం కావాలని ప్రశ్నించటం గమనించదగ్గ విషయం. ఇబ్రహీం చేతిలో తాడు(రోప్) కత్తి కళ్ళ నుంచి నీరు పెల్లుబుతుండగా గుండె నిండా విషాదంతో మైదానంలోకి తీసుకెళ్ళారు. అయితే తండ్రి తనను బలి ఇచ్చే టప్పుడు ఆయన చేతులు వణుతాయని తాను గిల గిల్లాడే సమయంలో ఓర్చుకోలేరు కాబట్టి తండ్రీ!నన్ను బలి ఇచ్చేటప్పుడు మీరు కళ్ళకు గంతలు కట్టుకోండి. నా కాళ్ళు చేతులు కట్టిపడేయండి, నన్ను బోర్లా పడుకోబెట్టండి అని సూచించటం ఆ తండ్రి గుండెల్ని పిండివేసింది. ఆ తండ్రి కొడుకుల త్యాగనిరతి భావితరాలకు మార్గదర్శకంగా మారింది. అయితే బలి ఇచ్చే సమయంలో కత్తి తెగకపోవటం ఇబ్రాహీం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయటం కత్తి నుంచి అశరీర వాణి 'ఇబ్రహీం నేను నీ ఆజ్ఞను పాటించాలా? దేవుని ఆజ్ఞను పాటించాలా? అని' ప్రశ్నించటం సత్యసంధతకు నిదర్శనంగా నిలిచింది. దేవుడు తన మిత్రుని దైవాజ్ఞన పాలనను మెచ్చి జిబ్రాయిల్ ద్వారా స్వర్గం నుంచి ఓ దుంబా( మంచి జాతి పొట్టేలు లాంటిది)ను పంపటం కత్తి దాని మెడమీద తెగటం జరిగింది. దీనినే ఖుర్బానీ అంటారు. ఈ సంఘటనకు నిదర్శనంగా నేడు 'బక్రిద్'పండగను జరుపుకుంటున్నారు.




**- ఎస్.రహంతుల్లా,**

## వారి అడుగుజాడల్లోనే పిల్లలు

**పిల్లలు అన్ని విషయాలు నేర్చుకునేది తమ తల్లిదండ్రుల నుంచే కదా! అయితే ఆడవారు తమ నైపుణ్యాలతో అందనంత ఎత్తుకు ఎదుగుతోన్న ఈ రోజుల్లోనూ కొన్ని చోట్ల మహిళలను ఎదగనివ్వకుండా చేస్తున్నాయి పలు మూసధోరణులు.** వీటిని బద్దలుకొట్టాలనే విషయాన్ని అమ్మాయిలు ఎదిగే క్రమంలో ఉద్యోగం చేస్తోన్న తమ తల్లుల్ని చూసే నేర్చుకుంటుంటారు. ఉద్యోగం చేసే అమ్మలు. తమ కూతుళ్లపై ఎంతవరకు ప్రభావం చూపుతున్నారు? అనే అంశంపై హార్వర్డ్ యూనివర్శిటీ గతంలో నిర్వహించిన ఒక అధ్యయనంలో సైతం ఈ విషయం నిరూపితమైంది. ఇందులో భాగంగా.. చాలామంది ఉద్యోగినుల కూతుళ్లు ఉన్నత విద్యార్హతలతో, మంచి ఉద్యోగం చేస్తూ, ఎక్కువ సంపాదిస్తున్నట్లు తేలింది. కాబట్టి వర్కింగ్ మదర్స్ ఇలా కెరీర్ విషయంలోనూ తమ కూతుళ్లకు మార్గదర్శకంగా నిలుస్తారన్నమాట!



**సమయం విలువ తెలుస్తుంది....** ఉద్యోగం చేసే తల్లులకు ప్రతి క్షణం ఎంతో విలువైనది. ఎందుకంటే ఇటు ఇంటి పనులు, అటు ఆఫీసు బాధ్యతలతో పాటు పిల్లల బాధ్యతల చూసుకోవడానికి కూడా సమానంగా సమయం కేటాయించాల్సి ఉంటుంది. ఇందులోనూ వర్కింగ్ మదర్స్ సక్సెస్ సాధించడంతో తమ తల్లుల్ని చూసి వారి పిల్లలకూ క్రమశిక్షణ, సమయ పాలన అలవడతాయి. ఇంట్లో ఉండి అనవసర విషయాలకు ఆందోళన చెందుతూ, తమ ఒత్తిళ్లను, చికాకును పిల్లలపై రుద్దే తల్లుల కంటే ఉద్యోగ బాధ్యతలు నిర్వరిస్తూ, ఎలాంటి చీకూ-చింతా లేకుండా పిల్లలతో గడిపే తల్లులే ఎక్కువగా హ్యాపీగా ఉంటారని పలు అధ్యయనాల్లో రుజువైంది. చాలామంది ఉద్యోగినుల్లో అటు ఆఫీసు పనులు, ఇటు ఇంటి పనులు, పిల్లలకు సమయాన్ని కేటాయించడం తప్ప మరే అనవసర ఆలోచనలు మదిలో మెదిలే అవకాశమే ఉండదు. ◻

## వెంరువునిచ్చే స్క్రబ్

పెళ్లిల్లో కాబోయే వధువులు షాపింగ్ లూ, స్నేహితులతో పార్టీలూ అంటూ తరచూ బయటే తిరగాల్సి వస్తుంది. దీంతో తీరా వివాహ సమయానికి ముఖం కళావిహీనంగా మారుతుంది. ఇలాంటప్పుడు చర్మం పునరుత్తేజం పొందడానికి ఈ సహజ స్క్రబ్‌లు మేలు చేస్తాయి. ఎండ ప్రభావానికి చర్మం నిర్జీవంగా మారిందా? కప్పు అరటిపండు గుజ్జుకి చెంచా చక్కెర కలిపి ముఖానికి రాసి రుద్దండి. ఇలా పది నిమిషాలు చేసి శుభ్రం చేస్తే చాలు. ఇందులో ఉండే విటమిన్ ఎ,బి,ఇ పొటాషియం వంటి పోషకాలు చర్మంపై మృతకణాలను తొలగించి మృదువుగా మారుస్తుంది. రెండు చెంచాల కాఫీ పొడిలో కాస్త తేనె కలిపి ఓ పదినిమి షాల పాటు ముఖాన్ని రుద్దండి. కాఫీ స్కబ్ ముఖంపై ఉన్న మృతకణాలను సులువుగా తొలగిస్తుంది. చర్మాన్ని బిగుతుగా చేసి, ప్రకాశవంతంగా మారు స్తుంది. రెండు టేబుల్ స్పూన్ల ఓట్స్‌లో కాసిని పాలు, తేనె, గులాబీనీళ్ల కలిపి ముఖానికి రాయాలి. మునివేళ్లతో కనీసం పది నిమిషాలైనా రుద్దిచల్లటి నీటితో కడగాలి. ఇలా చేయడంవల్ల మొటిమలు, మచ్చలు తగ్గ చర్మం కాంతి మంతంగా మెరుస్తుంది. . కప్పు కలబందలో రెండు చెంచాల చక్కెర, నిమ్మను కలిపి ముఖానికి స్క్రబ్ చేయాలి. ఇది కంటికింద నల్లటి వలయాలను దూరంచేసి, చర్మాన్ని తేమగా ఉంచుతాయి. ◻



## హెయిర్ స్ట్రెయిట్‌నింగ్‌గా..

**ఉంగరాల జుట్టు చూడటానికి** బాగున్నా దాంతో అంత ఈజీ కాదు. సహజంగానే ఓ పట్టాన చిక్కులు రావు. ఇక తలస్నానం చేసినప్పుడయితే ఆ బాధ వర్ణనాతీతం. చాలామంది అది పడలేకే స్ట్రెయిట్‌నింగ్ వైపు అడుగులు వేస్తుంటారు. ఏవేవో ప్రయత్నాలు చేసి స్ట్రెయిట్ చేయించినా కొద్ది రోజులకే మళ్లీ మొదటికొస్తుంది. పైగా ఆ సమయంలో వాడే రసాయనాలు భవిష్యత్తులో కిడ్నీలపై ప్రభావం చూపించే అవకాశం ఉదంటున్నారు నిపుణులు. జుత్తుకి తీసుకునే ట్రీట్‌మెంట్ వల్ల శరీర భాగాలు పాడవడమేంటి అనుకుంటున్నారా? అయితే దీనికి ఇంగ్లాండ్‌లో జరిగిన ఓ ఘటనే ఉదాహరణ. ఓ మహిళ మూడేళ్లలో మూడుసార్లు స్ట్రెయింగ్‌నింగ్ ట్రీట్‌మెంట్ తీసుకుందట. అలా తీసుకున్నా ప్రతిసారీ వాంతులు, విరేచ నాలు, జ్వరం, వెన్నునొప్పి లాంటివి వచ్చి విపరీతంగా బాధని అనుభవిం చిందట. అంతేనా.. స్ట్రెయిట్‌నింగ్ ట్రీట్‌మెంట్‌లో వాడే క్రీముల్లో ఉండే గ్లైఆక్సిలిక్ ఆమ్లం చర్మం ద్వారా శరీరంలోకి చొచ్చుకెళ్లి ఆక్సిలిక్ ఆమ్లాన్ని విడుదల చేస్తుందట. దానివల్ల కాల్షియం అధికమై చిన్న చిన్న క్రిస్టల్స్‌గా తయారై కిడ్నీలు పాడయ్యాయట. అందుకే దీర్ఘకాలిక కిడ్నీ సమస్యతో ఇబ్బంది పడుతున్న వారు స్ట్రెయిట్‌నింగ్ దూరంగా ఉండటమే మంచిది. సాధారణంగా ఈ అలవాటు ఉన్నవారు మూడు నుంచి నాలుగు నెలలపాటు విరామం తీసుకోవాలి. వెంటవెంటనే తీసుకోవడం వల్ల జుట్టూ పాడవుతుంది. ఆరోగ్యమూ దెబ్బతింటుంది. రసాయనాలపాళ్లు అధికంగా ఉన్నవీ, గడువు ముగిసిన ఉత్పత్తులూ వాడి ప్రాణం మీదకితెచ్చుకోవద్దం టున్నారు పరిశోధకులు. మీ శరీరానికి ఏం కావాలో ఏం వద్దో మీకు ఓ అంచనా ఉంటుంది. ఏదైనా రసాయనాలు పడటం లేదు అనిపించినప్పుడు దానికి దూరంగా ఉండండి. తప్పదు అనుకున్నప్పుడు ఏవైనా ఇంటి చిట్కాలు ప్రయత్నించండి. అంతేతప్ప బాధని భరించి ప్రయోగాలు చేయకండి. అది ఎప్పటికైనా మీ ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని గమనించుకోండి. ◻



## ఇంటర్వ్యూలో ఇలా వద్దు..

కొంతమందికి ఇంటర్వ్యూ అంటేనే భయం, ఆందోలనలతో చెమటలు పడుతుంటాయి. మరి ఈ సమస్య నుంచి బయట పడేదెలా అంటారా.. ఈ చిట్కాలు మీ కోసమే. చాలామంది ఇంటర్వ్యూకి కొన్ని రోజుల ముందే అన్నీ చదువుకుని, ప్రాక్టీస్ అయి సిద్ధంగా ఉంటారు. తీరా భయంతో తెలిసిన ప్రశ్నలకీ సమాధానం తప్పుగా చెబుతుంటారు. తరవాత అయ్యో నాకు తెలుసు కదా అనుకుంటారు. దీనికి కారణం వారు మానసికంగా సన్నద్ధం కాలేకపోవడమే. ఇలాంటి సందర్భంలోనే మన బలహీనతలను బలంగా ఉ పయోగించుకోగలగాలి. మీకు అంతగా ఇబ్బందిగా ఉంటే నేను అసౌకర్యంగా ఫీలవు తున్నాను అని వారికి చెప్పండి. వారే అర్థం చేసుకుంటారు. లేదా ఇంటర్వ్యూకి వెళ్లే ముందు ఒకసారి అద్దం ముందు సాధన చేయండి. కాస్త భయం పోతుంది. ఇంటర్వ్యూకి సమయపాలన చాలా ముఖ్యం. ఆలస్యంగా వెళితే మీకు టైమ్ మేనెజ్‌మెంట్ లేదు అనుకుంటారు. ఈ సమయపాలనను బట్టే ఈ ఉద్యోగానికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో వారికి తెలుస్తుంది. అందుకే ఎప్పుడైనా ఇంటర్వ్యూకి 15 నిమిషాల ముందు చేరుకోవడం మంచిది. అంతేకాదు, కొన్ని కంపెనీలు దుస్తుల కోడ్ పెడుతుంటాయి. వాటిని తప్పకుండా అనుసరించాలి. ఎందుకంటే మనడ్రెసింగ్‌ని బట్టీ కొన్నిసార్లు ఉద్యోగానికి ఎంపిక చేసే అవకాశం ఉంటుంది. ఇంటర్వ్యూలో ప్రవర్తన కూడా చాలా ముఖ్యం. కొంతమంది కంగారులో ఫోన్ ఆన్‌లో పెట్టి ఇంటర్వ్యూ గదిలోకి వెళ్తుంటారు. అదేమో అప్పుడే మోగుతుంది. నిర్లక్ష్యంగా పరిగణిస్తారు జాగ్రత్త! ఆదేకాదు అవతలివారు మాట్లాడుతున్నప్పుడు మీరు దిక్కులు చూసినా, అతిగా నవ్వినా క్రమశిక్షణ లేదు అనుకుని రిజెక్ట్ చేస్తారు. కాబట్టి లోనికి వెళ్లేముందే అన్నీ సరి చూసుకోండి. ఇంటర్వ్యూ చేసేవాళ్లపట్ల మర్యాదగా ప్రవర్తించాలి. ◻



## అప్పటికప్పుడు వేడిగా..



**వర్షం చలి మొదలయి పోయింది.** ఎంత వేడిగా వండి వడ్డిదామను కున్నా భోజనాల బల్ల మీద కూర్చునే సరికి వంటకాలన్నీ చల్లారిపోతుంటాయి. తిరిగి వాటిని వేడిచేయాలంటే వేరే పాత్రలోకి తీసుకుని పొయ్యిమీద పెట్టాలి. మళ్లీ వాటన్నింటినీ తోముకోవాలి. ఇంత పని లేకుండా.. మీరే సమయంలోనైనా వేడి తినాలనుకుంటే ఈ గ్రేవీ వార్మర్ మీ దగ్గర ఉంటే చాలు. చూడాడనికి చక్కని సెరామిక్ బౌల్‌లా ఉంది కదా! అదే దీని ప్రత్యేకత. వండిన వంటలనీ ఈ బౌల్‌కి తీసుకుంటే చాలు. దీనికి అడుగున కరెంట్‌తో పనిచేసే ఒక బేస్ ఉంటుంది. దానికి కాసేపు ఛార్జింగ్ పెట్టి తీసేస్తే చాలు. ఈ బేస్‌పై వార్మర్‌ని ఉంచితే గంటపాటు వంటకాలు వేడిగా ఉంటాయి. డైనింగ్ టేబుల్‌పై తక్కువ స్థలంలో అందంగా అమరిపోతుంది. ◻




## పొగాకు జీవితాన్ని హరిస్తుంది



**డాక్టర్ కె.ఉమాదేవి**
**తిరుపతి**

**ఆరోగ్య భాగ్యం**

పొగాకు మానేయడం మీ ఆరోగ్యానికి మరియు అందరికి విజయం శుభ్రంగా ఊపిరి పీల్చుకొని పచ్చగా జీవించండి. ఈ రోజే పొగాకు మానేయండి. మీరు పొగ త్రాగని ప్రతి సిగరెట్ మీ ఆరోగ్యానికి విజయం. పొగాకు మీ శ్వాసని దొంగలిస్తుంది. అది మీ జీవితాన్ని దొంగలించనివ్వకండి. ఇలా పొగాకు వినియోగం వల్ల ఎదురయ్యే అనర్థాల్ని వివరించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1988 నుంచి పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తోంది. అందుకే ప్రతి ఏటా మే 31న ప్రపంచవ్యాప్తంగా దీన్ని నిర్వహిస్తూ జాతీయ ధూమపానరహిత నెలగా జూన్ మాసాన్ని ప్రకటించడమైనది. ధూమపానం యొక్క దుష్ప్రభావాల్ని ఎలా, ఏ విధంగా గుర్తించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలో తెలుసుకుందాం. భారతదేశంలో 1508లో పొగాకుని దక్షిణ అమెరికా వారు ప్రవేశపెట్టడంతో క్రమేణా ఇది ఒక ప్రధాన వాణిజ్య పంట అయింది. ప్రపంచ మార్కెట్‌లో పొగాకు దాదాపు 80% వాటాని కల్గి ఉంటుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా పొగతాగే వారి సంఖ్య పెరిగిపోతుంది. పొగాకు ఉత్పత్తుల్ని వివిధ రకాల పదార్థాలతో తయారు చేస్తారు. పొగాకు వాటి సంకలనాల్ని కాల్చినపుడు ఉత్పత్తి అయ్యే పొగలో 4000 కంటే ఎక్కువ రసాయన సమ్మేళనాలు, 40 కేన్సర్ కారకాలు, 70% నికోటిన్, టార్ ఉంటుంది. ఇవి చాలా వరకు విషపూరితమైనవి. వీటలోని హైడ్రోకార్బన్స్, కార్బన్‌డయాక్సైడ్, కార్బన్‌మోనక్సైడ్ వాయువులు శరీరం లోపలికి పోయి ఆక్సిజన్ లేకుండా చేయడం వల్ల రక్త నాళాల్లో రక్తం గడ్డకట్టి గుండె, రక్తనాళాల వ్యాధులకు కారణమవుతుంది. ఎండిన పొగాకు ఆకుల్ని ప్రధానంగా సిగరెట్స్, బీడీలు, సిగార్లు, పైపులు, షిపాలలో ఉంచి త్రాగడానికి ఉపయోగిస్తారు. వీటిని స్నఫ్, చూయింగ్ పొగాకు, డిప్పింగ్ పొగాకు, స్నస్‌గా కూడా తినవచ్చు. దీంతో మనదేశంలో 35 కోట్ల మంది ధూమపానానికి బానిసలైన వారున్నారని అంచనా ప్రతిరోజు సుమారు 5వేల మందికి పైగా కొత్తగా ధూమపానం ప్రారంభిస్తున్నారు. ముఖ్యంగా వారిలో 15 సంవత్సరాలు దాటిన యుక్త వయస్కులుండడం ఆందోళన కల్గించే విషయం అనే చెప్పాలి. రోజుకు 10 సిగరెట్స్ త్రాగితే కేన్సర్ వచ్చే అవకాశాలు 10 రెట్లు ఎక్కువ. అలాగే రోజుకు 25 సిగరెట్స్ తాగితే కేన్సర్ వచ్చే అవకాశాలు 25 రెట్లు ఎక్కువగా ఉంటుంది పొగ తాగే వారిలో ఆల్కహాల్ అలవాటుంటే వారికి కేన్సర్ వచ్చే అవకాశాలు పదింతలుంటుంది. ప్రతి 10 మందిలో 8 మంది వివిధ కేన్సర్స్ తో మరణిస్తున్నారు. కేన్సర్‌తో మరణించేవారిలో 30శాతం మేరకు ఊపిరితిత్తుల కేన్సర్‌తో మరణిస్తున్నారు. దీంతోపాటు గర్భాశయ కేన్సర్, మూత్రాశయం, కిడ్నీ, కాలేయం, పాంక్రియా టిక్ కేన్సర్లు, లింఫోమా, మల, ప్రేగు కేన్సర్, అన్నవాహిక, స్వంపేటిక, నోరు గొంతు, కడుపు కేన్సర్స్ 48.3% కేసుల్లో కన్పిస్తాయి. ◻



# లక్నో టీమ్‌లో భారీ మార్పులు



## కోచింగ్ స్టాఫ్, ప్లేయర్లపై వేటు

## యాజమాన్యం కఠిన నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** ఐపిఎల్ 18వ సీజన్ ముగిసి పట్టుమని వారం రోజులైనా కాలేదు. అప్పుడే కొన్ని జట్లు కోచింగ్ సిబ్బంది మార్చే పనిలో బిజీగా మారాయి. ఇందులో భాగంగా వరుసగా రెండుసార్లు సీజన్లలో నిరాశపరిచిన లక్నో సూపర్‌జెయింట్స్ తన టీమ్‌లో భారీ మార్పులకు సిద్ధం అవుతోంది. కెప్టెన్ కెఎల్ రాహుల్‌తో జట్టు నిర్వహణ సమస్యల కారణంగా లక్నో సూపర్ జెయింట్స్ టీమ్‌ను పూర్తిగా మార్చాల్సి వచ్చింది. గతేడాది జరిగిన ఐపిఎల్ మెగా వేలంలో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు కొంతమంది మంచి ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. అయితే, ఈ ఏడాది కూడా వారు ట్రోఫీని గెలవలేకపోయారు. ఈ సీజనులో ఆడిన 14 మ్యాచ్‌లలో 6 మ్యాచ్‌లలో మాత్రమే వారు గెలిచారు. ప్రారంభంలో గెలిచి పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, సీజన్ చివరి నాటికి వారు 7వ స్థానంలో ఉన్నారు. దీని కారణంగా, జట్టు యాజమాన్యం కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. తమ ఫ్రాంచైజీ నిరుడు, ఈ ఏడాది ప్లే ఆఫ్స్‌కు చేరకపోవడంతో లక్నో ఫ్రాంచైజీ చైర్మన్ సంజీవ్ గొయెంకా అసంతృప్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కోచింగ్ స్టాఫ్‌లోని కొందరిపై వేటు తప్పదన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. వీళ్లలో మెంటార్ జహీర్ ఖాన్ పేరు కూడా ఉండే అవకాశం ఉందని లక్నో వర్గాలు చెబుతున్నాయి. టీమిండియా 2011లో వరల్డ్ కప్ గెలుపొందిన తర్వాత జట్టులో సభ్యుడైన జహీర్ ఖాన్ నిరుడు లక్నో కోచింగ్ యూనిట్లో చేరాడు. హెడ్ కోచ్ జస్టిస్ లాంగర్ తో కలిసి మెంటార్‌గా వ్యూహారచనలు చేశాడు మాజీ పేసర్. అయితే ఈ ఐపిఎల్ 18వ సీజన్ లక్నో తీవ్రంగా నిరాశపరిచింది. ఆరంభంలో అదుర్స్ అనిపించినా కీలక మ్యాచుల్లో మాత్రం ఓడిపోయింది. 14 మ్యాచుల్లో 6విజయాలతో ప్లేఆఫ్స్ బెర్తుకు దూరం అయ్యింది. ఇక వేలంలో రికార్డు ధర పలికిన కెప్టెన్ రిషభ్ పంత్ ఆఖరి మ్యాచులో సెంచరీ మినహా పెద్దగా రాణించినట్లు అనిపించలేదు. అతన్ని సానబెట్టడంలో మెంటార్‌గా జహీర్ ఖాన్ విఫలమయ్యాడని సంజీవ్ గొయెంకా భావిస్తున్నారు.

అయితే ఈ సీజన్‌లో చెలరేగి ఆడాలనుకున్న లక్నో మైదానంలో మాత్రం తేలిపోయింది. మరోవైపు హిట్టర్ నికోలస్ పూరన్, మిడిలార్డర్‌లో సమద్ తేలిపోవడంతో ఆ జట్టు విజయావకాశాలు దెబ్బతిన్నాయి. దాంతో వచ్చే సీజన్‌కు పక్కాగా సిద్ధం కావాలనే ఆలోచనతో ఉన్న ఆయన కొత్త మెంటార్ కోసం చూస్తున్నాడని తెలుస్తోంది. అదే నిజం అయితే లక్నో మెంటార్‌గా జహీర్ పదవీ కాలం ఈ ఏడాదితో ముగియనుందని చెప్పవచ్చు.



## ఫిఫా ప్రపంచ కప్ విజేత అల్వారెజ్

### 1-0తో చిలీ ఔట్

**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచ కప్-2026 క్వాలిఫైయర్‌లో అర్జెంటీనా ప్రత్యర్థి చిలీని ఓడించడంతో జూలియన్ అల్వారెజ్ విజేతగా నిలిచాడు. శాంటియాగోలో శుక్రవారం జరిగిన వారి ఫిఫా ప్రపంచ కప్ 2026 క్వాలిఫైయర్ అర్జెంటీనాకు 1-0 తేడాతో పేలవమైన విజయంగా ముగిసింది, జూలియన్ అల్వారెజ్ 23వ నిమిషంలో విజేతగా నిలిచాడు. ఇప్పటికే ప్రపంచ కప్‌కు అర్హత సాధించిన అర్జెంటీనా, దాని కెప్టెన్ మెస్సీతో ఆటను ప్రారంభించింది. నికో పాజ్, జూలియన్ అల్వారెజ్ మరియు గియోవన్నీ సిమియోన్ వంటి యువకులు తమ జట్టును గెలిపించుకునేందుకు తీవ్ర యత్నాలు చేశారు. అయితే, లక్ష్యం వైపు తొలి షాట్ చిలీ కొట్టింది. అలెక్సిస్ సాంచెజ్ బాక్స్ వెలుపల నుండి గోల్ కొట్టాడు, 3వ నిమిషంలో ఎమిలి యానో మార్టినెజ్ దానిని సేవ్ చేశాడు. చివరి మూడవ బంతిలో థియాగో అల్మాడ అల్వారెజ్‌కి త్రూ బాల్‌ను అందించాడు, అతను బంతిని గోల్ కీపర్ బ్రయాన్ కోర్టెస్‌పైకి చిప్ చేశాడు. దీంతో బంతి వుడ్‌వర్క్ లోపలి భాగాన్ని తాకిన తర్వాత లైన్‌దాటింది. విరామం తర్వాత చిలీ తిరిగి ఆటలోకి ప్రవేశించడానికి ప్రయత్నించింది, గంట సమయం తర్వాత దాదాపు కొన్ని నిమిషాల పాటు గోల్ చేసే ప్రయత్నం చేసింది, లక్ష్యాన్ని మూడుసార్లు షూట్ చేసింది. కానీ మార్టినెజ్ యొక్క శీఘ్ర ప్రతిచర్యలు మరియు అర్జెంటీనా యొక్క అప్రమత్తమైన తక్కువ బ్లాక్ అల్బిసెలెస్టేకు పూర్తి పాయింట్లను నిర్ధారించాయి. ఈ ఫలితం స్టాండింగ్స్‌లో అర్జెంటీనాకు తిరుగులేని ఆధిక్యాన్ని ఇచ్చింది, ఫలితంగా చిలీ పట్టికలో అట్టడుగున నిలిచింది, దీంతో ప్రపంచ కప్ కల బహుశా ముగిసే అవకాశం ఉంది. తదుపరి మ్యాచ్‌లో అర్జెంటీనా కొలంబియాతో తలపడనుంది, చిలీ బొలీవియాతో తలపడనుంది, రెండు మ్యాచ్‌లు ఈ నెల 10న జరగనున్నాయి. టాప్ ఆరు జట్లు 2026 ప్రపంచ కప్‌కు అర్హత సాధిస్తాయి.



## టెన్నిస్ టోర్నీలో.. హైదరాబాద్ అమ్మాయి

## రష్మిక సంచలనం

**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య డబ్ల్యూ75 మహిళల టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సంచలనం సృష్టించింది. అమెరికాలోని సౌత్ కరోలినాలోని సమ్టర్‌లో జరిగిన ఈ టోర్నీలో సింగిల్స్ విభాగంలో తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 335 ర్యాంకర్ రష్మిక 3-6, 6-3, 6-3తో టాప్ సీడ్, ప్రపంచ 212వ ర్యాంకర్ అమెరికాకు చెందిన హనా చాంగ్‌ను బోల్తా కొట్టించింది. 2 గంటల 31 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రష్మిక ఒక ఏస్ కొట్టి, నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయిన రష్మిక ప్రత్యర్థి సర్వీస్‌ను అరుసార్లు బ్రేక్ చేసింది. ప్రి క్వార్టర్ ఫైనల్లో అమెరికాకే చెందిన జూలియా ఫ్లిగ్నెర్‌తో రష్మిక తలపడనుంది. కాగా డబుల్స్‌లో రష్మిక (భారత్)-కేథరిన్ సెబోవ్ (కెనడా) జోడీ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుంది. తొలి రౌండ్‌లో రష్మిక-కేథరీన్ ద్వయం 7-6 (8/6), 6-4తో అమెరికా ద్వయం అక్లి-డలేనా హెవిట్‌పై గెలిచింది.

## ఇండొనేసియా ఓపెన్ బ్యాడ్మింటన్‌లో..

## సాత్విక్-చిరాగ్ ఓటమి



**న్యూఢిల్లీ:** ఇండోనేషియా ఓపెన్ బ్యాడ్మింటన్‌లో భారత్‌కు చెందిన డబుల్ ద్వయం రాంకిరెడ్డి సాత్విక్ సాయిరాజ్-శెట్టి చిరాగ్‌లు ఓటమి పాలయ్యారు. సాత్విక్-చిరాగ్ ఓటమితో పోటీలో భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. దీంతో ఈ టోర్నీలో భారత్ క్రీడాకారుల పోరు ముగిసింది. బిడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో వరుసగా రెండో వారం, మాజీ ప్రపంచ నంబర్ 1 పురుషుల డబుల్స్ జోడీ, భారత్‌కు చెందిన సాత్విక్-చిరాగ్ చివరి వరకూ పోటీలో నిలిచారు, కానీ ఇండోనేషియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్స్‌లో వారి ప్రచారం అర్థంతరంగా ముగిసింది. జకర్తాలో శుక్రవారం 43 నిముషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో 19-21, 16-21 తేడాతో మలేషియాకు చెందిన ప్రపంచ నంబర్ 7 మాన్ వీ చోంగ్-టీ కై వున్ చేతిలో భారత్ జోడీ ఓటమిపాలైంది. జకార్తాలో జరిగిన ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో వారు మరోసారి వెనుకబడి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నారు. ఇది ఈ సంవత్సరం మూడవ బ్యాడ్మింటన్ మేజర్ ఈవెంట్. 2023 ఛాంపియన్‌లైన స్వాక్-చిరాగ్, 68 నిమిషాల రెండవ రౌండ్ పోరులో ప్రపంచ 16వ ర్యాంక్ డానిష్ జంట రాస్మస్ క్జెర్ మరియు ఫ్రెడరిక్ సోగార్డ్‌పై 16-21, 21-18, 22-20 తేడాతో విజయం సాధించి, ఒత్తిడిలో కూడా గొప్ప స్వభావాన్ని ప్రదర్శించారు. గత వారం సింగపూర్ ఓపెన్ సూపర్ 750లో సెమీఫైనల్‌కు చేరుకున్న సాత్విక్-చిరాగ్ జకార్తాలో తమ అత్యుత్తమ ప్రదర్శనను కనబరచలేదు. సింగపూర్‌లో జరిగిన సెమీఫైనల్‌కు వెళ్లే మార్గంలో కొత్త ప్రపంచ నంబర్ 1 జోడీ గో స్జె ఫీ మరియు నూర్ ఇజ్జుద్దీన్‌లను ఓడించారు, అక్కడ వారు చివరికి ఆరోన్ చియా మరియు సోహ్ వూయి యిక్‌లలో తమ ప్రత్యర్థి చేతిలో ఓడిపోయారు.






## ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3..

## వరుస ఓటములతో భారత్ ఆర్చర్లు

**న్యూఢిల్లీ:** చైనాలో జరిగిన మునుపటి దశలో 2 స్వర్ణాలు, ఒక రజతం, 4 కాంస్య పతకాలను సాధించిన భారతదేశ ఆర్చర్లు, ప్రస్తుతం జరుగుతున్న ఈవెంట్‌లో ఇంకా విజయాల మార్కును దాటలేకపోయారు. టర్కీలోని అంటాల్యలో శుక్రవారం జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 3లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన కాంపౌండ్ ఆర్చర్లు టర్కీలో నిరాశపరిచే ప్రచారాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. మహిళల వ్యక్తిగత ఈవెంట్ క్వార్టర్ ఫైనల్‌లో మెక్సికన్ మరియానా బెర్నాల్ 159-152 తేడాతో విజయం సాధించడంతో భారత్‌కు చెందిన మధుర ధమన్ గోంకర్‌కు నిష్క్రమణ తప్పలేదు. బెర్నాల్ స్వదేశీయురాలు ఆండ్రియా బెకెరా ప్రపంచ ఛాంపియన్, భారత్‌కు చెందిన అదితి స్వామిని 152-147 తేడాతో ఓడించింది. ఇక ప్రీ క్వార్టర్ ఫైనల్స్‌లో అభిషేక్ వర్మను 157-154 తేడాతో ఓడించిన భారత్‌కు చెందిన రిషబ్ యాదవ్, పురుషుల విభాగంలో క్వార్టర్స్‌లో ఫ్రెంచ్‌కు చెందిన నికోలస్ గిరార్డ్ చేతిలో 149-157 తేడాతో ఓడిపోయాడు. అలాగే ప్రపంచ ఛాంపియన్ భారత్‌కు చెందిన ఓజాస్ డియోటేల్ అమెరికన్ జేమ్స్ లూట్జ్ చేతిలో తొలి రౌండ్‌లో షాక్ తిన్నాడు, ఆ మ్యాచ్‌లో అతను 157-161 తేడాతో ఓడిపోయాడు. కాగా కాంపౌండ్ టీమ్ ఈవెంట్ నుంచి భారత్ నిష్క్రమించింది. అయితే కాంపౌండ్ మరియు రికర్వ్ ఈవెంట్లలో మిక్స్‌డ్ విభాగంలో వరుస అపజయాల నుండి బయట పడాలని భారత్ ఆర్చలు పట్టుదలతో ఉన్నారు.

# ఆర్‌బిఐ రెపోరేట్ @ 0.5%

**ముంబై, జూన్ 6:** విశ్లేషకుల అంచనాలను నిజం చేస్తూ కీలక వడ్డీ రేట్లను ముచ్చటగా మూడోసారి ఆర్‌బీఐ సవరించింది. ఈసారి రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన కమిటీ నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. తాజా తగ్గింపుతో రెపో రేటు 6 శాతం నుంచి 5.50 శాతానికి దిగొచ్చింది. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ కీలక వడ్డీరేట్లను కేంద్ర బ్యాంకు 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో కలుపుకుంటే.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు రెపోరేటు ఒకశాతం వరకు తగ్గింది. వడ్డీరేటు తగ్గింపుతో గృహ, వాహన, ఇతర రుణగ్రహీతలపై వడ్డీ భారం ఇంకాస్త తగ్గనుంది. అంతేగాక, మార్కెట్‌లో ద్రవ్య లభ్యత పెరగనుంది. ఇక, స్టాండింగ్ డిపాజిట్ ఫెసిలిటీ రేటును 5.25 శాతంగా, మార్జినల్ స్టాండింగ్ ఫెసిలిటీ రేటును 5.75శాతం ఉంచినట్లు గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. ద్రవ్య పరపతి విధాన కమిటీ సర్దుబాటు వైఖరి నుంచి స్థిర విధానానికి మారాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితులు నెలకొన్నా భారత ఆర్థికవ్యవస్థ బలంగా, స్థిరంగా కొనసాగుతోంది. వేగంగా వృద్ధి చెందుతోంది. పెట్టుబడిదారులకు అపార అవకాశాలు కల్పిస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 6.5శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయి. తొలి త్రైమాసికంలో 6.5శాతం, రెండో త్రైమాసికంలో 6.7శాతం జీడీపీ నమోదవ్వొచ్చని అంచనా. మూడు, నాలుగు త్రైమాసికాల్లో వృద్ధి రేటు వరుసగా 6.6 శాతం, 6.4శాతం ఉండొచ్చు.



ఆహార పదార్థాల ధరలు తగ్గుముఖం పడుతుండటంతో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం అంచనాలను 4 శాతం నుంచి 3.7 శాతానికి తగ్గిస్తున్నాం. బ్యాంకుల వద్ద నగదు నిల్వల నిష్పత్తిని 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గిస్తున్నాం. రూ.2.5లక్షల కోట్ల బ్యాంకు నిధులను విడుదల చేయనున్నాం. దీంతో బ్యాంకు మరిన్ని రుణాలు మంజూరు చేసేందుకు వీలు కల్పించినట్లవుతుంది. ఈఏడాది జనవరి నుంచి రూ.9.5లక్షల కోట్లు ద్రవ్యాన్ని వ్యవస్థలోకి తీసుకొచ్చాం. విదేశీ మారక నిల్వలు 691.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. దీంతో మరో 11 నెలల వరకు దిగుమతులకు ఇబ్బంది ఉండదు. ఈక్విటీల్లో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం ఇవి 1.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

## టెస్లాకు 150 బిలియన్ డాలర్ల లాస్!

**వాషింగ్టన్, జూన్ 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య స్నేహ బంధం చెడింది. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలుపునకు సొంత డబ్బును నీళ్లలా ఖర్చు చేసిన మస్క్ ఇప్పుడు అదే ట్రంప్ వైఖరిని తప్పుబడుతున్నారు. ఇటీవల డోజ్ శాఖ నుంచి వైదొలిగిన మస్క్.. బహిరంగంగానే ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేస్తున్నారు. అదే సమయంలో మస్క్‌కుట్రంప్ స్ట్రాంగ్ వార్నింగ్ కూడా ఇస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో మస్క్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయన సంస్థ టెస్లా షేర్లు భారీగా పతనమయ్యాయి. గురువారం నాటి ట్రేడింగ్‌లో టెస్లా షేర్లు ఏకంగా 14శాతం పతనమయ్యాయి. దాదాపు 152 బిలియన్ డాలర్ల సంపద ఆవిరైంది. అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.13 లక్షల కోట్లన్న మాట. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 1 లక్ష కోట్ల మార్క్‌ను కోల్పోయి 916 బిలియన్ డాలర్లకు పడిపోయింది. టెస్లా సంపద ఒక్క రోజులోనే ఈ స్థాయిలో తరిగిపోవడం సంస్థ చరిత్రలోనే ఇదే తొలి సారి కావడం గమనార్హం.అమెరికన్లకు పన్ను తగ్గించేందుకు బిగ్ ట్యాక్స్ బ్రేక్ బిల్లును ట్రంప్ యంత్రాంగం తీసుకొచ్చింది. ట్రంప్‌మస్క్ మధ్య దూరానికి ఈ బిల్లే ప్రధాన కారణమని చెప్తున్నారు. ఈ బిల్లుతో ధనికులకు 4.5 లక్షల కోట్ల డాలర్ల మేర లబ్ధి చేకూరి, పేదలకు ఉద్దేశించిన సంక్షేమ పథకాలు మరుగున పడుతాయని మస్క్ తప్పుబడుతున్నారు. ఇదో అసహ్యకరమైనబిల్లుగా ఆయన అభివర్ణించారు. రుణ పరి మితిని పెంచి అమెరికా ఆర్థికాన్ని దివాలా తీయించేలా ఉన్న ఇలాంటి బిల్లుకు మద్దతిచ్చిన వారికి సిగ్గు ఉండాలని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కిల్ ది బిల్ అంటూ ట్వీట్ చేశారు. అయితే, ఎలక్ట్రిక్ కార్లకు రాయితీ తగ్గింపు అంశం బిల్లులో ఉండటం వల్లే మస్క్ దీన్ని వ్యతిరేకిస్తున్నారని ట్రంప్ వర్గం ఎదురుదాడికి దిగుతున్నది.




## చిన్న మొత్తం గోల్డ్ లోన్స్‌కు ఆర్‌బిఐ సవరింపులు


**న్యూఢిల్లీ, జూన్ 6:** బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించి త్వరలోనే మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడించారు. ఒకటి రెండు రోజుల్లో కొత్త రూల్స్ వస్తాయని పరపతి విధాన సమీక్ష నిర్ణయాల వెల్లడి సందర్భంగా ఈ అంశంపై ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.2.5 లక్షల కంటే తక్కువ రుణాలు తీసుకునే వారికి లోన్‌టువాల్యూ 75 శాతం నుంచి 85 శాతానికి సవరిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ సూచన మేరకు ఆర్‌బీఐ తన మార్గదర్శకాలను సవరించినట్లు తెలుస్తోంది. పసిడి రుణాల విషయంలో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఒకేతరహా నిబంధనలు ఉండాలన్న ఉద్దేశంతో ఆర్‌బీఐ ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. రుణ గరిష్ఠ విలువ, తనఖా రుణం తరహా, చెల్లింపులకు సంబంధించిన రూల్స్‌ను ఇందులో పొందుపరిచింది. మరోవైపు ఆర్‌బీఐ గవర్నర్ నుంచి ఈ ప్రకటన రావడంతో బంగారం తాకట్టు పెట్టి రుణాలు జారీ చేసే సంస్థల షేర్లు రాణించాయి. ముఖ్యంగా మణప్పురం షేర్లు 5.64 శాతం మేర రాణించి రూ.247వద్ద, ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు 6.98శాతం లాభంతో రూ.2,454 వద్ద స్థిరపడ్డాయి.



## తగ్గనున్న హోమ్‌లోన్ ఇఎంఐ భారం

## వాణిజ్యం

**న్యూఢిల్లీ, జూన్ 6:** నెలవారీ చెల్లింపుల వాయిదా భారం మోస్తున్న గృహ వినియోగదారులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరోసారి శుభవార్త చెప్పింది. కీలక వడ్డీరేట్లను ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించి మరింత ఊరట కల్పించింది. ఆర్‌బీఐ ఇలా రెపోరేటును సవరించడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. మొత్తంగా ఇప్పటివరకు ఒక శాతం వరకు వడ్డీరేటును తగ్గించింది. తాజా నిర్ణయంతో గృహ రుణగ్రహీతలపై ఈఎంఐ భారం మరింత తగ్గనుంది. ఫ్లోటింగ్ రేట్‌పై గృహ రుణాన్ని తీసుకున్న వారికి సవరించిన వడ్డీరేటు ఆధారంగా ఊరట లభించనుంది. 2019 అక్టోబర్ 1 తర్వాత జారీ చేసిన గృహ రుణాలన్నీ ఫ్లోటింగ్ రేటుతో జారీ అయినవే. కాబట్టి వారికి బ్యాంకులు ఆ మేరకు వడ్డీ రేట్లను సవరిస్తాయి. పాత వినియోగదారులకే కాదు.. కొత్తగా రుణాలు తీసుకునే వారు తక్కువ వడ్డీకే రుణాలు పొందొచ్చు. పైగా ఎక్కువ మొత్తంరుణం పొందేందుకు అవకాశం ఉంటుందని బ్యాంకింగ్ నిపుణులు చెబుతున్నారు. ఆర్‌బీఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణగ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. ఉదాహరణకు ఈ ఏడాది జనవరిలో 20 ఏళ్ల కాల వ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుందాం. అప్పట్లో బ్యాంకు వడ్డీరేటు 8.50శాతం ఉంటే.. నెలకు రూ.43,391 చెల్లించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆర్‌బీఐ మూడు దఫాల్లో వడ్డీ రేట్లను సవరించడంతో ఈఎంఐ మొత్తం రూ.40,280కి తగ్గనుంది. అంటేనెలకు దాదాపు రూ.3వేల పైనే ఆదా అవుతుంది. దీర్ఘకాలంలో మొత్తంగా దాదాపు రూ.7.12 లక్షల మేర వడ్డీ భారం తగ్గుతుంది. ఒకవేళ ఈఎంఐని స్థిరంగా ఉంచుకొని కాలవ్యవధిని మార్చుకుంటే గనుక.. రుణ చెల్లింపు గడువు దాదాపు మూడు సంవత్సరాల వరకు తగ్గుతుంది. ఈ ఏడాది జనవరిలో 240 నెలల కాల వ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకున్నారనుకుంటే.. ఆర్‌బీఐ ఊరటతో ఈ కాలవ్యవధి 206 నెలలకు తగ్గుతుంది. అంటే వడ్డీ భారం దాదాపు రూ.14.78 లక్షల మేర ఆదా అవుతుంది.



## ఫీచర్ ఫోన్లలోనూ ఫోన్‌పే!

**న్యూఢిల్లీ, జూన్ 6:** ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ఫీచర్ ఫోన్ వినియోగదారుల కోసం యూపీఐ ఆధారిత చెల్లింపు సేవల్ని ప్రవేశపెట్టనుంది. దీనికోసం జీఎస్‌పే టెక్నాలజీ కన్వర్‌జేషనల్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్ గప్‌చుప్‌ను కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని కంపెనీ స్వయంగా వెల్లడించింది. రానున్న త్రైమాసికాల్లో భారత్‌లో కొత్త ఫీచర్ ఫోన్ల కోసం సొంత యూపీఐ మొబైల్ యాప్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపింది. జీఎస్‌పే అనేది నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధి చేసిన యూపీఐ 123పే ఆధారంగా పనిచేస్తుంది. ఫీచర్ ఫోన్లు వినియోగించే వారికి యూపీఐ సేవలు అందించేందుకు ఇది సాయపడుతుంది. ఫోన్‌పే ఫీచర్ ఫోన్ల కోసం తీసుకురానున్న కొత్త యాప్ ద్వారా పీ2పీ లావాదేవీలు, ఆఫ్‌లైన్ క్యూఆర్ చెల్లింపులు, ఇతర యూపీఐ వినియోగదారుల నుంచి మొబైల్ నంబర్ ద్వారా చెల్లింపులు చేయడం వంటి ఫీచర్లు అందించనుంది. దీంతో ఫీచర్ ఫోన్‌లు, స్మార్ట్‌ఫోన్‌ల మధ్య చెల్లింపులు చేయడం కూడా త్వరలో సాధ్యం కానుంది. ప్రస్తుతం నోకియాకు చెందిన కొన్ని ఫీచర్ ఫోన్లలో గప్‌చుప్ అప్లికేషన్ అందుబాటులో ఉంది. ఈ యాప్‌లో ఎస్సెమ్మెస్ ద్వారా మీ అకౌంట్ నంబర్‌ను అనుసంధానం చేయొచ్చు. తర్వాత యాప్‌లోని పే ఆప్షన్ ఉపయోగించి మొబైల్ నంబర్ లేదా యూపీఐ ఐడీ ద్వారా పేమెంట్స్ చేయొచ్చు. త్వరలో ఇదే స్థానంలో ఫోన్‌పే కొత్త అప్లికేషన్ తీసుకురానుంది. ఫీచర్‌ఫోన్ వినియోగదారులకు డిజిటల్ చెల్లింపుల సేవలు అందిచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫోన్‌పే సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సమీర్ నిగమ్ తెలిపారు.




## రెపోరేట్ ఎఫెక్ట్: లాభాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, జూన్ 6:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆర్‌బీఐ ప్రకటనకు ముందు ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు కీలక వడ్డీ రేట్ల సవరించిన అనంతరం దూసుకెళ్లాయి. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లోనూ కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. ఇప్పుడు ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది. అప్పటి వరకు నష్టాల్లో ట్రేడయిన సూచీలు ఈ ప్రకటనతో లాభాల బాట పట్టాయి. బ్యాంక్, ఆటో, రియాల్టీ షేర్లు రాణించాయి. ఒక దశలో సెన్సెక్స్ 800 పాయింట్ల మేర పెరగ్గా.. నిఫ్టీ 25,000 పైన స్థిరపడింది. సెన్సెక్స్ ఉదయం 81,434.24 పాయింట్ల (క్రితం ముగింపు 81,442.04) వద్ద ఫ్లాట్‌గా ప్రారంభమైంది. ఆర్‌బీఐ ప్రకటన ముందు కాసేపు నష్టాల్లో ట్రేడయింది. ఆ తర్వాత రాణించిన సూచీ ఇంట్రాడేలో 82,299.89 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 746 పాయింట్ల లాభంతో 82188.99వద్ద ముగిసింది. నిఫ్టీ ఇంట్రాడేలో 25,029 వద్ద గరిష్ఠాన్ని చేరి, చివరకు 252 పాయింట్ల లాభంతో 25003 వద్ద ముగిసింది. బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, మారుతీ సుజుకీ, ఇండస్ ఇండ్ బ్యాంక్, బజాజ్ ఫిన్ సర్వ్, ఎటర్నల్, టాటాస్టీల్, ఎంఅండ్‌ఎం, కోటక్ మహీంద్రా బ్యాంక్, టైటాన్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఎస్బీఐ, ఇన్ఫోసిస్, అల్ట్రాటెక్‌సిమెంట్ షేర్లులాభపడ్డాయి. భారతీఎయిర్ టెల్, సన్‌ఫార్మా మాత్రమే నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 65.06 డాలర్ల వద్ద ట్రేడవగా, బంగారం ఔన్సు 3,379 డాలర్ల వద్ద కొనసాగుతోంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.